

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

20.11.2026
శుక్రవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 188
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- మూడో విడత పంచాయతీ ఎన్నికలు
- నవంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లు
- ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా
- 13న తొలి విడత, 16న రెండో విడత
- డిసెంబర్ 2పోలింగ్ నిర్వహిస్తారు
- డిసెంబర్ 2న ఓట్ల లెక్కింపు జరుగుతుంది



2లో..

తినడం, తాగడం, ఎంజాయ్ చేయడం మన కల్చర్ కాదు

- మోడీ కీలక వ్యాఖ్యలు
- పాడుపు, ఆర్థిక క్రమశిక్షణపై కీలక వ్యాఖ్యలు
- పేదరికాన్ని భారత్ జయించింది
- భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి
- అంతే వేగంతో పేదరికాన్ని కూడా జయించింది
- ఫిక్కీ వార్షిక సమావేశంలో పాల్గొని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 19, అనంతజనశక్తి న్యూస్

భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే సమయంలో అంతే వేగంతో పేదరికాన్ని కూడా దేశం జయించిందని ప్రధాని మోదీ అన్నారు. ఈ మేరకు ఫిక్కీ వార్షిక సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. దేశం మరింత ముందుకు వెళ్లడానికి అవసరమైన సంస్కరణలను నిస్సందేహంగా వెల్లడించాలని కార్పొరేట్ సంస్థలను కోరారు. ''గత ప్రభుత్వం పేదరిక నిర్మూలనలో విఫలమైంది. భారత్ ఒకప్పుడు బలహీనమైన ఐదు దేశాల సరసన ఉండేది. 12 ఏళ్లలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా మారిపోయింది. భారత పురోగతికి ప్రపంచం సాక్షిగా నిలుస్తోంది. పాత విధానాలు భారత్ వృద్ధిని అణచివేశాయి.



2లో..

సర్పంచ్ బరిలోకి దిగిన మంత్రి భార్య

- బనగానపల్లె రాజకీయాల్లో
- ఒక్కసారిగా పెరిగిన వేడి
- జనార్దన్ రెడ్డి అర్ధాంగి ఇందిరా రెడ్డి



2లో..

రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి

- రహదారుల నిర్మాణంలో చాలా రికార్డులు సాధించాం: నితిన్ గడ్కరీ

హైదరాబాద్, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

జాతీయ రహదారుల నిర్మాణంలో చాలా రికార్డులు సాధించామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. హైవేల నిర్మాణంలో ఇంజినీర్లు కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్' సదస్సులో ఆయన మాట్లాడారు. రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్‌గా ఉందని చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు మంచిగా ఉంటే భారీగా పెట్టుబడులు వస్తాయని వివరించారు.

2లో..



యువతకు లక్షలాది ఉద్యోగాలే లక్ష్యం

- మూడు ఎకనమిక్ రీజియన్లపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్‌లు
- అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన
- పరిశ్రమల గ్రౌండింగ్ వంటి అంశాలపై ఆదేశాలు
- విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో 167 అభివృద్ధి పనులు
- యాంకర్ ప్రాజెక్టుగా వైజాగ్ బే సిటీని అభివృద్ధి
- విశాఖలో కొత్తగా 15 నుంచి 20 ఐటీ సంస్థలు
- తీర ప్రాంత అభివృద్ధి, కోనసీమ బ్యాక్‌వాటర్స్ అభివృద్ధి

2లో..



స్టేటస్ రిపోర్టుకు తెలంగాణ హైకోర్టు ఆదేశం

- జగన్ అక్రమాస్తుల కేసు వ్యవహారం
- 3 వారాల గడువు కావాలని ప్రభుత్వం అడ్వకేట్లు
- తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా



2లో..

మళ్లీ ఉత్తరాంధ్ర తీరంవైపు అక్వాన్

- ఆరు గంటల్లో గంటకు 12 కిలోమీటర్ల వేగం
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడి
- నేడు మధ్యాహ్నం తీరం దాటే అవకాశం
- గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు

2లో..





అమరావతి, నవంబర్ 19, అనంతజనశక్తి న్యూస్
విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్‌ల అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.. మూడు రీజియన్లల్లో చేపట్టిన ప్రణాళికలు.. అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల గ్రౌండింగ్ వంటి అంశాలపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో పోర్టులు, ఐటీ, డేటా సెంటర్లు, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రాయలసీమ ప్రాంతంలో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమలను ప్రోత్సహించనున్నారు. అమరావతి పరిధిలో క్వాంటం టెక్నాలజీ, ఐటీ, లాజిస్టిక్స్, పోర్టు ఆధారిత పరిశ్రమలు, అగ్రి వాల్యూ చైన్ రంగాలను అభివృద్ధి చేయాలని కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ మూడు ఆర్థిక ప్రాంతాల్లో పెట్టుబడులు తీసుకురావడంతో పాటు స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.

శుభలేఖ ఇవ్వడంలో తప్పేముంది?

- సీఎం చంద్రబాబు నాయుడి వ్యవహారం
- షర్మిలకు అండగా వైఎస్ విజయమ్మ
- బహిరంగ లేఖ... షర్మిల వ్యక్తిత్వంపై బురద చల్లడం బాధాకారం



అమరావతి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

ఏపీ కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల తన కుమార్తె పెళ్లికి రాజకీయ ప్రముఖులను ఆహ్వానిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా సీఎం చంద్రబాబునాయుడిని కలిసి తన కుమార్తె అంజలిరెడ్డి పెళ్లి శుభలేఖను అందించారు. అయితే దీనిపై సాక్షి దినపత్రికలో ఓ కథనం వచ్చింది. దానిపై వైఎస్. షర్మిల మండిపడ్డారు. ఇలా రాయడమేంటంటూ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో వైఎస్. షర్మిలకు అండగా ఆమె తల్లి విజయమ్మ నిలిచినట్టుగా, ఆమె పేరుతో ఓ బహిరంగ లేఖ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది.

2లో..

అజిత్ దోవల్‌కు అమెరికా కోర్టు సమన్లు

- ఢిల్లీలోని మూడు కోర్టులకు విజ్ఞప్తి
- గురుపత్వంత్ సింగ్ పన్నూన్ దాఖలు చేసిన సివిల్ దావా
- మాజీ రా చీఫ్ సామంత్ గోయల్‌కు సమన్లు

2లో..



ఇక ఎన్నికలు కాదు.. విప్లవమే వస్తుంది!

- అజం ఖాన్ సంచలన వ్యాఖ్యలు
- దాస్నా జైలు నుంచి బయటకు
- మద్దతుదారులు ఘన స్వాగతం పలికారు

2లో..

న్యూఢిల్లీ, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సీనియర్ నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి అజం ఖాన్ జైలు నుంచి విడుదలయ్యారు. ఘజియాబాద్‌లోని దాస్నా జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన రాంపూర్‌కు చేరుకోగా, మద్దతుదారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

హైకమాండ్‌కు ఫిర్యాదు చేశాం

- రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- రాజగోపాల్‌రెడ్డి విషయం పరిశీలిస్తున్నాం
- అనిరుధ్ వ్యాఖ్యలను గమనిస్తున్నాం
- క్రమశిక్షణ విషయంలో అందరూ సమానమే
- ఇన్‌ఛార్జి రాగానే అన్ని అంశాలను పరిశీలిస్తారు



2లో..

హైదరాబాద్, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

నాగార్జునసాగర్ పేరుతో కేటీఆర్ కొత్త డ్రామాకు తెరలేపారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. కృష్ణా నీటిని ఏపీకి అప్పగించిందే కేసీఆర్ అని ఆరోపించారు. తెలంగాణ వాటా నుంచి ఒక్క నీటి చుక్కను కూడా తాము పోనివ్వమన్నారు. ''ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్ వ్యాఖ్యలను గమనిస్తున్నాం. క్రమశిక్షణ విషయంలో అందరూ సమానమే.

పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

అమరావతి, నవంబర్ 19, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రాజకీయాల్లో సందడి మరింత పెరిగింది. రాష్ట్రంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఇప్పటికే ఈ నెల 13న తొలి విడత, 16న రెండో విడత ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగా, తాజా నోటిఫికేషన్‌తో మూడో దశ పోరుకు రంగం సిద్ధమైంది.ఈ మూడో విడతలో రాష్ట్రంలోని పలు జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన మండలాల్లోని గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 21న నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. డిసెంబర్ 2వ తేదీన పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కానుంది.నవంబర్ 21ఫారమ్ 1లో ఎన్నికల నోటీసు జారీ, వార్డు వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. నవంబర్ 21 నుంచి 23 వరకు అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరిస్తారు. ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్లు వేయవచ్చు. నవంబర్ 24 దాఖలైన నామినేషన్ల పరిశీలన చేస్తారు. నవంబర్ 25న తిరస్కరణకు గురైన నామినేషన్లపై అప్పీలుకు అవకాశం ఉంటుంది. నవంబర్ 26న నామినేషన్ అప్పీళ్లను పరిష్కరిస్తారు.నవంబర్ 27 నామినేషన్ల ఉపసంహరణను మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుంది. నవంబర్ 27న పోటీలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. డిసెంబర్ 2పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 7 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది. డిసెంబర్ 2న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఫలితాల ప్రకటన మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఉంటుంది.

తినడం, తాగడం, ఎంజాయ్ చేయడం మన కల్చర్ కాదు

(మొదటి పేజీ తరువాయి)

కాలం చెల్లిన విధానాలు దేశాభివృద్ధిని కుంటుపరిచాయి. గత విధానపరమైన వైఫల్యాలు దేశ వృద్ధిని ఆలస్యం చేశాయి'' అన్నారు. కార్పొరేట్ సంస్థలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ''గత 13 ఏళ్లలో భారత్‌లో 50 కోట్ల మంది ప్రజలు పేదరికాన్ని అధిగమించారని ఇటీవల ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. ఇది భాజపా హయాంలోనే సాధ్యమైంది. వ్యాపారులను ప్రోత్సాహించేందుకు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించాం. అదేవిధంగా వ్యక్తిగత వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు ఉన్న వారికి పన్ను మినహాయింపు కల్పించాం. ఇది స్నేహపూర్వక ప్రభుత్వం. మీరంతా (పరిశ్రమ వర్గాలను ఉద్దేశిస్తూ) మా స్నేహితులే. దేశం మరింత వేగంగా పురోగతి సాధించేందుకు అవసరమైన సూచనలను ఓపెన్ మైండ్‌తో చెప్పండి. రాబోయే 20 ఏళ్లలో తీసుకునే ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడులకు 'ఇండియా ఫస్ట్' పునాది కావాలి. ఇది స్వయం సమృద్ధి సాధించడంతో పాటు మీ వ్యాపారానికి మరిన్ని అవకాశాలను అందిస్తుంది'' అని మోదీ అన్నారు. అదేవిధంగా వ్యవసాయం, సంబంధిత రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. పొదుపు, ఆర్థిక క్రమశిక్షణలపై ప్రధాని నరేంద్రమోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం కేంద్ర మంత్రివర్గానికి కీలక సూచనలు చేశారు. భారతీయ సంస్కృతి పొదుపుపై ఆధారపడి ఉందని.. ''తినడం, తాగడం, ఎంజాయ్ చేయడం'' మన భారతీయ సంస్కృతి కాదని ప్రధాని అన్నారు. ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడంలో మనం సాధించిన పురోగతి, ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే మళ్లీ ప్రమాద స్థితికి చేరుతామని మంత్రుల్ని హెచ్చరించారు. ప్రజల పొదుపును ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమని ప్రధాని నొక్కిచెప్పారు.
2011 నుంచి 2023 మధ్యకాలంలో దేశంలోని దాదాపు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారని, ఇది దేశం సాధించిన పెద్ద విజయమని ఆయన అన్నారు. ఈ విజయాన్ని జాతీయ వేడుకగా జరుపుకోవాల్సిన సందర్భమని ప్రధాని మోదీ అభిపర్ణించారు. అయితే, పేదరికం నుంచి బయటకు తీసుకురాకడం మాత్రమే సరిపోదని, మళ్లీ ప్రజలు పేదరికంలోకి వెళ్లకుండా నిరంతర ప్రయత్నాలు అవసరమని ఆయన హెచ్చరించారు.

సర్పంచ్ బరిలోకి దిగిన మంత్రి భార్య

నంద్యాల, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

నంద్యాల జిల్లా బనగానపల్లె రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అర్ధాంగి ఇందిరా రెడ్డి (బీసీ ఇందిరమ్మ) డైరక్ట్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. బనగానపల్లె మేజర్ పంచాయతీ సర్పంచ్ పదవికి ఆమె నామినేషన్‌ను దాఖలు చేశారు. ఒక రాష్ట్ర మంత్రి సతీమణి స్వయంగా స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలవడంతో బనగానపల్లె పంచాయతీ ఎన్నికలు రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తించాయి. బనగానపల్లెలోని ఎంపీడీవో ఆఫీస్‌కి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తల కోలాహలం మధ్య ఇందిరా రెడ్డి చేరుకున్నారు. అక్కడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ వేసేందుకు ఆమె రావడంతో స్థానిక ప్రజల్లోనూ, కూటమి శ్రేణుల్లోనూ కొత్త ఉత్సాహం కనిపించింది. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు స్థానిక స్థాయిలోనే పరిమితమవుతుంటాయి. కానీ నియోజక వర్గ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి స్వయంగా సర్పంచ్ పదవికి పోటీ చేస్తుండటంతో ఈ ఎన్నికకు ఒక ప్రాధాన్యత ఏర్పడింది. నామినేషన్ ప్రక్రియ పూర్తైన తర్వాత ఇందిరా రెడ్డి మీడియాతో మాట్లాడారు. బనగానపల్లె మేజర్ పంచాయతీని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే ఒక ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన ప్రథమ కర్తవ్యమని ఆమె స్పష్టం చేశారు.
అలాగే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు అవసరమైన ప్రాథమిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఇందిరా రెడ్డి తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు డెవలప్‌మెంట్ పనులను వేగవంతం చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించడమే తమ లక్ష్యమని బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. అలాగే బనగానపల్లె నియోజకవర్గ ప్రజలు తమ కుటుంబంపై ఉంచిన నమ్మకం, ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న పూర్తి ధీమాను ఆమె వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి

హైదరాబాద్, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

జాతీయ రహదారుల నిర్మాణంలో చాలా రికార్డులు సాధించామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. హైవేల నిర్మాణంలో ఇంజినీర్లు కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్' సదస్సులో ఆయన మాట్లాడారు. రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్‌గా ఉందని చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు మంచిగా ఉంటే భారీగా పెట్టుబడులు వస్తాయని వివరించారు. ''దేశంలో రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఈ మాటలు చెప్పడం కొంచెం ఇబ్బందిగా ఉన్నా.. చెప్పక తప్పని పరిస్థితి. ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షల మంది చనిపోతున్నారు. వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు. ఇకపై రోడ్లపై బ్లాక్ స్పాట్స్ కనిపించకూడదు. బ్లాక్‌స్పాట్ ఉండకుండా చూడాల్సిన బాధ్యత ఇంజినీర్లదే'' అని గడ్కరీ అన్నారు.
మౌలిక వసతులకు ప్రాధాన్యం: సీఎం రేవంత్‌రెడ్డి
2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను 3 విభాగాలుగా విభజించినట్లు చెప్పారు. రహదారులతో పాటు ఇతర మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. ఉస్మానియా, టిమ్స్ ఆసుపత్రుల్లో కలిపి 8 వేల బెడ్లు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో తెలంగాణ గ్లోబల్ సమిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో పెట్టుబడుల సాధనలో సమిట్ కీలకమని చెప్పారు.

స్టేటస్ రిపోర్టుకు తెలంగాణ హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేసుల ప్రస్తుత పరిస్థితిపై స్టేటస్ రిపోర్టు సమర్పించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. జగన్ కేసులపై స్టేటస్ రిపోర్టు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించగా.. ఈ రిపోర్టు సమర్పించడానికి 3 వారాల గడువు కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోరారు. దీనిపై తెలంగాణ హైకోర్టు అంగీకారం తెలుపుతూ.. తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది.
జగన్ అక్రమాస్తుల కేసులను త్వరగా తేల్చాలని ఈడీ, హరిరామ జోగయ్య తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జగన్ అక్రమాస్తులపై ఇప్పటికే సీబీఐ, ఈడీ అభియోగపత్రాలను దాఖలు చేసింది. సీబీఐ 11, ఈడీ 9 అభియోగపత్రాలు దాఖలు చేయగా.. 15 ఏళ్లుగా విచారణ కొనసాగుతోందని ఈడీ తరఫున న్యాయవాది వాదించారు. పలు కేసుల్లో 150కి పైగా డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. డిశ్చార్జ్ పిటిషన్లపై సీబీఐ కోర్టులో విచారణ జరుగుతోందని కోర్టు దృష్టికి ఈడీ న్యాయవాది తీసుకెళ్లారు.
డిశ్చార్జ్ పిటిషన్లు పెండింగ్‌లో ఉండటంతో కేసుల విచారణ ప్రాథమిక దశలోనే నిలిచిపోయిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వాదనలు వినిపించింది. కేసులను రోజువారీ విచారణను చేపట్టాలని కోరింది. నిందితులు విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును ఈడీ కోరింది. కేసులను రోజువారీగా విచారించాలని హరిరామ జోగయ్య తరఫు న్యాయవాది కోరారు. 2024లోనే రోజువారీ విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పురోగతి లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.
అయితే ప్రత్యేక కోర్టు ప్రిసైడింగ్ జడ్జిని ప్రతివాదిగా ఈడీ చేర్చడంపై హైకోర్టు ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. కేసుల విచారణలో జాప్యం జరిగిందనే కారణంతో న్యాయమూర్తులను ప్రతివాదులుగా చేర్చడం సరికాదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో కోర్టుకు సహకరించేందుకు అమికస్ క్యూరీని నియమించే అంశాన్ని ధర్మాసనం పరిశీలించింది. అమికస్ క్యూరీ నియామకం ద్వారా కేసులో న్యాయపరమైన అంశాలపై సహాయం తీసుకునే అవకాశం ఉంది. ఈ కేసులకు సంబంధించి తదుపరి విచారణను తెలంగాణ హైకోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది.

మళ్లీ ఉత్తరాంధ్ర తీరంవైపు అక్వాన్

అమరావతి, నవంబర్ 19, అనంతజనశక్తి న్యూస్

ఉత్తరాంధ్ర తీరంవైపు అక్వాన్ తుఫాన్ దూసుకొస్తోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఈ తుఫాను ఉత్తర దిశగా కదులుతోంది. గడిచిన ఆరు గంటల్లో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. తుఫాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలకు రానున్న 24 నుంచి 36 గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రస్తుతం అక్వాన్ తుఫాను నరసాపురానికి 440 కిలోమీటర్లు, కళింగపట్నానికి 440 కిలోమీటర్లు, చెన్నైకి 580 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు 530 కిలోమీటర్లు, పూరీకి 590 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది రేపు మధ్యాహ్నానికి నరసాపురంపూరీ మధ్య గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయానికి తుఫాను బలహీనపడి తీవ్ర వాయుగుండంగా లేదా తుఫానుగా మారే అవకాశం ఉంది. ఆ సమయంలో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది.
తుఫాను ప్రభావంతో ఈరోజు ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కూడా పడే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. రేపు ఉత్తరాంధ్రలో విస్తారంగా తేలికపాటి వర్షాలు, అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాను తీరం దాటిన అనంతరం వర్షాల తీవ్రత వేగంగా తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మధ్యాంధ్ర, దక్షిణాంధ్ర ప్రాంతాల్లో తుఫాను ప్రభావం గణనీయంగా ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది.
ఇక, మత్స్యకారులు తదుపరి అధికారిక ప్రకటన వచ్చే వరకు సముద్రంలో వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు.. చెరువులు, జలాశయాలు, లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంతాలపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోంది. తుఫాను పరిస్థితిని రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని, అధికారిక సూచనలను పాటించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ విజ్ఞప్తి చేసింది.

శుభలేఖ ఇవ్వడంలో తప్పేముంది?

(మొదటి పేజీ తరువాయి)

వైఎస్ విజయమ్మ పేరుతో ఉన్న ఆ లెటర్‌లో .. తన బిడ్డ షర్మిలకు జరుగుతున్న అన్యాయం, ఆమెపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను చూస్తుంటే ఒక తల్లిగా తన మనసు ఎంతో కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడుకి శుభలేఖ ఇవ్వడంలో తప్పేముంది? అని ప్రశ్నించారు. దివంగత నేత వైఎస్సార్‌కు మానవ సంబంధాల విలువ తెలుసని, చంద్రబాబుతో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ 50 ఏళ్ల క్రితమే వారిద్దరి మధ్య వ్యక్తిగతంగా స్నేహపూర్వక సంబంధాలు ఉండేవని గుర్తు చేశారు. రాజకీయాలు వేరు, మానవ సంబంధాలు వేరు అని వైఎస్సార్ నమ్మేవారని, రాజకీయ ప్రత్యర్థులతోనూ వ్యక్తిగత సంబంధాలను గౌరవించే సంస్కారం ఆయనలో ఉండేదని పేర్కొన్నారు.
తప్పుడు రాతలతో వైఎస్ .షర్మిల వ్యక్తిత్వంపై బురద చల్లడం తనకు మరింత బాధ కలిగిస్తోందని ఆ లేఖలో విజయమ్మ వాపోయారు. "మీ ఇంటి ఆడబిడ్డపై కూడా ఇలాగే తప్పుడు ప్రచారాలు చేస్తారా?" అని కూడా ప్రశ్నించారు. అలాగే షర్మిల చేసిన పాదయాత్ర, పడిన కష్టం, ఎదుర్కొన్న ఇబ్బందులు ఏ ఆడబిడ్డైనా అంత సులభంగా ఎదుర్కోగలిగేవా అని ఒక్కసారి ఆలోచించాలని కోరారు. షర్మిలలో నాకు వైఎస్సార్ మనస్తత్వమే కనిపిస్తుందన్నారు. ఎన్ని అవమానాలు, తప్పుడు ప్రచారాలు జరిగినా షర్మిల వెనక్కి తగ్గాల్సిన అవసరం లేదని, అవి ఆమెను బలహీనపరచకపోగా ఆమెకు అండగా నిలబడే వారి సంఖ్యను మరింత పెంచుతాయని భరోసా ఇచ్చారు. రాజకీయాలు ఎన్ని ఉన్నా కుటుంబ బంధాలను, మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే స్థాయికి దిగజారవద్దని ఒక తల్లిగా విజయమ్మ విజ్ఞప్తి చేస్తున్నట్టు ఆ లేఖలో ఉంది. అయితే ఈ లేఖ నిజంగానే వైఎస్. విజయమ్మ నుంచి వచ్చిందా? లేదా? అనే అనుమానాలు కూడా సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఇంకా ఒక క్లారిటీ రావాల్సి ఉంది.

అజిత్ దోవల్‌కు అమెరికా కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు సంబంధించిన కేసులో అమెరికా కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ దాఖలు చేసిన సివిల్ దావాలో అజిత్ దోవల్‌తో పాటు మాజీ రా చీఫ్ సామంత్ గోయల్‌కు సమన్లు అందజేసేందుకు ఢిల్లీలోని మూడు జిల్లా కోర్టుల సహకారం కోరింది. ఈ మేరకు పత్రాలను కొరియర్ ద్వారా ఆయా కోర్టులకు పంపించాలని ఆదేశించింది.
అమెరికాలో నివసిస్తున్న ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ ఈ కేసును దాఖలు చేశారు. తనను అమెరికా గడ్డపై హత్య చేసేందుకు కుట్ర జరిగిందని, అందులో భారత ప్రభుత్వానికి చెందిన కొందరు అధికారులు పాత్ర పోషించారని ఆయన ఆరోపించారు. ఈ సివిల్ దావాలో భారత ప్రభుత్వం, అజిత్ దోవల్, మాజీ రా చీఫ్ సామంత్ గోయల్‌తో పాటు మరికొందరి పేర్లను ప్రస్తావించారు. అమెరికా కోర్టు గతంలో హెగ్ కన్వెన్షన్ ద్వారా సమన్లు అందజేయడానికి ప్రయత్నించింది. అయితే ఆ ప్రక్రియ విజయవంతం కాలేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గంలో పత్రాలను అందజేయడానికి అనుమతి కోరుతూ పన్నూన్ కోర్టును ఆశ్రయించారు.
గతంలో అమెరికా పర్యటన సందర్భంగా అజిత్ దోవల్‌కు న్యాయపరమైన పత్రాలు అందజేయడానికి ప్రయత్నించినప్పటికీ భద్రతా సిబ్బంది అడ్డుకున్నారని పన్నూన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఢిల్లీలోని కోర్టుల ద్వారా పత్రాలను అందజేసే విధానానికి అమెరికా న్యాయస్థానం అనుమతించింది. ఢిల్లీలోని పటియాలా హౌస్, ద్వారక, తీస్ హజారీ జిల్లా కోర్టులకు అవసరమైన న్యాయపరమైన పత్రాలను పంపించాలని అమెరికా కోర్టు క్లర్క్‌ను ఆదేశించింది.

ఇక ఎన్నికలు కాదు.. విప్లవమే వస్తుంది!

(మొదటి పేజీ తరువాయి)

ఇకపై ఎన్నికలు ఉండవని, విప్లవం, మార్పుల పవనం వీస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, అజం ఖాన్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.
2027 ఎన్నికలకు ముందు కీలక పరిణామం
అయితే, 2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అజం ఖాన్ విడుదల కావడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. చాలా కాలంగా న్యాయపరమైన చిక్కులతో జైలులో ఉన్న ఆయనకు తాజాగా బెయిల్ లభించింది. ప్రస్తుతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి ఉన్నప్పటికీ, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉంది.దీంతో ఆయన తిరిగి రాజకీయంగా చురుకుగా మారితే ఎస్పీకి ఎంతవరకు ప్రయోజనం కలుగుతుంది? ముస్లిం ఓటర్లపై పార్టీ పట్టు మరింత బలపడుతుందా? అసదుద్దీన్ ఒవైసీ, చంద్రశేఖర్ ఆజాద్‌ల రాజకీయ వ్యూహాలపై ఎలాంటి ప్రభావం పడుతుంది? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.
నవంబర్ 17న బెయిల్.. 18న జైలు నుంచి విడుదల
ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసులో నవంబర్ 17, 2026న అజం ఖాన్‌కు అలహాబాద్ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆయన అరెస్టు సమయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1), మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 19 నిబంధనలను తప్పనిసరిగా పాటించలేదని హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయనకు ఉపశమనం కల్పించింది. అనంతరం నవంబర్ 18న ఘజియాబాద్‌లోని దాస్నా జైలు నుంచి అజం ఖాన్ విడుదలయ్యారు. అయితే హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను ఈడీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అజం ఖాన్‌కు బెయిల్ మంజూరు చేయడంలో హైకోర్టు తొందరపాటు నిర్ణయం తీసుకుందని, దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ఆయన జైలు బయట ఉండటం సరికాదని ఈడీ వాదిస్తోంది. అయితే ఆయన విడుదలను తక్షణమే నిలిపివేయాలని కోరిన విజ్ఞప్తిపై సుప్రీంకోర్టు వెంటనే స్టే విధించలేదు. ఈడీ కేసులో తదుపరి విచారణ డిసెంబర్ 10న జరగనుంది. ప్రస్తుతం అజం ఖాన్‌కు లభించింది మధ్యంతర బెయిల్ మాత్రమేనని, దీనిని అన్ని కేసుల నుంచి విముక్తిగా భావించకూడదని గుర్తించాలి.



ఎన్నికల్లో పోటీకి ఇంకా అడ్డంకులు
బెయిల్‌పై విడుదలైనప్పటికీ అజం ఖాన్ ఎన్నికల్లో పోటీ చేసే అంశం ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. హైకోర్టు ఆయన శిక్ష అమలును మాత్రమే నిలిపివేసిందని, నేర నిర్ధారణను రద్దు చేయడానికి నిరాకరించిందని అందించిన సమాచారం పేర్కొంటోంది. ఇతర కేసుల్లో ఆయనతో పాటు కుమారుడు అబ్దుల్లా ఆజంపై ఉన్న నేర నిర్ధారణలు కూడా ఎన్నికల్లో పోటీ చేసే అర్హతకు అడ్డంకులుగా ఉన్నాయి. దీంతో వీరిద్దరూ 2027 ఎన్నికల్లో నేరుగా బరిలోకి దిగడం సాధ్యం కాకపోవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ప్రచారం, పార్టీ కార్యకలాపాలు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాల్లో అజం ఖాన్ పాత్ర కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే, సమాజ్‌వాదీ పార్టీకి బలమైన ముస్లిం రాజకీయ గుర్తింపును తీసుకొచ్చిన నాయకుల్లో అజం ఖాన్ ఒకరు. ముఖ్యంగా రాంపూర్ ఆయన రాజకీయ కంచుకోటగా ఉంది. మొరాదాబాద్, సంభల్, అమ్రోహా, బిజ్నోర్ వంటి పశ్చిమ ఉత్తరప్రదేశ్ జిల్లాల్లోనూ ఆయనకు రాజకీయ ప్రభావం ఉంది. ముస్లిం సమాజంలో ఆయనకు ఉన్న ఆదరణ ఎస్పీకి అదనపు బలంగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

హైకమాండ్‌కు ఫిర్యాదు చేశాం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త ఇన్‌ఛార్జి రాగానే అన్ని అంశాలను పరిశీలిస్తారు. రాష్ట్రానికి వచ్చే నీటి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. బనకచర్లపై కేంద్రానికి లేఖలు రాయడం వల్లే పర్యావరణ అనుమతి ఆగింది'' అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మరోవైపు నాగార్జున సాగర్ సమీపంలో ఏపీ నిర్మిస్తున్న సొరంగంపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మాట్లాడి మహేశ్‌కుమార్ గౌడ్ ఆరా తీశారు. బీఆర్ఎస్ విమర్శలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేఆర్ఎంబీకి రాసిన లేఖల వివరాలను ఉత్తమ్ తెలిపారు. అధికారముంది కదా అని నేనేం ఏది చేసినా నడుస్తనుకుంటే మాత్రం ఖబడ్దార్ బిడ్డా రేవంత్ రెడ్డి.. చెప్తున్నా యుద్ధం స్టార్ట్ అయితది. మూడేళ్ల పరిపాలన తర్వాత తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరంటూ మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారని తెలిసిందే. నాలుగు గోదల మధ్య రిప్రజెంటేషన్ ఇస్తేనేమో మీరు పట్టించుకుంటలేరాయే.. బయట మాట్లాడితేనేమో క్రమశిక్షణ అంటారని రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్టానం రిపోర్ట్ అడుగగా.. రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల వీడియోలను టీపీసీసీ అధిష్టానానికి పంపింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయం పరిశీలిస్తున్నామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ అన్నారు. సమయం వచ్చినప్పుడు అందరినీ పిలుస్తాం..అన్నీ కూడా నిశితంగా పరిశీలిస్తున్నాం.. క్రమశిక్షణ ముందు అందరూ సమానమేనని.. రాజగోపాల్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏ సందర్భంలో ఏం మట్లాడారో.. అన్ని మాటలను పరిశీలిస్తామని చెప్పారు. ప్రతీదానికి ఓ సమయం ఉంటదని చెప్పుకొచ్చారు.



యువతకు లక్షలాది ఉద్యోగాలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో 167 అభివృద్ధి పనులు
విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో వివిధ శాఖల ద్వారా 167 అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిలో ఇప్పటికే 64 పనులను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ రీజియన్‌కు యాంకర్ ప్రాజెక్టుగా వైజాగ్ బే సిటీని అభివృద్ధ

ఒకే వేదికపై ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్



షెంజెన్: చైనాలోని షెంజెన్‌లో బుధవారం సాయంత్రం అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రపంచంలోని మూడు అగ్ర దేశాల అధినేతలు ముగ్గురు ఒకే వేదికపై తొలిసారిగా కనిపించారు. ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార (ఎపెక్) సమిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్..సమిట్‌కు ఆతిథ్యమిస్తున్న చైనా అధినేత షీ జిన్‌పింగ్ కలిసి కను'విందు' చేశారు. దేశాధినేతల గౌరవార్థం జిన్‌పింగ్, ఆయన సతీమణి పెంగ్ లియువాన్ ఇచ్చిన విందులో ఈ అద్భుత దృశ్యం కనిపించింది. ట్రంప్, జిన్‌పింగ్ విందు జరుగుతున్న హాలులో ఉండగా.. రెడ్ కార్పెట్‌పై నడుచుకుంటూ పుతిన్ వారివైపు వచ్చారు. రాగానే ట్రంప్, పుతిన్ కరచాలనం చేసుకున్నారు. ఒకరి భుజం ఒకరు తట్టుకుని అభినందనలు తెలుపుకొన్నారు.

ఈ దృశ్యాలను పక్కనే ఉన్న జిన్‌పింగ్ చూస్తూ ఉండిపోయారు. ఆ తర్వాత ముగ్గురు కలిసి ఫొటోలు దిగారు. ఆ తర్వాత ముగ్గురూ విందు చర్చలు జరిపారు.

విందులో ముగ్గురు నేతలు ఆహ్లాదంగా కనిపించారు. సరదాగా మాట్లాడుకున్నారు.

2025 ఆగస్టులో అలస్కాలో ట్రంప్, పుతిన్ భేటీ అయ్యారు. ఆ తర్వాత మళ్లీ వీరిద్దరూ కలుసుకోవడం ఇదే తొలిసారి.

దేశాధినేతలుగా ఇప్పటిదాకా జిన్‌పింగ్, పుతిన్‌లు కలుసుకోవడం ఇది 50వసారి.

జిన్‌పింగ్‌తో పుతిన్ చర్చలు

ట్రంప్ కంటే చాలా గంటల ముందే పుతిన్ షెంజెన్ చేరుకున్నారు. జిన్‌పింగ్‌తో సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం పుతిన్ మాట్లాడుతూ.. రెండు దేశాలు అనుసరిస్తున్న విదేశాంగ విధాన వ్యూహం ఫలిస్తోందని తెలిపారు.

ట్రంప్‌కు జిన్‌పింగ్ స్వయంగా స్వాగతం

ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో షెంజెన్ చేరుకున్న ట్రంప్‌కు జిన్‌పింగ్ ఘన స్వాగతం పలికారు. స్వయంగా విమానాశ్రయానికి వెళ్లిన జిన్‌పింగ్.. ఆయనకు స్వాగతం పలికి ఆలింగనం చేసుకున్నారు. సైనిన వందనంతోపాటు చిన్నారులు ట్రంప్‌కు పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఫైటర్ జెట్లు స్వాగత విన్యాసాలు చేశాయి.

అమెరికాతో బలమైన బంధానికే మొగ్గు

ట్రంప్‌తో లోతైన చర్చలు జరపాలని జిన్‌పింగ్ కోరుకుంటున్నారని, రెండు దేశాల బంధాన్ని మరింత బలపరుచుకోవాలని, ఆసియాపసిఫిక్‌లో సహకారాన్ని తీసుకోవాలని, అంతర్జాతీయ వ్యవహారాలను గాడినపెట్టడానికి సహకరించుకోవాలని కోరుకుంటున్నారని చైనా అధికార వార్తా సంస్థ జిన్‌హువా వెల్లడించింది. గత సెప్టెంబరులో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్, ఆయన సతీమణి విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలికిన సంగతిని జిన్‌పింగ్ గుర్తుచేసుకున్నారని తెలిపింది.

జిన్‌పింగ్‌తో సమావేశమైన ప్రతిసారీ ఆహ్లాదంగా ఉంటుందని, ఈ పర్యటన రెండు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

ఎపెక్ సమిట్‌లో భాగంగా గురువారం ముగ్గురు నేతలు భేటీ కానున్నారు. ఆ తర్వాత, అంతకుముందు.. ద్వైపాక్షిక భేటీలూ జరగనున్నాయి. ఈ భేటీల్లో అణ్వాయుధాల నియంత్రణ, ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ ఘర్షణపై చర్చించే అవకాశముంది.

చైనా పర్యటనలో భాగంగా ఉత్తర కొరియా అధినేత కిమ్‌తోనూ సమావేశం కావాలని ట్రంప్ భావిస్తున్నారు. బుధవారం వ్యాపార ప్రముఖులతో జరిగిన సమావేశంలో జిప్‌పింగ్ మాట్లాడారు. ఆసియాపసిఫిక్ సుస్థిరంగా ఉండాలంటే మరింత స్వేచ్ఛాయుత వాణిజ్య విధానాలను అనుసరించాలని సూచించారు.

మహమ్మద్ యూనస్ ఇంటికి నిప్పు..



తాను మళ్లీ స్వదేశానికి తిరిగి వస్తానని మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించిన దగ్గరి నుంచి బంగ్లాదేశ్‌లో అల్లర్లు చోటుచేసుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా పలుచోట్ల అవామీ లీగ్, బీఎన్‌పీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హసీనా గద్దె దిగిన తర్వాత బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ సారథిగా వ్యవహరించిన మహమ్మద్ యూనస్ ఇంటిపై తాజాగా దాడి జరిగింది. చట్టోగ్రామ్‌లోని యూనస్ పూర్వీకుల ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మరోవైపు అవామీలీగ్ లాక్‌డౌన్‌కు పిలుపునివ్వడంతో దేశవ్యాప్తంగా పారామిలిటరీ బలగాలను మోహరించారు.

ఇదిలా ఉండగా.. బంగ్లాదేశ్ వ్యాప్తంగా జరిగిన ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. రాజధాని ఢాకాలో నాటు బాంబులు, ఐఈడీ పేలుళ్లు వినిపించాయి. నగరం అంతటా భారీ భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ.. ఈ పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారు. తాజా నిరసనలను బంగ్లా పోలీసులు కఠినంగా అణచివేస్తున్నారు. ఇప్పటివరకు 565 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో విద్యాశాఖ మాజీ మంత్రి నురుల్ ఇస్లామ్ నహీద్ ఉన్నారు. ఈ అల్లర్ల వెనక ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ హెచ్చరించారు.

మరోవైపు, యూనస్ స్థాపించిన గ్రామీణ బ్యాంకు శాఖల లక్ష్యంగా దాడులు జరిగాయి. వీటిని పార్ల మెంట్ వేదికగా ప్రధాని తారిఖ్ రెహమాన్ తీవ్రంగా ఖండించారు. అవామీ లీగ్ కార్యకర్తలను ఉగ్రవాదులుగా అభివర్ణించారు. 2024 జులైలో నెలకొన్న తిరుగుబాటు సమయంలో ఎలాగైతే ఐక్యంగా ఉన్నారో.. ఇప్పుడు అలాగే ఉండాలని ప్రజలను కోరారు. హసీనా ఆదేశాల మేరకే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో ఆమె తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి మారణహోమానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు.

షేక్ హసీనా గద్దె దిగిన తర్వాత తాత్కాలిక సారథిగా బాధ్యతలు స్వీకరించిన యూనస్.. తన హయాంలో అవామీ లీగ్‌ను రద్దు చేశారు. హత్యలు, మూకదాడుల ఆరోపణలపై ఆ పార్టీ మద్దతుదారులను జైలులో పెట్టారు. అలాగే 1971 నాటి చారిత్రక కట్టడాలను కూల్చివేయించారు. యూనస్ హయాంలో బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబుర్ రెహమాన్ (హసీనా తండ్రి) ఇంటిని నేలమట్టం చేశారు.

ఇరాన్‌పై దాడులు చేయకుండా ట్రంప్ చేతులు కట్టేసిన 'వస్త్రం'



ఇరాన్‌పై దాడులకు కాలుదువ్విన అమెరికా అధ్యక్షుడుట్రంప్ దూకుడును ఓ 'వస్త్రం' కట్టిపడేసింది.దీంతో టెహ్రాన్‌పై దాడులు చేసే సామర్థ్యం అగ్రరాజ్యానికి ఉన్నా.. ప్రతిగా ఆ దేశం ప్రయోగించే క్షిపణులు, డ్రోన్లను అడ్డుకొనే శక్తి నానాటికీ నశించిపోతోంది. ఫలితంగా గల్ఫ్‌దేశాల్లో అమెరికా స్థావరాలకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో కీలకమైన పేట్రియాట్ క్షిపణుల నిల్వలు భారీగా పడిపోయినట్లు పెంటగాన్ వర్గాలు గగ్గోలు పెట్టడంతో.. ట్రంప్ ఈ దాడుల నుంచి వెనక్కి తగ్గినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ క్షిపణుల ఉత్పత్తిని వేగవంతం చేయాలని ప్రయత్నించినా.. ఓ 'వస్త్రం' కొరతతో చిక్కుముడి ఏర్పడింది.ఇది లేకుండా పేట్రియాట్ క్షిపణి తయారుకాదు.అయితే ఈ ప్రత్యేక ఫ్యాబ్రిక్ అమెరికాలో లభించదు.ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకోవాలి. ఆపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహించాలి.

అసలు ఏంటీ ఫ్యాబ్రిక్..!

పేట్రియాట్ క్షిపణులను ప్రయోగించిన వేళ .. వాటి నాజిల్స్ విపరీతమైన వేడికి గురవుతాయి. ఈ పరిస్థితుల్లో అవి కరిగిపోకుండా.. కార్బన్‌ఫైబ్రే రేయాన్ ఫ్యాబ్రిక్ ను పేట్రియాట్ ప్యాక్3 రాకెట్ మోటార్స్‌లో వాడతారు. ఫ్రాన్స్‌కు చెందిన ఏరియన్ గ్రూప్ ఈ ప్రత్యేకమైన వస్త్రాన్ని తయారు చేసి అమెరికాలోని పార్క్ ఏరోస్పేస్‌కు సరఫరా చేస్తుంది. దీనిని హీట్ రెసిస్టెంట్ మెటీరియల్‌గా మార్చి రాకెట్ పరికరాల రక్షణకు వాడతారు. ఏరియన్ గ్రూప్ వస్త్రంతో తయారు చేసే మెటీరియల్ మాత్రమే పేట్రియాట్ మోటర్ల ప్రమాణాలను అందుకోగలిగింది.

ఈ వస్త్రాన్ని ఎలా తయారు చేస్తారు..?

ఒక రకమైన చెట్ల కలప నుంచి తీసిన గుజ్జును ప్రత్యేక రసాయనాలు వాడి అత్యంత సన్నటి బలమైన రేయాన్ దారాలను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియ థాయ్‌లాండ్ కంపెనీకి చెందిన చెక్ రిపబ్లిక్ ఫ్యాక్టరీలో జరుగుతుంది. వీటిని ఫ్రాన్స్‌లోని ఏరియన్ గ్రూప్ ఓ వస్త్రం లా నేసిన తర్వాత ప్రత్యేకమైన కొలిమిలో దాదాపు 1500 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు వేడి చేస్తారు. అప్పుడు ఇందులోని మూలకాలు ఆవిరైపోయి.. కార్బన్ మిగులుతుంది. దీనినే రేకార్బ్ సీ2బీ అంటారు. దీనికి అమెరికాలోని పార్క్ ఏరోస్పేస్ ఓ ప్రత్యేక రెసిన్ పూతపూసి రాకెట్ మోటార్‌లలో వాడేందుకు సిద్ధం చేస్తుంది. అక్కడినుంచి ఈ వస్త్రం అమెరికా డిఫెన్స్ కాంట్రాక్టర్ ఎల్ 3 హారిస్‌కు చేరుకొన్నాక.. రాకెట్లలో వాడతారు. అధిక వేడిలో ఇది కరిగి రాకెట్ భాగంపై ఓ పొరలా ఏర్పడి కాపాడుతుంది.

రెండేళ్లపాటు పరీక్షలా..?

ఇప్పుడు అమెరికా డిమాండ్లను అందుకొనే స్థాయిలో రేయాన్ ఫ్యాబ్రిక్ అందుబాటులో లేదు. దీనికి ఓ ప్రధాన కారణం ఉంది. పార్క్ ఏరోస్పేస్‌కు చేరిన వస్త్రం వినియోగానికి సిద్ధం కావాలంటే చాలా పరీక్షలు నిర్వహించాలని కంపెనీ సీఈవో బ్రియాన్ షోర్ తెలిపారు. దాదాపు రెండేళ్లపాటు జరిగే ఈ పరీక్షల్లో.. చివరి దశలో విఫలమైనా.. ప్రక్రియ మొత్తం మొదటి నుంచి ప్రారంభించాల్సి ఉంటుందని వెల్లడించారు. దీనికి తోడు ఫ్రాన్స్ కంపెనీ నుంచి వచ్చే రేయాన్ వస్త్రం పరిమిత స్థాయిలో లభిస్తోంది. దీంతో ఒక్కో పేట్రియాట్ ప్యాక్3 మిసైల్ తయారీకి కనీసం రెండేళ్ల సమయం పడుతుంది. ఫలితంగా ఇరాన్‌తో యుద్ధంలో ముందుకెళ్లలేక అమెరికా అవస్థలు పడుతోంది.

దూసుకొస్తున్న తీవ్ర తుఫాను అక్వాన్.. శుక్రవారం తీరాన్ని దాటే ఛాన్స్..!

బంగాళాఖాతం లో ఏర్పడిన తీవ్ర తుఫాను అక్వాన్ తీరంవైపు దూసుకొస్తున్నది. గడిచిని ఆరు గంటలుగా గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో తుఫాను కదులుతున్నదని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ తుఫాను పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ లోని నర్సాపూర్‌కు ఆగ్నేయంగా 480 కిలోమీటర్లు, కళింగపట్నానికి దక్షిణఆగ్నేయంగా 510 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పున 560 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు దక్షిణంగా 600 కిలోమీటర్లు, పూరీకి దక్షిణంగా 660 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నది. అక్వాన్ తుఫాను ఉత్తరవాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 20న (శుక్రవారం) మధ్యాహ్నానికి నర్సాపూర్, పూరీల మధ్య ఉత్తర ఆంధ్రప్రదేశ్‌యానాం, దక్షిణ ఒడిశా తీరాలను దాటే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 90100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, గరిష్టంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో తుఫాను తీరాన్ని తాకుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తీవ్ర తుఫాను అక్వాన్ తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం ప్రమాదకర ప్రాంతాల నుంచి సుమారు 50,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుఫాను సన్నద్ధత కోసం బుధవారం ఒడిశా సీఎం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తుఫాను తీరం దాటే సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రాణనష్టం ఏమాత్రం జరగకూడదనేదే తమ లక్ష్యమని చెప్పారు.



రెండు లారీలు వెళ్తుండగా కూలిన వంతెన.. ఒక లారీలో చెలరేగిన మంటలు

చండీగఢ్: ఒక వంతెనపై రెండు లారీలు వెళ్తుండగా అది కూలిపోయింది. ఒక లారీలో మంటలు చెలరేగాయి. పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మంటలను అదుపు చేయడంతో పాటు సహాయక చర్యలు చేపట్టారు. పంజాబ్‌లోని పాటియాలా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం ఉదయం 6 గంటల సమయంలో పాటియాలాసంగ్రూర్ బైపాస్‌లోని పాసియానా గ్రామం సమీపంలో భాక్రా మెయిన్ లైన్ కాలువపై ఉన్న ఐరన్ బ్రిడ్జిపై రెండు లారీలు ప్రయాణించాయి. అయితే ఉన్నట్టుండి ఆ వంతెన కూలిపోయింది. దీంతో ఆ రెండు లారీలు వంతెన శిథిలాల వద్ద చిక్కుకున్నాయి. ఒక లారీలో మంటలు చెలరేగాయి. కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఒక లారీలో చెలరేగిన మంటలను ఫైర్ సిబ్బంది ఆర్పివేశారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని అధికారులు తెలిపారు. రెండు లారీల డ్రైవర్లు స్వల్పంగా గాయపడినట్లు చెప్పారు. ఈ మార్గంలోని ట్రాఫిక్‌ను మరో రహదారి వైపు మళ్లించినట్లు వివరించారు. ఐరన్ బ్రిడ్జి కూలిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు పాటియాలా బైపాస్‌లోని భాక్రా మెయిన్ లైన్ కాలువపై 60 మీటర్ల పొడవైన స్టీల్ ట్రస్ బ్రిడ్జిని పంజాబ్ ప్రభుత్వ పీడబ్ల్యూడీ పర్యవేక్షణలో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్వో) 2016లో నిర్మించింది. నాలుగు లేన్ల పటియాలా బైపాస్ రోడ్డును 2018లో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కు అప్పగించారు. దీంతో ప్రస్తుతం ఈ మార్గాన్ని ఎన్‌హెచ్ఏఐ నిర్వహిస్తున్నది. అయితే భాక్రా కాలువపై ఎడమ వైపు ఉన్న ఈ స్టీల్ బ్రిడ్జి కొంత కాలంగా ఊగుతున్నట్లు స్థానికులు ఆరోపించారు.





బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. వంతెనపై నుంచి కాలువలో పడ్డ వాహనం, ఆరుగురు మృతి

బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న స్కార్పియో వాహనం అదుపుతప్పి వంతెనపై నుంచి లోతైన కాలువలో పడిపోవడంతో ఆరుగురు ప్రాణాలు)కోల్పోయారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషాదకర సంఘటన అరారియా జిల్లాలోని తారాబారి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. సుపౌల్ జిల్లా పిప్రా ప్రాంతంలోని ధుమ్హా గ్రామానికి చెందిన ఏడుగురు స్కార్పియోలో సిక్టీ ప్రాంతంలోని భట్టియా గ్రామంలో జరిగిన పెళ్లి వేడుకకు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు.

ఈ క్రమంలో బీడీ వంతెన వద్ద ఉన్న ప్రమాదకరమైన మలుపు దగ్గర వాహనం అదుపుతప్పి నీటిలో పడిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. అప్పటికే ఆరుగురు మరణించినట్లు అరేరియాలోని సదర్ దవాఖానకు చెందిన డాక్టర్ నీరజ్ కుమార్ తెలిపారు. మృతులను యశ్ కుమార్ (15), ఆదిత్య ఆనంద్ (18), ఆర్యన్ (15), కుందన్ కుమార్ (26), సౌరభ్ (16), మున్నా కుమార్ (14)గా గుర్తించారు. వీరంతా ఒకే గ్రామానికి చెందిన వారు.అప్పటి వరకు పెళ్లి వేడుకల్లో సంతోషంగా పాల్గొన్నవారు విగతజీవులుగా మారడంతో ప్రమాద వార్తతో ధుమ్హా గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అమెరికాలో హిందువులపై పెరిగిన దాడులు



ఇటీవలి నెలల్లో అమెరికాలో హిందూ దేవాలయాలపై గురిపెట్టడం, రాజకీయ విద్వేషాన్ని రెచ్చగొట్టడం పెరిగాయని న్యూయార్క్ నగర మేయర్ జొహ్రాన్ మమ్దానీ ఆందోళన వ్యక్తం చేశారు. విభజన రాజకీయాలను తిరస్కరించి, వివక్షకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడాలని ఆయన అమెరికన్లకు పిలుపునిచ్చారు. పంజాబీ హిందూ తల్లి, గుజరాతీ ఉగాండా ముస్లిం తండ్రికి జన్మించిన మమ్దానీ.. భిన్న సాంస్కృతిక నేపథ్యంలో పెరగడం వల్ల హిందూ మతంలోని సారాన్ని, జ్ఞానాన్ని అర్థం చేసుకోగలిగానని తెలిపారు. మంగళవారం నిర్వహించిన దీపావళి వేడుకల్లో మమ్దానీ మాట్లాడుతూ..గత ఏడాది కాలంగా హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని, అమెరికా సమాఖ్య ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయి నేతలు సిక్కులను కూడా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ఒకప్పుడు సమాజంలో కొన్ని అతిమితవాద వర్గాలకే పరిమితమైన హిందూ ద్వేషం, నేడు రాజకీయ ప్రచారాలకు కేంద్రబిందువుగా మారిందని ఆయన అన్నారు. వాషింగ్టన్ అయినా, దిల్లీ అయినా, ప్రపంచంలోకి చీకటిని తెచ్చే ఎలాంటి రాజకీయాలనైనా తిరస్కరించడం మనందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ స్థిరపడిన హిందువుల అస్తిత్వాన్ని ప్రశ్నిస్తూ స్వదేశం వెళ్లిపొమ్మని ఎవరైనా అంటే, మీకు అమెరికాయే సొంత గడ్డ అని స్పష్టంగా చెబుతున్నానని భరోసా ఇచ్చారు.

అల్లకల్లోలంగా సముద్రం



బంగాళాఖాతం లో ఏర్పడిన అక్వాన్ తుపాను తీరంవైపు దూసుకొస్తున్నది. దాంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగిసిపడుతున్నాయి. పూరీ తీరం అల్లకల్లోలంగా మారడంతో ఆ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. టూరిస్టులు, స్థానికులు ప్రమాదకరంగా మారిన బీచ్‌లలోకి రాకుండా హెచ్చరికలు చేసింది. ఈ మేరకు అధికారులు తీరం వెంట ఎర్రజెండాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా తీర ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం బృందాలను మోహరించారు. తీరంలోని ప్రజలను ఖాళీ చేయించారు. పూరీ తీరంలో రెస్క్యూ అధికారులు వాహనాల్లో తిరుగుతూ మైకుల ద్వారా హెచ్చరికలు చేస్తున్నారు. ప్రజలెవరూ తీరంవైపు రావద్దని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న దృశ్యాలను, అధికారులు హెచ్చరికలు చేస్తున్న దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.





ఎడతెగని సామాజిక విధ్వంసం!

పాచిపోయిన అన్నంపై పంచదార చల్లి జనానికి తినిపించాలనుకునే తెలివితేటల్లో చాలామంది నాయకులు ఆరితేరిపోయారు. సామాన్యుల బతుకులను బాగుచేసే పనులు చేయడం మానేసి, తాయిలాలు ఎరేసి వాళ్ల ఓట్లను బుట్టలో వేసుకుంటున్నారు. ఇవాళ ఇస్తే రేపటికి మిగలని నాలుగు రూపాయలు వీళ్ల చేతిలో పెట్టి, వాళ్లు మాత్రం కూర్చున్నచోట నుంచి కదలకుండానే నాలుగు తరాలకు సరిపడా సంపాదించుకుంటున్నారు. ప్రజానీకంలో పలుపురిని నిత్యం నిండా మత్తులో ముంచుతూ, సోయిరాకమునుపే వారి జేబులకు కత్తెరవేస్తున్న నేతలెందరో బయటికి మాత్రం ధర్మప్రభువులుగా పోజులు కొడుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని పానశాలగా మార్చి ప్రజల రక్తాన్ని జుర్రుకుంటున్న వాళ్లను చూస్తే జలగలు కూడా సిగ్గుతో చచ్చిపోతాయి. జనం బలహీనతలను వాటంగా చేసుకుని వాళ్లు ఆడుతున్న రాక్షస రాజకీయ క్రీడలకు కుటుంబాలకు కుటుంబాలే సర్వనాశనమవుతున్నాయి!

కాకులుతీరిన మన నాయకులు ఎప్పుడైనా రాజ్యాంగాన్ని చదివారో లేదో కానీ, అందులో ఆర్టికల్ 47 అని ఒకటి ఉంటుంది. ప్రజల పోషకాహార స్థాయిలను, జీవన ప్రమాణాలను పెంచడం రాజ్యం ధర్మమని అది చెబుతుంది. అందుకోసం ఆరోగ్యానికి హానికారకమైన మత్తుమందులూ పానీయాల వాడకాన్ని పూర్తిగా నిరుత్సాహపరచడం కూడా ఏలినవారి బాధ్యతేనని ఆ అధికరణ స్పష్టంగా పేర్కొంటోంది. ప్రజలకోసం పనిచేస్తామంటూ అదే రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవుల్లోకి వచ్చే నేతలకు దీని గురించి గుర్తుచేస్తే నోటితో నవ్వుతూనే నొసటితో వెక్కిరించిపోతారు. ఈ భూప్రపంచం మీద తమను మించిన ప్రజాసేవకులు మరెవరూ లేరన్నంతగా సొంత డబ్బులతో డప్పుకొట్టుకుంటూ ఎన్నికల బరిలోకి దిగే ఆ మహానుభావులు- అన్నింటికన్నా ముందు మందు బాటిళ్ల పంపకాలతోనే తమ రాజకీయాలు మొదలుపెడతారు. ఎలక్షన్లు ఏవైనా సరే- పగటి పూట పైకి మ్యానిఫెస్టోలు పట్టుకుని, చీకటిమాటున మద్యాన్ని ఏరులై పారిస్తుంటారు. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఇలా ప్రారంభమైందో లేదో అంతలోనే మందు సీసాలతో విందులు చేయడానికి నాయకులు అన్ని ఏర్పాట్లు చేసేసుకుంటున్నారు. దాచేపల్లి వైకాపా ఛైర్మన్ అభ్యర్థిగా ఎంపికైన కొప్పుల రవి ఇంట్లో తాజాగా పోలీసులు తనిఖీ చేస్తే- జనానికి తాగబోయించడానికి తెప్పించి పెట్టుకున్న మద్యం భారీగా దొరికింది. మొన్నామధ్య తెలంగాణ మున్సిపల్ ఎన్నికల సమయంలోనూ మద్యం పంపకాలు యమజోరుగా సాగాయి. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం, అస్సాం, పుదుచ్చేరిలలో ఇటీవల ఎలక్షన్లు జరిగినప్పుడు ఓటర్లకు పంచిపెట్టడానికి సిద్ధంచేసిన దాదాపు 70లక్షల లీటర్ల లిక్కరును పట్టుకున్నట్లు ఎలక్షన్ కమిషన్ వర్గాలు మహాగొప్పగా సెలవిచ్చాయి. కానీ, అధికారులకు దొరికేది పిచ్చుక పిల్లంత అయితే, గుట్టుచప్పుడు కాకుండా మంది పొట్టల్లోకి నాయకులు పోయించే మందు కొండంత ఉంటుందని చెప్పడానికి అపరాధ పరిశోధనలేమీ చేయనక్కర్లేదు. ఇలా మూడు బీర్లు ఆరు సారాబుడ్లుగా వర్ధిల్లుతున్న రాజకీయాల పుణ్యమా అని ప్రభుత్వాలు కూడా ప్రాణాంతక మద్యాన్నే ముద్దుచేస్తున్నాయి. ప్రజాధనానికి, ప్రజారోగ్యానికి కాపలాకాయాల్సిన బాధ్యతను నిర్మొహమాటంగా గాలికొదిలేసి, పేరుగొప్ప ప్రగతి రథచక్రాలను పరమాద్భుతంగా పరుగులుదీయించడానికి మందునే ఇంధనంగా మార్చుకుంటున్నాయి!

అల్కహాల్ మూలంగా తలెత్తుతున్న అనేక విపత్తులను తగ్గించడానికి ప్రభుత్వాలు సమర్థ మద్యనియంత్రణ విధానాలను అమలుచేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెవినిల్లు కట్టుకుని పోరుతోంది. అలాంటి మంచి పనులు చేయాలంటే మన సర్కార్లకు మనసు రాదు కదా... అందుకని అవి ప్రత్యేక విభాగాలను ఏర్పాటుచేసుకుని మరీ మద్యాదాయం పెంపునకు తెగ కష్టపడిపోతుంటాయి. తాము ఊళ్ల మీదకు తోలుతున్న మద్యంమహమ్మారి మూలంగా ఆడబిడ్డల తాళిబొట్లు తెగిపడుతున్నా వాటికి చీమకుట్టినట్టు కూడా ఉండదు. నేరగ్రస్థ రాజకీయాలకు వికృత రూపమైన వైకాపా అయితే ఇందులో నాలుగు ఆకులు ఎక్కువే చదివింది. మద్యాన్ని నిషేధిస్తామన్న వాగ్దానాన్ని ఏట్లో కలిపేశారని విమర్శించిన వారిపై జగన్ సీఎంగా ఉన్నప్పుడు తోకతొక్కిన తాచుమాదిరిగా కస్సుమన్నారు. మద్యం ఆదాయాన్ని తగ్గించి సంక్షేమ పథకాలను అడ్డుకోవాలన్న దుర్బుద్ధితోనే ప్రతిపక్షం విషప్రచారం చేస్తోందంటూ బడబడా మొసలికన్నీళ్లు కార్చేశారు. జనానికి మంచి చేయడంకోసమే వారింటిని ఒంటిని గుల్లచేసే మద్యాన్ని అమ్ముతున్నామనడం ఉంది చూశారూ... బెల్లం ముక్క ఇస్తా కానీ, కాస్త కత్తితో పొడిపించుకో అన్నట్టు లేదూ! నాయకులు ఇలా నిర్లజ్జగా వ్యవహరిస్తుండబట్టే మద్యపాన వ్యసనపరులు నానాటికి పెరిగిపోతున్నారు. పదిహేను పదహారేళ్ల పిల్లలు కూడా తాగితూలుతున్నారంటే నేతలది కాదా ఆ పాపం?

క్యాన్సర్ల నుంచి మానసిక ఆరోగ్య సమస్యల వరకూ మద్యపానం మూలంగా రాని రోగాలంటూ ఏమీ లేవు. మందు అలవాటు కారణంగా చైనాలో ప్రతి లక్షమందికి ముప్పై మంది మగవాళ్లు చనిపోతుంటే- ఇండియాలో 63 మంది పురుషులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మద్యానికి బానిసలై మరణిస్తున్నవారు, జబ్బుపడి ఆసుపత్రుల పాలవుతున్నవారితో జరుగుతున్న ఉత్పాదకత నష్టం, వాళ్ల వైద్యచికిత్సలకు అవుతున్న ఖర్చులు, ఇతరత్రా అన్నీ కలిపి చూస్తే- మన దేశం ఏడాదికి జీడీపీలో 1.45శాతానికి సమానమైన సంపదను కోల్పోతోందని అంచనా. అంటే, ప్రస్తుత లెక్కల ప్రకారం అది అయిదు లక్షల కోట్ల రూపాయలకు పైమాటే. సొమ్ము పోయి శని పట్టినట్టు, మద్యం మత్తులో జరుగుతున్న నేరాలూ ఘోరాలు జనానికి నిద్రలేకుండా చేస్తున్నాయి. ఆడపిల్లల మీద అఘాయిత్యాలు ఒకవైపు... పీకల్దాక తప్పతాగి తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను చంపుతున్న ప్రబుద్ధుల దుర్మార్గాలు మరోవైపు మన సమాజం ఎటువెళ్తోందో అర్థం కాకుండా చేస్తున్నాయి. మెదడును మొద్దుబార్చే మద్యాన్ని ఫూటుగా తాగి బండ్లు తీసుకుని రోడ్లెక్కుతున్న మందమతుల కారణంగానైతే లెక్కలేనన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. బతుకు పంటలను పండించాల్సిన ప్రభుత్వాలే ఇంతగా చితిమంటలను ఎగదోస్తున్నాయి! ఖజానాను నింపుకోవడంకోసం జనారోగ్యాన్ని బలిపెడుతున్న నాయకులు మారాలంటే పశ్చిమాన పాడ్డు పాడవాలేమో! కాబట్టి వాళ్లేదో చేస్తారనే చిత్తభ్రమలో ఉండటంకంటే కూడా మందుబాబులను కట్టడి చేయడానికి ప్రజలే పూనుకోవడం మేలు. తిరుపతి జిల్లా నవాబుపేట గ్రామం 55పల్లుగా మద్యాన్ని ఆమడదూరంలో ఉంచుతోంది. ప్రకాశం జిల్లాలోని కాటంవారిపల్లెలో కూడా అర్ధశతాబ్ద కాలంగా అదే కట్టుబాటు అమలవుతోంది. ఆ చుట్టుపక్కల మరికొన్ని గ్రామాలూ, ఇతర జిల్లాల్లోని కొన్ని పల్లెలూ దశాబ్దాల క్రితమే మద్యం అమ్మకాలను నిషేధించాయి.

నిరసనల రాజధాని!

ఎన్నికల సంఘం(ఈసీ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ శనివారం నుంచి అటు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), ఇటు ఇండియా కూటమి పక్షాలు చేస్తున్న ఆందోళనలతో ఢిల్లీ నగరం 'నిరసనల రాజధాని' గా మారిపోయింది. జూలై 'అనుభవం'తో జంతర్‌మంతర్ వైపు ఎవరినీ రానీయరాదన్న కృతనిశ్చయం ప్రదర్శించి పోలీసులు చేసిన అతి వల్ల పలుచోట్లకు అది విస్తరించింది! ఆర్‌కే ఆశ్రమ్, ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా, నిగంబోద్ ఘాట్, కన్నాట్ ప్లేస్ లాంటి పలు ప్రాంతాల్లో ఉద్యమకారులకూ, పోలీసులకూ బాహాబాహీ తప్పలేదు. విపక్ష ఇండియా కూటమి ఆధ్వర్యాన సుప్రీంకోర్టుకు ర్యాలీ తీయటం, వినతిపత్రం ఇస్తామనటం కొత్త పరిణామం. ఢిల్లీలో విమానంలోకి చొరబడి సీజేపీ నేతల్ని అరెస్టుచేశారు. జంతర్‌మంతర్ వైపు దూసుకెళ్లే వేలాదిమంది ఉద్యమకారులపై మాత్రమే కాదు... జర్నలిస్టులపైనా పోలీసులు ప్రతాపం చూపారు. గుర్తింపుకార్డులు గుంజుకున్నారు. ఆడ, మగ తేడాలేకుండా ఈడ్చుకు పోవటం,



మొరటుగా ప్రవర్తించటం రానున్నకాలంలో బీజేపీని వెంటాడే దృశ్యాలవుతాయి. ఒకటి రెండుచోట్ల హిందూ సంస్థలకు చెందినవారిగా చెప్పుకున్న వ్యక్తులు యువతీయువకులపై పిడిగుద్దులు కురిపించటం, నిండుగా లాఠీలు నింపుకుని కారులో వచ్చినవారికి పోలీసులు రక్షణనివ్వటం దిగ్భ్రాంతి కలిగించింది.

తెలివైన పాలకులు నిరసనల్ని అడ్డుకోరు. అవి వాతావరణాన్ని తెలిపే బారో మీటర్ లాంటివి. పదిమంది గుమిగూడి ఎలుగెత్తారంటే పాలన సవ్యంగా లేదని అర్థం చేసుకోవాల్సిందిపోయి, గొంతు నొక్కాలని చూస్తే ఉద్యమం సమసిపోదు సరికదా... అది మరింత బలంగా, వేగంగా విస్తరిస్తుంది. చివరకు సర్వోన్నత న్యాయ స్థానం సైతం జోక్యం చేసుకుని చీవాట్లు పెట్టిందంటే తమ ఓవరాక్షన్ ఎంతగా త్రుతిమించిందో పోలీసులు తెలుసుకోవాలి. ఎందుకనో... ఈ ఆందోళనల హోరులోనే జంతర్ మంతర్ ఇంకెంత మాత్రం నిరసనలకు వేదిక కాదంటూ ఢిల్లీ పోలీసులు హఠాత్తుగా సోమవారం ప్రకటించారు.

ఢిల్లీ అంతటా బారికేడ్లు, దాదాపు 50,000మంది పోలీసులు, ఇతర బలగాల మోహరింపు, వందల ప్రదేశాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, 45 మెట్రో స్టేషన్ల మూసివేత, విద్యాసంస్థలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాల్సి రావటం వగైరాలన్నీ దేనికోసం? కేవలం జ్ఞానేశ్‌ను కాపాడటానికేనా? ఈసీలో ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రకారం నిర్ణయాలు అమలుకావాల్సివుండగా, జ్ఞానేశ్ అభీష్టమే చెల్లుబాటు కావటం చట్టవిరుద్ధం, రాజ్యాంగవిరుద్ధం కూడా. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం గతనెల 23న దీన్ని వెల్లడించాక అదంతా అబద్ధమనీ, ఏ నిర్ణయమైనా సమష్టిగానే తీసుకున్నామనీ ముగ్గురూ కలిసి మీడియా ముఖంగా చెప్పిందిలేదు. కనీసం జ్ఞానేశ్ ఒక్కరైనా సంజాయిషీ ఇచ్చింది లేదు.

20 రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో దేశ జనాభాలో 10 శాతంమంది ఓట్లు... అంటే 13 కోట్లమందికిపైగా ఓట్లు ఏకపక్షంగా తొలగిస్తే... ఆ విషయంలో ఇద్దరు కమిషనర్లూ ముందే హెచ్చరించినా ఆ వ్యవస్థ అచేతనంగా ఉండిపోవటం ఆశ్చర్యకరం. ఏపీతో సహా అనేకచోట్ల ఎన్నికల్ని అపసవ్యంగా, అడ్డదిడ్డంగా నిర్వహించిన వైనం సాక్ష్యాధారాలతో బయటపడింది. అయినా కొందరు మాజీ న్యాయమూర్తులూ, ఇంకొందరు మాజీ ఉన్నతాధికారులూ ఈసీ తీరును సమర్థిస్తూ ప్రకటనలు విడుదల చేయటం దిగ్భ్రాంతికరం. ఇలాంటివారి చేతుల్లో కొన్నాళ్లు ప్రజాస్వామిక వ్యవస్థలన్నీ నడిచాయంటే చోద్యమనిపిస్తుంది. జవాబుదారీతనం జాడలేనిచోట ప్రజాస్వామ్యం మనగలుగుతుందా?

యాదృచ్ఛికమే గానీ... చిలీ, బ్రెజిల్, స్పెయిన్, ఫ్రాన్స్ దేశాల్లో సైతం గతవారం జెన్ జీ జూలువిదిల్చింది. డిమాండ్లు వేరు కావొచ్చు, నిరసన రూపాలు భిన్నం కావొచ్చు-కానీ పాలకులు తాము చెప్పేది వినాలన్నదే యువత నిరసనల సారాంశం. స్వాతంత్రోద్యమ కాలంలో ఢిల్లీలో నిరసనలకు యమునా తీరం, జమా మసీదు, ఆజాద్ పార్క్, ఫిరోజ్ షా కోట్లవంటి పలు స్థలాలుండేవి. తదుపరి పటేల్ చౌక్, సంసద్ మార్గ్‌ల్లో నిరసనలకు చోటిచ్చారు. యాభైయ్యేళ్లు దాటాక అది జంతర్‌మంతర్‌కు చేరింది. ఇప్పుడు అక్కడి నుంచి కూడా వాటిని బహిష్కరించటం అసహనానికి పరాకాష్ఠ. జరుగుతున్న పరిణామాలు సవ్యంగా లేవు. సకాలంలో సరిచేయకుంటే నిరసనలు మరింత తీవ్రమవుతాయి.

నీలేకని సలహాలో చిక్కులు

గత కొన్నేళ్లుగా విద్యార్థుల పాలిట పెను సమస్యగా మారిన ప్రశ్నపత్రాల లీక్‌ను అరికట్టడానికి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని ఇటీవల చేసిన సూచనపై సహజంగానే విస్తృత చర్చ నడుస్తోంది. ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రశ్నపత్రం రూపొందిన మరుక్షణం అది ఆర్థిక లబ్ధి కలిగించేదిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. దాని బదులు డిజిటల్‌గా ప్రశ్నల నిధి రూపొందించి అవసరమైన సాంకేతికత ద్వారా ఆ నిధినుంచి పరీక్షకు కొన్ని గంటలముందు ప్రశ్నపత్రం రూపొందిస్తే లీక్‌ల సమస్య ఉండదన్నది ఆయన మాట. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకూ, అంతకుముందు దేశవ్యాప్తంగా విద్యార్థుల ఉద్యమానికీ దారితీసిన నీట్, ఇతర పోటీ పరీక్షల తాలూకు ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకూ, పరీక్షల సంస్కరణలకూ నీలేకని నేతృత్వాన మొన్న జూలైలో ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ ఇంకా నివేదిక సమర్పించాల్సివుంది.

నీలేకని మాత్రమే కాదు... ఇటీవల కేంద్ర విద్యాశాఖకు అనుబంధంగా వుండే పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా ఇలాంటి సూచనే చేసింది. ఒకే మాదిరి ప్రశ్నలు తరచు పునరావృతంచేసే విధానమైనా, నిపుణులతో ప్రశ్నపత్రాల రూపకల్పనైనా పరీక్షకుండే విశ్వసనీయతకు విఘాతం కలిగిస్తున్నదని అభిప్రాయపడింది. ఇందుకు బదులు నేషనల్ టెస్టింగ్ ఏజ□ న్సీ (ఎన్‌టీఏ) భారీస్థాయిలో, విస్తృతంగా ప్రశ్నల నిధిని ఏర్పాటుచేసుకుని, దాన్ని ఎప్పటికప్పుడు నవీకరించటం వంటి కసరత్తు చేయాలని సూచించింది.



డిజిటల్ ఉపకరణాల సాయంతో ప్రశ్నల నిధినుంచి అప్పటికప్పుడు ప్రశ్నపత్రం రూపొందించి, నిపుణులు పరిశీలించాక పరీక్ష కేంద్రాల్లోని కంప్యూటర్లకు విడుదలచేస్తే సరిపోతుందని సంఘం సూచించింది. ఆ నిపుణుల్ని పరీక్ష సమయం పూర్తయ్యేవరకూ బయటికెళ్లకుండా చూస్తే సరిపోతుందని సలహా ఇచ్చింది. ప్రశ్నల నిధి ఏర్పాటుకు సాయంచేసినవారికి సైతం పరీక్షలో అవి వస్తాయో రావో తెలియవు గనుక లీక్ సమస్యే ఉండదని, ప్రశ్నపత్రాల రూపకల్పన, వాటి ముద్రణ, పరీక్ష కేంద్రాలకు పంపిణీ వంటి ప్రక్రియలో ఎక్కడో ఒకచోట లీక్‌లకు ఆస్కారం ఉంటుందన్నది దాని అభిప్రాయం.

ఇదంతా వినడానికి బాగానే అనిపిస్తుంది. కాకపోతే బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ, నమ్మకంగా పనిచేసే వ్యక్తులు ఏ స్థాయిలోనూ లేరని నీలేకని అయినా, స్థాయీ సంఘమైనా నిర్ధారణకు రావటం మన అధికారయంత్రాంగం వైఫల్యానికి అద్దం పడుతోంది. అసలు ముద్రణకెళ్లినప్పటినుంచి దాని బాధ్యతలు చూసేవారిలో 'ఎవరో' ఈ స్కాంకు పాల్పడుతున్నారన్న అభిప్రాయం నిజం కాదు. కోట్లాది రూపాయల రాబడి తెచ్చే ఈ లీకుల వెనక మాఫియా ఉంది. వాటితో కోచింగ్ సంస్థల సంబంధాలు, దీనంతటికీ రాజకీయ నేతల అండదండలు రహస్యం కాదు. లేనట్టయితే నిందితులు సులభంగా కేసుల్నించి ఎలా తప్పించుకుంటున్నారు? ప్రభుత్వం అనే అతి పెద్ద వ్యవస్థ గుప్పెడు మాఫియా ముఠాలను అదుపు చేయలేని నిస్సహాయస్థితిలో ఉందంటే... అందుకోసం కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో అప్పటికప్పుడు ప్రశ్నపత్రాల రూపకల్పనే దిక్కని భావిస్తే అది మన పాలనావ్యవస్థ తీరుకు అద్దం పడుతుంది.

మనకు దేశవ్యాప్తంగా లక్షన్నర పోటీ పరీక్ష కేంద్రాలున్నాయి. మహానగరాల్లో తప్ప ఎక్కడా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన ఇంటర్నెట్, విద్యుత్ సరఫరా సహా ఇతర ప్రాథమిక సౌకర్యాలు కూడా లేని వర్తమాన స్థితిలో గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు కంప్యూటర్ వాడకంలో నైపుణ్యం సాధించగలుగుతారా? అంతంతమాత్రం ఆదాయాలతో బతికే బడుగు వర్గాల కుటుంబాలనుంచి వచ్చే పిల్లలకు ఈనాటికీ కంప్యూటర్లు అందుబాటులో లేవు. ఇలాంటి స్థితిలో పోటీ పరీక్షనాడు కొత్తగా కంప్యూటర్‌తో కుస్తీపట్టడం వారికి సౌకర్యంగా అనిపిస్తుందా? విద్యతోసహా అన్నిచోట్లా తీవ్ర అసమానతలు వర్ధిల్లేచోట మహానగరాల్లో సంపన్నుల పిల్లలు మాత్రమే ఈ పోటీ పరీక్షల్లో విజయం సాధించగలుగుతారు. ఇలాంటి విధానం అమల్లోకి తీసుకురావాలంటే దేశవ్యాప్తంగా మెరుగైన బ్యాండ్‌విడ్త్‌తో అన్ని విద్యాసంస్థలకూ ఇంటర్నెట్, ప్రతి విద్యార్థికీ కంప్యూటర్ సౌకర్యం లభించేలా చూడటం ముఖ్యం. వారికి పటిష్టమైన శిక్షణ అవసరం. ఆ సంగతి కేంద్రం గుర్తించాలి.

స్థానిక స్వపరిపాలనకు అడ్డంకులెన్నో!

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముహూర్తాలు ఖరారైన ఈ సమయంలో, తెలంగాణలో త్వరలో రెండోదశ మున్సిపల్ ఎలక్షన్లు జరగనున్న నేపథ్యంలో- మూడంచెల పాలనావ్యవస్థతో ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠపరచాలన్న 73, 74 రాజ్యాంగ సవరణల లక్ష్యం ఎంతవరకు నెరవేరిందో పరిశీలించడం సముచితం. ప్రజాస్వామ్యమంటే సమానత్వం... జీవితంలో పురోగమించడానికి అందరికీ సమాన అవకాశాలు లభించడం. అధికారం, ఆర్థిక వనరులపై ఎవరో కొద్దిమంది గుత్తాధిపత్యం చలాయించే పరిస్థితి లేకుండా పాలన వికేంద్రీకృతమైతేనే- విధాన రచన, జనహిత కార్యక్రమాల అమలులో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం పెరిగి సమ్మిళిత అభివృద్ధి సాధ్యపడుతుంది. అందుకోసమే ఏర్పాటైన స్థానిక సంస్థలు ఉత్సవ విగ్రహాలవుతుండటంతో ప్రజాకాంక్షలకు ఎక్కడా విలువ దక్కట్లేదు. నిధులు, విధులు, అధికారాల బదిలీలో దశాబ్దాలుగా సవతితల్లి ప్రేమ చూపిస్తున్న ప్రభుత్వాల కారణంగా ప్రజాసమస్యలను పరిష్కరించడానికి గ్రామ పంచాయతీలూ పురపాలికలకు శక్తి చాలట్లేదు. దాంతో కనీస మౌలిక వసతులకైనా నోచుకోని దుర్భర పరిసరాల్లో ఈసురోమంటూ బతకాల్సిన దారుణావస్థ సామాన్య జనానికి తప్పట్లేదు!



కేవలం ఎన్నికల నిర్వహణతోనే స్థానిక స్వపరిపాలనా దర్శాలు సాకారం కావు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, పారిశుద్ధ్యం మొదలు మంచినీటి సరఫరా వరకు అన్నింటినీ గమనిస్తూ, పౌరసేవల్లో లోపాలను గుర్తిస్తూ, వాటిని సత్వరం పరిహరించడానికి తగినంత సిబ్బంది, వనరులు పంచాయతీలు, పురపాలక సంఘాలకు ఉండాలి. ఉదాహరణకు అమెరికా, చైనాల్లోని మొత్తం సర్కారీ ఉద్యోగుల్లో మూడింట రెండొంతుల మంది స్థానిక ప్రభుత్వాలకు చెందిన వారే. మనదేశ యంత్రాంగంలో మాత్రం అటువంటి వారి సంఖ్య పదిశాతానికి కాస్త ఎక్కువంతే! నిధుల విషయంలోనూ అదే దుస్థితి. 1961లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సొంత పన్ను రాబడుల వాటాలు జీడీపీలో వరసగా 5.5, 2.6శాతాలుగా ఉండేవి. 2019కి వచ్చేసరికి అవి 11, 6.4శాతాలకు పెరిగాయి. అదే కాలవ్యవధిలో పట్టణ స్థానిక సంస్థల పన్ను ఆదాయం మాత్రం 0.4శాతం నుంచి 0.3శాతానికి పడిపోయింది. కేంద్ర, రాష్ట్ర సర్కార్ల నుంచి వచ్చే నిధులపైనే పూర్తిగా ఆధారపడాల్సిన దుస్థితిలో స్థానిక సంస్థల స్వయంనిర్ణయాధికారం చెల్లనికాసు అవుతోంది. మున్సిపాలిటీలతో పోలిస్తే, సొంత రాబడి మార్గాలు ఇంకా తక్కువగా ఉన్న పంచాయతీల్లోనైతే చిన్న చిన్న ప్రజాపనులకూ సొమ్ములకోసం తడుముకోవాల్సి వస్తోంది. దాంతో జీవకళ కోల్పోతున్న పల్లెల నుంచి నగరాలకు వలసలు విపరీతమవుతున్నాయి!

స్థానిక సంస్థల ఎన్నికలంటే ఆయా ప్రాంతాల సమస్యలే ప్రముఖంగా చర్చకు రావాలి. గ్రామాభివృద్ధి, పట్టణ ప్రగతి ప్రణాళికలను ప్రజల ముందు ఉంచుతూ ఓట్లు అడగాలి. దానికి భిన్నంగా జాతీయ, రాష్ట్రస్థాయి అంశాలతో ప్రచారాన్ని హోరెత్తించడానికే పార్టీలు చాలావరకు పరిమితమవుతున్నాయి. దాంతో పల్లె, పట్టణ ప్రాంత ప్రజానీకం దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇక్కట్లు అనేకం అలాగే కొనసాగుతున్నాయి. ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్త, కొద్దిపాటి వానలకే బురదమయమయ్యే రహదారులు, ఎప్పుడు వెలుగుతాయో తెలియని వీధిదీపాలు, కలుషిత జలాలు వంటివి జనజీవన ప్రమాణాలను దిగనాసిల్లజేస్తున్నాయి. ఈ అవ్యవస్థలో మార్పు వచ్చి ప్రజాస్వామ్య ఫలాలు గ్రామస్థాయి వరకు చేరాలంటే పంచాయతీరాజ్ సంస్థలకు నేరుగా రాజ్యాంగం నుంచే అధికారాలను దఖలుపరచాలి. వనరుల పంపిణీకి స్పష్టమైన పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలి. స్థానిక సంస్థల కార్యనిర్వాహక సామర్థ్యాలను బలోపేతం చేసే మౌలిక సంస్కరణలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంకట్టాలి!

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం ⁞ 20.11.2026 ⁞ 01

ఆస్పత్రికి ఫ్లూయిడ్ బాటిల్స్ అందచేసిన సుంకర సుధాకర్

యాడికి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్ :



మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న ఆస్పత్రి కి గురువారం సుంకర సుధాకర్ ఫ్లూయిడ్ బాటిల్స్ అందచేసిన అందచేశారు.రాయలచెరువు గ్రామస్థులైన సుంకర సుధాకర్ , సుంకర నాగ జ్యోతి ల కుమార్తె సుంకర మానస జన్మదినం సంద ర్భంగా రాయలచెరువులో ఉన్నప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు ఎన్ ఎస్ ఫ్లూయిడ్ బాటిల్స్ ను వైద్యాధికారులు దేవరాజు, అప్పయ్య లకు అందచేశారు. వైద్యాధికారి దేవరాజు, అప్పయ్య మాట్లాడు తూ ఎన్ ఎస్ ఫ్లూయిడ్ బాటిల్స్ ను రక్తం తక్కువగా ఉన్న గర్భవ తులకు , ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ ను ఎక్కించడంలో ఆసుపత్రిలో ఉపయోగిస్తారని తెలిపారు.సుంకర మానస భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని వేడుకోన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఎస్.కిరణ్ కుమార్ , మానస తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సేవే పరమావధిగా పనిచేయాలి..
ప్రజల మన్ననలు పొందాలి!

- నందిగాం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 14 మంది ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం
- శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

నందిగాం, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్



నందిగాం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన ప్రజాప్రతినిధులు కొలువుదీరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో 14 మంది ఎంపీటీసీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో ఎంపీటీసీ సభ్యులు ఒక్కొక్కరుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీటీసీ సభ్యులందరికీ మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకో వాల్సిన గురుతర బాధ్యత నూతన ప్రజాప్రతినిధు లపై ఉందని పేర్కొన్నారు.మంత్రి మాట్లాడుతూ.. ఈ విజయం కేవలం పదవులు దక్కించుకోవడమే కాదని, ప్రజలకు మరింత బాధ్యతతో సేవలందించా ల్సిన బాధ్యతను పెంచిందని అన్నారు. పదవులను అధికారానికి ప్రతీకలుగా కాకుండా ప్రజాసేవకు వే దికలుగా భావించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామాల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి అవసరాలను గుర్తించి పరిష్కారా నికి చొరవ చూపాలని సూచించారు. ప్రజల ఆదరా భిమానాలు, మన్ననలు పొందేలా అంకితభావంతో పనిచేయాలని నూతన ఎంపీటీసీ సభ్యులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధు లు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా నూతన పాలకవర్గం పనిచేయాలి



- నూతన ఎంపీపీ, ఎంపీటీసీలకు ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన
- అనంతపురం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం
- ఎంపీపీగా చల్లా జయకృష్ణ, వైస్ ఎంపీపీగా ఉదయ్ శంకర్ బాధ్యతల స్వీకరణ
ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

అనంతపురం రూరల్ మండల పరిషత్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సందడి వాతావరణంలో జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమా నికి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతపురం రూరల్ మండల ఎంపీపీగా చల్లా జయకృష్ణ, వైస్ ఎంపీపీగా ఉదయ్ శంకర్ ప్రమాణ స్వీకారం చేసి అధికారికంగా తమ పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు మండల పరిధిలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీ మరియు ఎంపీటీసీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో పార్టీ నాయకులు, కార్యకర్తల కోలాహలం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో, ఆశయాలతో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రా ధాన్యత ఇవ్వాలని సూచించారు. మీ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులందరూ ఒకే తాటిపైకి వచ్చి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడి ఇంటికి చేరవేస్తూ, అవినీతి రహిత, పారదర్శక పాలనను అందించి మీ గ్రామాలను, కాలనీలను జిల్లాలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

ముస్తాబైన ఎంపీడీవో కార్యాలయం..



- వేడుకకు ఘనంగా ఏర్పాట్లు

ధర్మవరం నవంబర్ 19 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం మండల పరిషత్‌కు కొత్త నాయకత్వ బాధ్య తలు చేపట్టే కీలక ఘట్టానికి వేళైంది. ఎంపీపీ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ధర్మవరం ఎంపీడీవో కార్యాలయం ముస్తాబవుతోం ది. ఈ వేడుకను పురస్కరించుకుని కార్యాలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించడంతో పాటు, ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించేందుకు ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. కార్యక్రమానికి హా జరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కల గకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నారు.

అడుగడుగునా ఏర్పాట్లు.. వేడుకపై ప్రత్యేక దృష్టి

ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎలాంటి అవాంతరా లు లేకుండా సజావుగా సాగేందుకు అధికారులు అన్ని అంశాలను పర్యవేక్షిస్తున్నారు. వేదిక అలం కరణ నుంచి ప్రాంగణ పరిశుభ్రత వరకు ప్రతి అంశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రజాప్ర తినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. మండల పరిషత్ పాలనలో కొత్త బాధ్యతల స్వీకారా నికి వేదిక కానున్న ఎంపీడీవో కార్యాలయం ప్రస్తుతం వేడుక శోభను సంతరించుకుంది.

పుట్టపర్తి ఎంపీపీగా నాగరాణి.

పుట్టపర్తి రూరల్ నవంబర్ 19 అనంత జన శక్తి న్యూస్.

పుట్టపర్తి మండల పరిషత్ అధ్యక్షురాలిగా నల్లపూసల నాగరాణి ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షురాలిగా వడితే లక్ష్మీబాయిని ఎన్నుకున్నారు. పుట్టపర్తి మండల పరిధిలో 8 ఎంపీటీసీలు ఉండగా, 8 ఎంపీటీసీలను టిడిపి కైవసం చేసుకుంది, అందులో ఏడు మంది ఎంపీటీసీలు మహిళలే కావటం విశేషం, పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేష్ బాబు, ఎంపీడీవో నరేష్ కృష్ణ ఆధ్వర్యంలో 8 మంది ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీపీ అభ్యర్థిగా నాగరాణిని పెడపల్లి ఎంపీటీసీ 1 వాణి ప్రతిపాదించగా, కప్పల బండ ఎంపీటీసీ సభ్యులు నరసింహులు ఆమెను బలపరిచారు. అంతకుమునుపు ఎనిమిది మంది ఎంపీటీసీలు, అమగొండ పాల్యం ఎంపీటీసీ, చింతల శివమ్మ, చెర్లోపల్లి. సాయమ్మ, జగరాజు పల్లి, నర్సింహులు, నిడిమామిడి రామలక్ష్మమ్మ, పెడపల్లి వన్ వాణి, పెడపల్లి టు వడితే లక్ష్మీబాయి, రాచూ వారి పల్లి కురాకుల ప్రభావతమ్మ వెంగళమ్మ చెరువు నల్లపూసల నాగరానీ, ప్రమాణం స్వీకారలు చేశారు. అనంతరం మండల అధ్యక్షులు, మండల ఉపాధ్యక్షులు ఎంపిక నిర్వహిం చారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి రమేష్ బాబు, ఎంపిటిసి లకు పులు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఆదినారా యణ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ విజయ్ కుమార్, శ్రీరామ్ నాయక్, పుల్లప్ప, కో ట్లపల్లి వెంకటాద్రి, రాజువారి పల్లి కేశవ, ఆనంద్, పాల్గొన్నారు.



ఈవీఎంలైనా, బ్యాలెట్లయినా ప్రజల తీర్పు కూటమి వైపే..

- ఎమ్మెల్యే దగ్గుపాటి
- అర్బన్ టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకుల కీలక ప్రెస్ మీట్
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయి కాబట్టే.. వైసీపీ మేయర్ అభ్యర్థి గెలిచారు
- డిప్యూటీ మేయర్, ఎంపీపీ పదవుల్ని నిర్ణయించేది అధిష్టానమే.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.. కొనకొండ్ల రాజేష్
- ప్రజాభిమానంతోనే ఊహించని స్థానాలు గెలుచుకున్నాం.. జనసేన నగరాధ్యక్షుడు బాబురావు

అనంతపురం నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్



ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు ఎప్పుడూ కూటమి వైపే ఉంటుందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ రాజేష్, జనసేన నగరాధ్యక్షుడు బాబురావులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో గతంలో కంటే భిన్నంగా, అత్యంత ప్రజా స్వామ్యబద్ధంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగా యని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గతంలో ఈవీఎంల గురించి ఇష్టానుసారం మాట్లాడిన వైసీపీ నేతలు, ఇప్పుడు బ్యాలెట్ పత్రాలతో జరిగిన ఎన్నిక ల్లోనూ కూటమి 95 శాతానికి పైగా స్థానాల్లో ఘనవి జయం సాధించడంపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. జిల్లాలో జెడ్పీ ఎన్నికల్లో వైసీపీ కేవలం 2 స్థానాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ నాయకుడు గతంలో స్థానిక ఎన్నికల్లో అనేక దాడులు, రిగ్గింగ్‌లు చేయించారని విమర్శించారు. ఈ ఎన్నికల్లోనూ 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట కావాలని గొడవలు సృష్టించి, ఏదో జరిగిపో తోందని దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. 40 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడమే నేటి ప్రజాస్వామ్య పాలనకు నిదర్శన మన్నారు. అనంతపురం నగరపాలక సంస్థలో ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరిగాయి కాబట్టే వైసీపీ మేయర్ అభ్యర్థి గెలుపొందారన్నారు. గత ప్రభుత్వంలా మేము అక్రమాలకు పాల్పడి ఉంటే మేయర్ పీఠం కూడా మాకే దక్కేదని ఎమ్మెల్యే తెలిపారు. నగరంలోని 41 డివిజన్లలో, రూరల్ పరిధిలో 9 ఎంపీటీసీ స్థానాల్లో కూటమిని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ ఎన్నికలో జరిగిన చిన్న చిన్న తప్పిదాలను సరిదిద్దుకుని ముందుకెళ్తామని చెప్పారు. అనంత నగర డిప్యూటీ మేయర్ పదవి అభ్యర్థిని, అలాగే కూటమిలో ఎంపీపీ పదవి బాధ్యతలను పార్టీ అధిష్టానమే నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. నిన్న రాత్రే అధిష్టానం నుంచి జాబితా వచ్చిందని, ఆ లిస్ట్ ప్రకారమే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పాలన సాగు తోందన్నారు. ఒకవైపు ఎల్ నినో సమస్య, మరోవైపు ఎన్నికల వేళ తుఫాను ప్రభావం ఉన్నా తుఫాను కంటే వేగంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేసి నష్టాన్ని నివారించిందన్నారు. ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌తో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజల కు సమర్థవంతంగా అందిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు విజన్, మంత్రి నారా లోకేష్ కార్యాచ రణతో విశాఖ సీఐఐ సదస్సులో 9.89 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయని, 25 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత పాలనలో దెబ్బతిన్న రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను సీఎం తిరిగి నిలబెట్టారని, హంద్రీనీవా వెడల్పు చేసి అటు కుప్పం, ఇటు మడకశిర వరకు నీరు తీసుకెళ్తున్నామన్నారు. రైజింగ్ రాయలసీమ ద్వారా ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని చెప్పారు. అలాగే పార్టీ పరంగా బీసీలకు 40 శాతం రిజర్వేషన్ కల్పించి సామాజిక న్యాయం చేశామ న్నారు. గతంలో చాలా మంది బీసీలకు పదవులు లేకుండా చేశారని వైసీపీ పై విమర్శలు చేశారు. బీసీ రిజర్వేషన్ ను అడ్డుకున్నప్పటికీ తాము కూటమి ద్వారా 40శాతానికి మించి స్థానాలు ఇచ్చి గెలి పించుకున్నామన్నారు. ప్రజలంతా ఈ అభివృద్ధిని గమనించి, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉండేలా రాబోయే పంచాయతీ ఎన్ని కల్లోనూ కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. మూడు పార్టీల నాయకులు కలిసి ఏ పార్టీకి ఎక్కడ బలం ఉందో అక్కడ ఆ స్థానాలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ రాజేష్, జనసేన నగరాధ్యక్షుడు బాబురావులు మాట్లాడు తూ అనంతపురం మేయర్ స్థానం కోల్పోవడంపై సమీక్షించుకుంటున్నామని, అయితే నగరంలోని 41 డివిజన్లలో కూటమి అభ్యర్థులు గెలవడం మా బలానికి, ప్రజాభిమానానికి నిదర్శనమని అన్నారు. ఎన్నికల్లో అన్ని చోట్ల బీజేపీ, జనసేన పార్టీలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చారని, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు అడిగిన వెంటనే సీట్లు కేటాయించి పూర్తి సహకారం అందించారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉంది కాబట్టే ఎవరూ ఊహించని విధంగా స్థానాలు గెలుచుకున్నామని తెలిపారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ మూడు పార్టీలు కూర్చుని సమన్వ యంతో చర్చించుకుని ముందుకెళ్తామని, అందరం కలిసి ప్రజలకు సేవ చేస్తూ ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వ ర్యంలో అనంతపురం నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

6వ వార్డులో బీజేపీకి కొత్త బలం!

- మంత్రి సత్యకుమార్ యాదవ్ అభివృద్ధి, ప్రజాసేవకు ఆకర్షితులై 50 కుటుంబాల చేరిక....
- హరీష్ బాబు సమక్షంలో కాషాయ కండువాలు కప్పుకున్న వివిధ వర్గాల ప్రజలు....
- సోమ్లా నాయక్ ఆధ్వర్యంలో ఎన్డీఏ కార్యాలయంలో ఘనంగా చేరికల కార్యక్రమం....

ధర్మవరం నవంబర్ 19 అనంత జనశక్తి న్యూస్ :



ధర్మవరం పట్టణంలోని 6వ వార్డులో భారతీయ జనతా పార్టీకి మరింత బలం చేకూరింది. మంత్రి యాదవ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజ లకు అందిస్తున్న సేవలు, బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైన సుమారు 50 కుటుంబాలు గురువారం భారతీయ జనతా పార్టీలో చేరాయి. 6వ వార్డు బీజేపీ ఇన్‌చార్జి సోమ్లా నాయక్ ఆధ్వర్యంలో ధర్మవరం ఎన్డీఏ కా ర్యాలయంలో నిర్వహించిన ఈ చేరికల కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సంద ర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు పార్టీ కండువాలు కప్పి కొత్తగా చేరిన వారిని సాదరంగా బీజేపీలోకి ఆహ్వానించారు.

మంత్రి అభివృద్ధి కార్యక్రమాలపై ఆకర్షణ

ధర్మవరం పట్టణంలోని 6వ వార్డుకు చెందిన శివప్ప, మల్లీ శెట్టి మురళి, లచ్చి, బుట్ట హరి తదితరుల ఆధ్వ ర్యంలో సుమారు 50 కుటుంబాల సభ్యులు బీజేపీలో చేరారు. వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని కాషాయ కండువాలు ధరించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గంలో చేపడుతు న్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవ, సంక్షేమ కార్యక్రమాల అమలుపై విశ్వాసంతో పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు. ఈ చే రికలతో 6వ వార్డులో బీజేపీ కార్యకలాపాలకు మరింత ఊతం లభించనుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

దేశ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ బీజేపీ కు టుంబంలోకి చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. భారతీయ జనతా పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశ అభివృద్ధి, జాతీయత, సుపరిపాలన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వంలో భార తదేశం అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని వివరించారు. దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.

ధర్మవరం అభివృద్ధే మంత్రి సత్యకుమార్ లక్ష్యం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని హరీష్ బాబు తెలిపారు. ప్రజ లకు మెరుగైన వైద్య సేవలు అందించడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, సంక్షేమ పథ కాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొ న్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ అందిస్తున్న ప్ర జాసేవ, నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి పట్ల ఆకర్షితులై వివిధ వర్గాల ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ కావడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పి లుపునిచ్చారు.

ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం

బీజేపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని హరీష్ బాబు హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారంతా ఐక్యంగా పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వార్డు స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భా గస్వాములు కావాలని కోరారు. ప్రజా సమస్యల పరి ష్కారానికి అందరూ సమిష్టిగా కృషి చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కొత్తగా చేరిన కుటుంబాలతో ధర్మవరంలో బీజేపీ మరింత విస్తరిస్తుందని, రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని నాయకులు పేర్కొన్నారు.

'అనంత' వైయస్సార్ సీపీ నేతలు హౌస్ అరెస్ట్..

- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వంచడం చేతగాకే దాడులు, అక్రమ అరెస్టు..
- వ్యవస్థలను హస్తగతం చేసుకుని అప్రజాస్వామికంగా గెలవడం ఒక గెలుపేనా.?
- కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైయస్సార్ సీపీ నేతలు

అనంతపురం, నవంబర్ 19:అనంత జనశక్తి న్యూస్

శింగణమల ఎంపీపీ ఎన్నిక సందర్భంగా.. ఎన్నికలను పర్యవేక్షించేందుకు అనంతపురం నుంచి శింగణమల బయలుదేరుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మేయర్ రమేష్ గౌడ్, మాజీ మేయర్ వసీం లను అనంత నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... ఏపీలో స్థానిక ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు, ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యంను అపహస్యం చేసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలకే ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. అందుకోసమే వ్యవస్థలను హస్తగతం చేసుకుని ఎన్నికలను ఏకపక్షంగా చేసుకోవాలనే కుటిల ప్రయత్నాల్లో భాగంగానే వైయస్సార్ సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్ట్ లు అని విమర్శించారు. ఆర్ఓ లను, పోలీసులను అడ్డు పెట్టుకుని అప్రజాస్వామికంగా తమ అభ్యర్థులను గెలిపించుకుంటున్నారన్నారు. శింగణమల ఎంపీపీ ఎన్నిక సందర్భంగా ఇరుపార్టీలకు సమానంగా ఎంపీటీసీలు గెవడంతో అక్కడ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎంపీపీను కైవశం చేసుకోవాలని కూటమి నాయకులు చూస్తున్నారని చెప్పారు. మా పార్టీ ఎంపీ



టీసీలకు భరోసానివ్వడానికి మేము శింగణమలకు బయలుదేరుతుంటే పోలీసులను అడ్డుపెట్టుకుని హౌస్ అరెస్ట్ చేసారని చెప్పారు. ప్రజాస్వామ్యం మీద మీకు నమ్మకం ఉంటే మీ పదవులకు రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో మీరు గెలిస్తే మళ్ళీ మేము ఎవ్వరు ఎన్నికల్లో పోటీ కూడా చేయబోమన్నారు. అధికారులు, పోలీసులు ఇప్పటికైనా తమ పద్ధతిని మార్చుకుని ప్రజల కోసం పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ... తనకు ఎంతో అపారమైన అనుభవం ఉంది అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు మన దేశంలో ఒక కొత్త పద్ధతిని ఇప్పుడు తీసుకువచ్చారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంను ఖుని చేస్తూ పోలీసులను అడ్డుపెట్టుకుని స్థానిక ఎన్నికల్లో
కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటూ ప్రజలంతా మావైపే ఉన్నారని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఇలా అప్రజాస్వామికంగా ఎన్నికలు నిర్వహించేదానికంటే ఎవరు అధికారంలో ఉంటే వాళ్ళు నామినేటెడ్ పద్ధతిలో జరుపుకునేలా కేంద్రంతో మాట్లాడుకుని జీవో తీసుకురావాలని హితవు పలికారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ.. కూటమి నాయకులకు పాలనపై నమ్మకం లేకనే ఇలా పోలీసులను అడ్డుపెట్టుకుని వైయస్సార్ సీపీ అభ్యర్థులపై దాడులు, దౌర్జన్యాలు చేస్తూ అక్రమ అరెస్ట్ లకు పాల్పడుతూ ఏకపక్షంగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడి తరిమికొట్టేలా రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. మేయర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కూటమి పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్న విషయాన్ని గ్రహించే కూటమి పార్టీల నాయకులు స్థానిక ఎన్నికల్లో దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించుకుని గెలిచి ప్రజలు మావైపే ఉన్నారంటూ చెప్పుకుంటున్నారని చెప్పారు. నాడు జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి దేశంలోనే ఆదర్శంగా నిలిస్తే, నేడు చంద్రబాబు నాయకత్వంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో చేస్తున్న అరాచకాలను దేశం మొత్తం చూస్తున్నారని చెప్పారు. మాజీ మేయర్ వసీం మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత కొన్నిరోజులుగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్న తీరును చూస్తుంటే ప్రజాస్వామ్యంపై నమ్మకం సన్నగిల్లుతున్నదని చెప్పారు. ప్రజలు ప్రతి ఒక్కటీ గమనిస్తున్నారు. రానున్న రోజుల్లో వైయస్సార్ సీపీకు ప్రజలు పట్టం కడతారని చెప్పారు.

అట్టహాసంగా కొ ట్లపల్లి, సర్పంచ్ అభ్యర్థి నామినేషన్.



పుట్టపర్తి రూరల్ నవంబర్ 19 నంత జన శక్తి న్యూస్.

పుట్టపర్తి మండల పరిధిలోని కొట్లపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి పార్వతి నామినేషన్ గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఆమె భర్త కంసల నారాయణస్వామి ఆధ్వర్యంలో కోట్లపల్లి నుండి తన అనుచరులతో నిడిమామిడి వరకు భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గతంలో ఇదే పంచాయతీకి కంసల నారాయణస్వామి పోటీ చేసి ఓటమి చవిచూశారు. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడుగా ఉంటూ తన భార్య పార్వతిని సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దించారు. గ్రామంలో గత కొంతకాలం నుండి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేయడమే కాక తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినందుకు తమకు పార్టీ ఈ అవకాశం కల్పించిందని , కంసల నారాయణస్వామి తెలిపారు. తన భార్య పార్వతిని సర్పంచ్ గా ఎన్ను కొంటే, పంచాయతీ లో పలు అభివృద్ధి పనులు చేసి ప్రజల అభిమానాన్ని , పొందుతానని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రశాంతి నిలయంలో అంబరాన్నంటిన లేడీస్ డే వేడుకలు



- ప్రత్యేక అతిథిగా సినీనటి రష్మిక మందన్న..

మహిళా భక్తుల కోలాహలం

పుట్టపర్తి, నవంబర్ 19 (అనంత జనశక్తి న్యూస్):

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో గురువారం లేడీస్ డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తి, ఆధ్యాత్మికత, ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ వేడుకలకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ప్రశాంతి నిలయం భక్తజన సందోహంతో కళకళలాడింది.ఈ వేడుకలకు ప్రముఖ సినీనటి రష్మిక మందన్న ప్రత్యేక అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె రాకతో కార్యక్రమ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా రష్మిక మందన్న మహిళా భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషంగా నిలిచింది.భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహిళలకు అందించిన గౌరవం, సేవాభావం, ఆధ్యాత్మిక సందేశాలను స్మరించుకుంటూ నిర్వహించిన లేడీస్ డే వేడుకల్లో మహిళా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ప్రత్యేక అతిథిగా సినీనటి రష్మిక మందన్న హాజరుకావడం, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలిరావడంతో ప్రశాంతి నిలయంలో పండుగ వాతావరణం నెలకొంది. శతజయంతి ఉత్సవాల్లో ఈ లేడీస్ డే వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సాయిబాబా కు కార్తీక మాసం పూజలు

యాడికి, నవంబర్

19,అనంత జనశక్తి న్యూస్:



మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో ఉన్న సాయిబాబా దేవాలయంలో గురువారం సాయిబాబా కు కార్తీక మాసం పూజలు నిర్వహించారు. సాయిబాబాకు అభిషేకాలు చేసి, వివిధ పూలమాలతో అలంకరించారు. అర్చనలు చేసి,హారతులను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని సాయిబాబా ను దర్శించి.టెంకాయలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అంద చేశారు. సాయంత్రం భజన కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఉత్సవ మూర్తిని పల్లకి లో ఉంచి,సాయినాథ్ మహారాజ్ కు జై అంటూ..... దేవాలయం చూట్టు ప్రదక్షిణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు,భక్తులు పాల్గోన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదే!

- అనంతపురంలో ఘనంగా ప్రపంచ వారసత్వ వారోత్సవాలు – 2026
- ఎస్ఎస్బీఎన్ కళాశాల నుంచి కల్లూరు సుబ్బారావు మ్యూజియం వరకు హెరిటేజ్ వాక్

అనంతపురం, నవంబర్ 19: అనంత జనశక్తి న్యూస్

చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సూయశ్ కుమార్ ఐఏఎస్ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాలు - 2026లో భాగంగా రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'మ్యూజియం చూద్దాం రండి' (హెరిటేజ్ వాక్) కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేవు ఐఏఎస్, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ఎస్ఎస్బీఎన్ కళాశాల నుంచి ప్రారంభమైంది. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సూయశ్ కుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, వారసత్వ పరిరక్షణ సంస్థల సభ్యులు ర్యాలీలో పాల్గొని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు, ప్రదర్శనశాల మ్యూజియం వరకు కొనసాగించారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ సూయశ్ కుమార్ మాట్లాడుతూ.. నిత్యజీవితంలో నైతిక విలువలు, ఉన్నత ప్రమాణాలతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలంటే మన వారసత్వ విలువలను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రక కట్టడాలు, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. స్వామి నాయక్ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ఘనమైన చరిత్రకు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మ్యూజియం నిలయంగా ఉందన్నారు. ఆదిమ మానవుల కాలం నుంచి 19వ శతాబ్దం వరకు జిల్లాకు సంబంధించిన చారిత్రక విశేషాలు, పురాతన వస్తువులు, సంస్కృతి సంప్రదాయాలను మ్యూజియం ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు.ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) కోకన్వీనర్ పి. కృష్ణమూర్తి మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా గొప్ప వారసత్వ చరిత్రకు నిలయమని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ముఖ్యంగా యువతపై ఉందన్నారు.ఇంటాక్ సభ్యుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..శ్రీకృష్ణదేవరాయల కాలానికి ముందు, ఆ తర్వాత నిర్మితమైన అనేక చారిత్రక కట్టడాలు జిల్లాలో ఉన్నాయని, వాటిని పరిరక్షించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత, ఇంటాక్ సభ్యుడు మురళీకృష్ణ వారసత్వ సంపద ప్రాధాన్యతను, దానిని భావితరాలకు అందించడంలో విద్యార్థుల పాత్రను వివరించారు. షేక్



రియాజుద్దీన్ తెలుగు పద్యాలను వినిపించి విద్యార్థులను ఆకట్టుకున్నారు.

తెలుగు సాహితీ ప్రముఖుడు జాగర్లమూడి శ్యామ సుందర శాస్త్రి మాట్లాడుతూ.. వారసత్వ పరిరక్షణలో యువత కీలకపాత్ర పోషించాలని, మన సంస్కృతి సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు.ఎస్ఎస్బీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సరిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భార్గవి, తెలుగు అధ్యాపకుడు నగరూరు రసూల్ అనంతపురం చారిత్రక వైభవాన్ని వివరిస్తూ విద్యార్థులకు కవితా సందేశాన్ని అందించారు. ఇన్నర్ వీల్ సభ్యులు జయంతి, శ్రీవల్లి మాట్లాడుతూ.. వారసత్వ పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి కుటుంబంలో పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద గేయాలు, తెలుగు పద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతపురం జిల్లా చారిత్రక వైభవాన్ని, వారసత్వ గొప్పతనాన్ని గుర్తుచేస్తూ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.ఈ కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు జూటూరి షరీఫ్, సూర్యనారాయణరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, సాధు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జయభేరి



- 6మండలాల్లోనూ ఎంపీపీ, వైస్ ఎంపీపీ పీఠాలు కైవసం
- నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ
- ఎంపీపీలు, ఎంపీటీసీలకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించి ప్రమాణ స్వీకారాలకు తరలిన నేత
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్న సునీత

రాప్తాడు నవంబర్ 19,అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఆరు మండలాల్లోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఏకపక్షంగా ఘన విజయం సాధించి క్లీన్‌స్వీప్ చేశారు. ఎక్కడా ఎలాంటి చిన్నపాటి అవాంఛనీయ ఘటనలు కూడా చోటుచేసుకోకుండా, పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ మరియు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలు జరిగింది. ఎన్నికల ప్రక్రియకు ముందు ఉదయం వెంకటాపురంలోని తన నివాసంలో రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మండల ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించే ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం, అనంతరం జరిగే ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నికల విధివిధానాలపై వారికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం అనంతరం ఎంపీటీసీ సభ్యులందరూ కలిసి పరిటాల రవీంద్ర ఘాట్‌ను సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.



అక్కడి నుంచి నాయకులు, కార్యకర్తల కోలాహలం నడుమ ఆయా మండల కేంద్రాలకు బయలుదేరి వెళ్లి ప్రమాణ స్వీకారోత్సవాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన నూతన పాలకవర్గాల వివరాలను పరిశీలిస్తే.. ఆత్మకూరు మండల ఎంపీపీగా మదిగుబ్బ మల్లికార్జున రెడ్డి, వైస్ ఎంపీపీగా ముట్టాల బోయ గీతారాణి ఎన్నికై బాధ్యతలు స్వీకరించగా, అనంతపురం రూరల్ మండల ఎంపీపీగా చల్లా జయకృష్ణ, వైస్ ఎంపీపీగా అనంతపురం అర్బన్ నుంచి ఉదయ శంకర్ ఎన్నికయ్యారు. అలాగే రాప్తాడు మండల ఎంపీపీగా దగ్గుబాటి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీగా తలారి బోయ శివయ్య ప్రమాణ స్వీకారం చేయగా, కనగానపల్లి మండల ఎంపీపీగా యాతం పోతలయ్య, వైస్ ఎంపీపీగా శివపురం కురుబ ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఇక చెన్నేకొత్తపల్లి మండల ఎంపీపీగా దండు ఓబులేసు, వైస్ ఎంపీపీగా బోయ శీలం ఫణింద్ర బాధ్యతలు చేపట్టగా, రామగిరి మండల ఎంపీపీగా కురుబ సుధాకర్, వైస్ ఎంపీపీగా పోలేపల్లి తిమ్మానాయుడు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు.

ఇలా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ టీడీపీ అభ్యర్థులే ఎంపీపీ, వైస్ ఎంపీపీ పీఠాలను కైవసం చేసుకోవడంతో పార్టీ శ్రేణుల్లో సంబరాలు మిన్నంటాయి. రామగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు మరియు ఎంపీటీసీ సభ్యులను ఆమె శాలువాలతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఎంతో నమ్మకం ఉంచి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనూ అఖండ విజయాన్ని అందించారన్నారు. ఈ విజయం మనపై బాధ్యతను మరింత పెంచిందని, నూతన ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మంచి పాలన అందించాలని ఆమె దిశానిర్దేశం చేశారు..

గ్రంథాలయంలో ఘనంగా ఇందిరాగాంధీ 109వ జయంతి

యాడికి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా యాడికి పట్టణంలో ఉన్న గ్రంథాలయం లో గురువారం గ్రంథాలయ అధికారి ఎం మధుసూదన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ 109 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థుల చే ఇందిరా గాంధీ పటానికి పూలమాలలు వేసి ,జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కొత్త రాయుడు మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతిని, జాతీయ సమైక్యత దినోత్సవం కూడా జరుపుకుంటారని, 19 నవంబర్ 1917లో జన్మించినారన్నారు. భారత దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా పని చేశారని, భారత దేశ మహిళ ఉక్కు మనిషిగా కూడా ప్రసిద్ధి చెందారు అని తెలిపారు. గ్రంథాలయ అధికారి మధుసూదన్ మాట్లాడుతు దేశ ప్రజల మధ్య ఐక్యత, మత సామరస్యం, సోదర భావం పెంపొందించడం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో షమీం, రిజ్వానా, మాధవి, వనజ, మనోరమ, జ్యోతి, నాగవేణి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి దేవాలయం లో అన్నదానం

యాడికి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్ :

మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం అయ్యప్పస్వామి,శివస్వామి,ఆంజనేయ స్వామి, దుర్గమ్మ తల్లి మాలాధారులకు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి అభిషేకం చేసి, వివిధ పూల మాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. కందె పాండురంగయ్య శెట్టి జన్మదిన సందర్భంగా భార్య లక్ష్మి కాంతమ్మ మధ్యాహ్నం మాలాధారులకు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.దాత,కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని అయ్యప్పస్వామిని మాలాధారులు వేడుకోన్నారు.ఈ కార్యక్రమంలో అల్లుడు ఆదిత్య శ్రీధర్, కూతురు గీతా వాణి, లయన్ పవన్, గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి, ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు,మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడు మార్గదర్శకత్వంలో టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి నూతన సారథులు..

- ఎంపీపీలు, ఎంపీటీసీల పదవీ బాధ్యతలు స్వీకరణ
- నూతన ప్రజాప్రతినిధులకు మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు..
- ప్రజాసేవలో అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్ష!
- నాలుగు మండలాల్లో ఎంపీటీసీలు, ఎంపీపీలు పదవీ బాధ్యతలు స్వీకరణ

కోటబొమ్మాళి నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

టెక్కలి నియోజకవర్గంలో నాలుగు మండలాల పరిధిలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు) గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసి, నూతన ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టడంతో ఆయా మండలాల్లో స్థానిక సంస్థల పాలనకు కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

నూతన ఎంపీపీలుగా బాధ్యతలు స్వీకరణ

నందిగాం మండలం: పినకాన మోహిణి అజయ్ కుమార్, కోటబొమ్మాళి మండలం: తర్ర రామకృష్ణ, సంతబొమ్మాళి మండలం: సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి, టెక్కలి మండలం: బగాది రమా శేషగిరిరావు, ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 78 ఎంపీటీసీ స్థానాలకు గాను 73 స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. నాలుగు మండలాల పరిధిలో జడ్పీటీసీ స్థానాల్లోనూ అత్యధిక మెజార్టీతో విజయం సాధించింది. నాలుగు మండలాల్లోనూ ఎంపీపీ పదవులను దక్కించుకోవడంతో స్థానిక సంస్థల్లో పార్టీకి స్పష్టమైన ఆధిక్యత లభించింది.

మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వం.. అభివృద్ధికి బాటలు!

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నాయకత్వంలో టెక్కలి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతోంది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా టెక్కలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, రైతులకు సాగునీటి వసతులు, రహదారుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

కార్యకర్తలకు ఆత్మీయత.. నాయకులకు ప్రోత్సాహం.. ప్రజాసేవే లక్ష్యం!

మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలోని ప్రత్యేకత ప్రజలతో ఆయనకున్న అనుబంధం. ప్రతి కార్యకర్తను పేరుపెట్టి ఆప్యాయంగా పలకరిస్తూ, వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ, పార్టీ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతనివ్వడం ఆయన ప్రత్యేక శైలి. కార్యకర్తల కష్టాన్ని గుర్తించి ప్రోత్సహించడం, నాయకులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.

బాధ్యతల స్వీకారం.. అభివృద్ధికి మరో ముందడుగు!

నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేయాల్సిన బాధ్యత ఉంది. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కృషి చేయాలి. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మార్గదర్శకత్వంలో నూతన ప్రజాప్రతినిధులందరూ సమష్టిగా పనిచేస్తూ టెక్కలి నియోజకవర్గ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తారనే ఆకాంక్ష వ్యక్తమవుతోంది. ప్రజలతో అనుబంధం.. కార్యకర్తలకు అండగా నాయకత్వం.. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.. మంత్రి అచ్చెన్నాయుడు నేతృత్వంలో టెక్కలి నియోజకవర్గంలో నూతన ప్రజాప్రతినిధుల బాధ్యతల స్వీకారంతో అభివృద్ధి ప్రస్థానంలో మరో ముందడుగు పడింది.



గుండెకు గుండె ధైర్యం.. గుంటూరుకు యశోద భరోసా!

- కోతలు లేని చికిత్సలు.. బైపాస్ అవసరం తగ్గించే అధునాతన వైద్యం!
- డాక్టర్ భీష్మ చౌదరి దొనేపూడి నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి కార్డియాక్ సేవలు..
- ఇంపెల్లా, ఎక్మో, ట్యావర్ వంటి అత్యాధునిక సాంకేతికతతో క్లిష్టమైన గుండె సమస్యలకు చికిత్స

గుంటూరు నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

గుండె జబ్బు అంటేనే భయం.. బైపాస్ అంటేనే ఆందోళన.. ఓపెన్ హార్ట్ సర్జరీ అంటేనే ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి ఒకప్పుడు ఉండేది. కానీ ఆధునిక వైద్య సాంకేతికత ఆ భయాలకు తెరదించుతోంది. పెద్దపెద్ద శస్త్రచికిత్సలు అవసరం లేకుండానే, అతి చిన్న రంధ్రాల ద్వారా, క్యాథెటర్ ఆధారిత విధానాలతో అత్యంత క్లిష్టమైన గుండె సమస్యలకు సైతం చికిత్స అందించే వైద్య పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఈ అధునాతన వైద్య సేవలను గుంటూరు ప్రాంత ప్రజలకు చేరువ చేస్తూ హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ ముందడుగు వేస్తోంది. ప్రముఖ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ భీష్మ చౌదరి దొనేపూడి నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి గుండె చికిత్సలను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. విజయవాడకు చెందిన ఆయన కోస్తా ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గుంటూరు ప్రజలకు యశోదలో అందుబాటులో ఉన్న వైద్య సాంకేతికతపై అవగాహన కల్పించారు. గుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అత్యంత క్లిష్టమైన గుండె సమస్యలకు సైతం ఆధునిక వైద్య విధానాలతో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైనదని, రోగులను వేగంగా ఆసుపత్రికి తరలించి తక్షణ చికిత్స ప్రారంభించేలా ప్రత్యేక ప్రాణరక్షక ప్రోటోకాల్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు.



కోతలు లేకుండానే గుండె కవాటాల మార్పిడి!

గుండె చికిత్సలో సరికొత్త విప్లవంగా నిలుస్తున్న ట్యావర్ (TAVR), మిత్రాక్లిప్ (MitraClip) విధానాలు యశోద హైటెక్ సిటీలో అందుబాటులో ఉన్నాయి. వృద్ధాప్యంలో గుండె కవాటాల సమస్యలతో బాధపడేవారికి ఛాతీని పూర్తిగా తెరవకుండానే క్యాథెటర్ ద్వారా చికిత్స అందించే అవకాశం ఉంది. రక్తనాళాల్లో వంద శాతం కాల్షియం పేరుకుపోయి మూసుకుపోయిన క్లిష్టమైన కేసుల్లోనూ ఆధునిక ఇంటర్వెన్షనల్ విధానాలతో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు.

స్టెంట్లు లేకుండానే బ్లాకులకు చికిత్స!

రక్తనాళాల్లో జీవితాంతం ఉండిపోయే లోహపు స్టెంట్లకు ప్రత్యామ్నాయంగా ఔషధ పూత కలిగిన బెలూన్లతో చికిత్స చేసే స్టెంట్‌లెస్ విధానం మరో ప్రత్యేకత. ఎంపిక చేసిన రోగుల్లో శాశ్వత స్టెంట్ అవసరాన్ని తగ్గిస్తూ ఈ విధానం ద్వారా చికిత్స అందించవచ్చని తెలిపారు. అంతేకాకుండా అతి చిన్న రంధ్రాల ద్వారా కీహోల్ పద్ధతిలో రోబోటిక్ గుండె శస్త్రచికిత్సలు నిర్వహించే అధునాతన సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

విటమిన్ క్యాప్సూల్ పరిమాణంలో పేస్‌మేకర్!

గుండె లయ తప్పిన రోగులకు అత్యాధునిక లీడ్‌లెస్ పేస్‌మేకర్ విధానం మరో వరంగా మారింది. సాధారణ పేస్‌మేకర్లలో ఉండే తీగలు లేకుండానే, విటమిన్ క్యాప్సూల్ పరిమాణంలో ఉండే పరికరాన్ని నేరుగా గుండె గదుల్లో అమర్చే సాంకేతికత అందుబాటులో ఉంది. ఎంపిక చేసిన రోగులకు ఇది మరింత సౌకర్యవంతమైన చికిత్సా విధానంగా ఉపయోగపడుతుంది.

గుండెకు అండగా ప్రపంచంలోనే అతిచిన్న హార్ట్ పంప్!

అత్యంత క్లిష్టమైన యాంజియోప్లాస్టీ చికిత్సల సమయంలో గుండె పనితీరు బలహీనపడకుండా మద్దతు అందించే ఇంపెల్లా (Impella) హార్ట్ పంప్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. గుండె, ఊపిరితిత్తుల పనితీరు తీవ్రంగా దెబ్బతిని ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎక్మో (ECMO), ఎక్వెల్లా వంటి అధునాతన యంత్రాల ద్వారా ప్రాణాధార సహాయం అందించే సదుపాయాలు కూడా ఉన్నాయి.

వైద్య సదుపాయాల కొరతతో ఒక్క ప్రాణం కూడా పోకూడదు!

అత్యాధునిక వైద్యం అందుబాటులో లేక గుంటూరు జిల్లాలో ఏ ఒక్క గుండె రోగి కూడా ప్రాణాలు కోల్పోకూడదన్నదే తమ ప్రధాన సంకల్పమని డాక్టర్ భీష్మ చౌదరి దొనేపూడి పేర్కొన్నారు. అత్యవసర గుండె చికిత్సల్లో వేగం, వైద్య నైపుణ్యం, ఆధునిక సాంకేతికత కీలకమని తెలిపారు. గుంటూరు ప్రాంత ప్రజలకు మెరుగైన కార్డియాక్ వైద్య సేవలు చేరువ చేయడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ ఏపీ మార్కెటింగ్ మేనేజర్ కె. చంద్రశేఖర్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ ఖాసిం వలి తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక గుండె చికిత్సలు, అత్యవసర వైద్య సేవలపై గురించి ప్రజలకు వివరించారు.

ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహణ

అనంతపురం, నవంబర్ 19 :

అనంత జనశక్తి న్యూస్

నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో అనంతపురం జిల్లా యువజన శాఖ/ఆన్ సెట్ మరియు SR ఎడ్యుకేషనల్ సొసైటి వారి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి సృజనాత్మక ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో వివిధ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాటకం, నృత్యం, చిత్రలేఖనం, కవిత్వ పఠనం తదితర విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.నాటక ప్రదర్శనల ద్వారా తమ ఆలోచనలు, సామాజిక భావాలను వ్యక్తం చేయగా, నృత్య ప్రదర్శనలతో కళాత్మక నైపుణ్యాన్ని చాటుకున్నారు. చిత్రలేఖనంలో ఊహాశక్తికి రంగులద్దుతూ తమ భావాలను చిత్రరూపంలో ఆవిష్కరించారు. కవిత్వ పఠనంలో భాషా పటిమ, భావ వ్యక్తీకరణతో ఆకట్టుకున్నారు.విద్యార్థులలోని విభిన్న ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరం. పాఠ్యాంశాల అధ్యయనంతో పాటు కళలు, సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన పెంపొందుతాయి. ఈ దిశగా యూత్ ఫెస్టివల్ విద్యార్థులకు తమ సామర్థ్యాలను ప్రదర్శించుకునే అవకాశాన్ని కల్పించింది.ఈ జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన వారిలో కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జానపద నృత్యం గ్రూప్ లో, ఏరా ఇంటర్నేషనల్ స్కూల్ జానపద పాట గ్రూప్ లో, RIPER కళాశాల వీధి నాటకం గ్రూప్ లో, జూనియర్ కళాశాల విద్యార్థి నితిన్ పెయింటింగ్ లో మరియు లా కాలేజ్ విద్యార్థిని లక్ష్మి కవిత్వం లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నిర్వాహకులు మెమెంటో మరియు ప్రశంసాపత్రము అందజేసి అభినందించారు. విద్యార్థుల కళాత్మక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ/ఆన్ సెట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రవి శంకర్ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్ పర్సన్ గీతా బాల, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేశవ్ ,డాక్టర్ రాధా కళ్యాణి జేఎన్టీయూ ప్రొఫెసర్, ANSET మేనేజర్ చిగిచెర్ల శ్రీనివాసులు, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఏవో బాలాజీ నాయక్, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర రమేష్, రాయల్ యూత్ సొసైటీ అధ్యక్షుడు రాయల్ రంగా, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాతి జీవన్ కుమార్ మరియు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలలకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వైద్యం, నైపుణ్య శిక్షణ అందించాలి

- జువెనైల్ జస్టిస్ చట్ట నిబంధనలను పక్కాగా అమలు చేయాలి
- బాలల సంరక్షణ కేంద్రాల్లో సదుపాయాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తనిఖీలు

విజయవాడ నవంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

బాలల సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాలలకు మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం, వైద్య సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్, జిల్లా స్థాయి కమిటీ చైర్మన్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. బాలల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేలా నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యా శిక్షణ అందించాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పరిధిలోని సితార కబేలా, రైల్వే స్టేషన్, హనుమాన్‌పేట ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ బాలుర హోమ్, నవజీవన్ బాల భవన్ ఓపెన్ షెల్టర్, ఎస్‌కేసీపీ బాలల సంరక్షణ కేంద్రాలను శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వ బాలుర హోమ్‌ను సందర్శించిన జాయింట్ కలెక్టర్ బాలలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, ఆరోగ్య పరిస్థితులు తదితర అంశాలపై హోమ్ సూపరింటెండెంట్ శరత్ బాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలలు ఎప్పటి నుంచి హోమ్‌లో ఉంటున్నారు, ఏయే ప్రాంతాల నుంచి వచ్చారు, వారి కుటుంబ సభ్యులు ఎవరైనా వచ్చి పరామర్శిస్తున్నారా అనే విషయాలను ఆరా తీశారు. బాలలకు ప్రతిరోజూ ఆకుకూరలు, కూరగాయలు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే పోషకాహారం అందించాలని, నిర్దిష్ట మెనూ చార్ట్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. వంటగది, నిల్వ గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రంలో బాలలు ఆటలు ఆడుకునేందుకు తగిన స్థలం, అవసరమైన ఆట వస్తువులు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి, విద్యకు ప్రోత్సాహం

బాలలందరికీ నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యా శిక్షణ అందించి, భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అనంతరం బాలలతో ముఖాముఖి మాట్లాడి, కేంద్రాల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలలకు సూచిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. కేంద్రాల్లోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ జువెనైల్ జస్టిస్ చట్టం నిబంధనల ప్రకారం అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఈ తనిఖీల్లో జువెనైల్ వెల్ఫేర్ డైరెక్టర్ వసంతబాల, జిల్లా ప్రొబేషన్ అధికారి సత్యవతి, డీసీపీవో ఎం. రాజేశ్వరరావు, జువెనైల్ జస్టిస్ సభ్యురాలు బి. పుష్పలత, డాక్టర్ అమితా, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సురేష్, ప్రభాకర్, దుర్గాప్రసాద్, జాన్సన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగాపే ఆశ్రమంలకు కట్టెలు వితరణ



– అన్నదానం చేసిన కట్టెల డిపో బషీర్

యాడికి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్ :

మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు పక్కన ఉన్న అగాపే ఆశ్రమానికి గురువారం కట్టెల డిపో బషీర్ వితరణ చేశారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు.ఆశ్రమానికి నాలుగు ట్రాక్టర్ల కట్టెలను డిపో బషీర్ అందచేసి, ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు.దాత భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ళు ,సుఖశాంతులతో జీవించాలని వృద్ధులు, ఆశ్రమం ఫౌండేషర్ బత్తుల ప్రసాద్ లు దీవించారు.ఈ కార్యక్రమంలో కుటుంబం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్
- స్థానిక పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలి
- కాలుష్య రహిత శ్రీ సత్యసాయి జిల్లా నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో 70 విద్యార్థి బృందాల భాగస్వామ్యం
- రాష్ట్రస్థాయి ప్రదర్శనకు 7 ఉత్తమ ప్రాజెక్టుల ఎంపిక

కొత్తచెర్వు, నవంబర్ 19:అనంత జనశక్తి న్యూస్

నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు చిన్ననాటి నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం కొత్తచెర్వు జెడ్పి హెచ్ పాఠశాల బాలురు లో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (NCSC) జిల్లా స్థాయి ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, తమ చుట్టూ ఉన్న స్థానిక పర్యావరణ పరిస్థితులను నిశితంగా గమనించాలని సూచించారు. ప్రకృతికి హాని కలిగించని పర్యావరణహితమైన వస్తువులను తయారు చేయడంపై దృష్టి సారించాలని, తద్వారా శ్రీ సత్యసాయి జిల్లాను ఒక ఆదర్శవంతమైన, కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను ఆయన పరిశీలించి, వారి సృజనాత్మకతను అభినందించారు.జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల నుండి మొత్తం 70 బృందాలుగా విద్యార్థులు తాము రూపొందించిన వినూత్న పరిశోధనా ప్రాజెక్టులతో ఈ ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నట్లు కార్యక్రమ సమన్వయకర్త జగదీష్, అకాడమిక్ సమన్వయకర్త శ్రీనివాసరావు తెలిపారు.ప్రదర్శించిన ప్రాజెక్టులలో ప్రతిభ కనబరిచిన ఏడు (7) ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులుగా మంజుల, మహేంద్ర రెడ్డి, జయశంకర్, ముబారక్, మనోహర్, ప్రవీణ్, సురేష్ వ్యవహరించారని జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ పేర్కొన్నారు. ఈ ముగింపు సమావేశంలో డిఇఓ క్రిస్టప్ప, ప్రధానోపాధ్యాయులు గోపాల్, వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారి (MEO) జయచంద్ర, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆకుతోటపల్లిలో టిడిపి ప్రచార జోరు



ఎస్కేయూ నవంబర్ 19 (అనంత జనశక్తి)

ఆకుతోటపల్లి గ్రామంలో టిడిపి సర్పంచ్ అభ్యర్థి రాగే సరస్వతి భర్త రాగే మురళీమోహన్ విస్తృత ప్రచారం నిర్వహించారు. వివర్స్ కాలనీ, మారుతి పురం లో ఇంటింటికి తిరిగి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా రాగే మురళీమోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆశీస్సులతో సర్పంచ్ అభ్యర్థిగా రాగే సరస్వతి అవకాశం కల్పించారని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు . గ్రామంలో ప్రధానంగా రోడ్లు, మురికినీటి కాలువ సమస్య, లైట్లు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీరక మనోహర్, చలపతి గౌడ్, ఎంపీటీసీ పతి, రాగే రామకృష్ణ, అనిల్ చౌదరి, గణేష్, పూల రాజు, పూల నారాయణస్వామి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు

మండల పరిషత్ అధ్యక్షురాలిగా శిరగం భీమల

అనంతగిరి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి మండలం టోకూరు ఎంపీటీసీ సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీగా గెలుపొందిన శిరగం భీమల, తొలిసారిగా ఈ సెగ్మెంట్ నుంచి మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నికై ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై ప్రజలు ఉంచిన నమ్మకానికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి ఈ విజయం నిదర్శనమని అన్నారు.తన పదవీకాలంలో అనంతగిరి మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేరేలా తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని శిరగం భీమల పేర్కొన్నారు.

పోలింగ్ జరిగే ప్రాంతాల్లో స్థానిక సెలవు..

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఉత్తర్వులు

విజయవాడ నవంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు-2026 నేపథ్యంలో పోలింగ్ జరిగే ప్రాంతాల్లో స్థానిక సెలవులు, వేతనంతో కూడిన సెలవులు, మద్యం దుకాణాల మూసివేతకు సంబంధించి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజున స్థానిక సెలవు వర్తిస్తుందన్నారు. ఓటు హక్కు కలిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ రోజున ఓటు వేయడానికి వీలుగా పరిస్థితులను బట్టి కొంత సమయం వెసులుబాటు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలు, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు తమ ఉద్యోగులకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని సూచించారు. సాధ్యం కాని పరిస్థితుల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ సమయంలో కనీసం మూడు గంటల పాటు పనికి విరామం కల్పించాలని తెలిపారు. దుకాణాలు, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు కూడా వేతనంతో కూడిన సెలవు వర్తించేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో పోలింగ్ ముగిసే సమయానికి 44 గంటల ముందు నుంచే మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఎక్సైజ్, పోలీసు అధికారులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

ఎన్టీఆర్ జిల్లాలో 16 ఎంపీపీ పీఠాలు టీడీపీ కైవసం

- ఉపాధ్యక్ష స్థానాల్లో 13 టీడీపీకి, 3 జనసేనకు

- ప్రశాంతంగా ముగిసిన ఎంపీపీ, ఉపాధ్యక్షుల ఎన్నికలు

విజయవాడ, నవంబర్ 19:అనంత జనశక్తి న్యూస్

ఎన్టీఆర్ జిల్లాలోని 16 మండల ప్రజా పరిషత్‌ల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు నిర్వహించిన పరోక్ష ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని మొత్తం 16 మండల పరిషత్ అధ్యక్ష స్థానాలను తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. ఉపాధ్యక్ష స్థానాల్లో 13 స్థానాలను టీడీపీ, మూడు స్థానాలను జనసేన పార్టీ అభ్యర్థులు దక్కించుకున్నారు.ఈ ఎన్నికల వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ డాక్టర్ జి. లక్ష్మీశ వెల్లడించారు. రిజర్వేషన్లకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు.మండలాల వారీగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. చందర్లపాడు ఎంపీపీగా దాసర నరసమ్మ, వైస్ ఎంపీపీగా నల్లాని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జగ్గయ్యపేటలో అధ్యక్షురాలిగా కట్టా సరస్వతి, ఉపాధ్యక్షురాలిగా మువ్వ పద్మ, కంచికచర్లలో అధ్యక్షురాలిగా శివనాగమల్లేశ్వరి కొగంటి, ఉపాధ్యక్షురాలిగా నాయిని త్రివేణి (జనసేన) ఎన్నికయ్యారు.నందిగామలో అధ్యక్షురాలిగా గడిపర్తి సుశీల, ఉపాధ్యక్షురాలిగా రుద్రపోగు వెంకటరావమ్మ (జనసేన), పెనుగంచిప్రోలులో అధ్యక్షురాలిగా గజ్జి విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా గజ్జి కృష్ణమూర్తి, వత్సవాయిలో అధ్యక్షురాలిగా పెరుమాళ్లపల్లి సునీత, ఉపాధ్యక్షురాలిగా స్వప్న పెంటేల ఎన్నికయ్యారు. వీరులపాడులో అధ్యక్షురాలిగా నంద్రు వనిత, ఉపాధ్యక్షుడిగా మేకపోతుల నర్సిరెడ్డి, ఎ.కొండూరులో అధ్యక్షుడిగా భూక్య సురేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా జాస్తి శ్రీ చందన్, గంపలగూడెంలో అధ్యక్షురాలిగా బురుగు అంజలి, ఉపాధ్యక్షుడిగా చెరుకూరి సాయిచంద్ ఎన్నికయ్యారు.రెడ్డిగూడెంలో అధ్యక్షుడిగా ముప్పిడి నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బొమ్మిన కోటేశ్వరరావు, తిరువూరులో అధ్యక్షుడిగా గద్దె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కోమటి వెంకటరామారావు, విస్సన్నపేటలో అధ్యక్షురాలిగా వల్లభనేని రాణి, ఉపాధ్యక్షురాలిగా సంబారు విజయలక్ష్మి ఎన్నికయ్యారు.జి.కొండూరులో అధ్యక్షురాలిగా గెరా అనిత, ఉపాధ్యక్షురాలిగా అనురాధిక వుయ్యూరు, ఇబ్రహీంపట్నంలో అధ్యక్షురాలిగా గొరిజాల వెంకట శివకుమారి, ఉపాధ్యక్షురాలిగా చింతల లక్ష్మీకుమారి (జనసేన) ఎన్నికయ్యారు. మైలవరంలో అధ్యక్షురాలిగా వేముల సరోజిని, ఉపాధ్యక్షుడిగా సూరిసెట్టి రమణ (జనసేన), విజయవాడ రూరల్‌లో అధ్యక్షుడిగా పరుచూరి నరేష్, ఉపాధ్యక్షుడిగా నబిగాని కొండయ్య ఎన్నికయ్యారు.అధ్యక్ష పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్, మహిళా కేటగిరీలకు కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆయా మండలాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ఆయన ఆకాంక్షించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విద్యార్థుల ప్రతిభకు ప్రతీక



- అమరావతి మాక్ అసెంబ్లీకి ధర్మవరం విద్యార్థుల ఎంపిక

- బీఎస్ఆర్ పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ స్థానాలు

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:

రాజ్యాంగ దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాక్ అసెంబ్లీ పోటీల్లో ధర్మవరం బీఎస్ఆర్ పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన డి. లలితేష్ ప్రథమ స్థానం, వై. చైతన్య ప్రసాద్ ద్వితీయ స్థానం సాధించి ప్రతిభ కనబరిచారు. దీంతో వీరిద్దరూ అమరావతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు.

నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున ఎంపిక

జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ప్రతి నియోజకవర్గం నుంచి ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. మాక్ అసెంబ్లీ ద్వారా విద్యార్థుల్లో శాసనసభ నిర్వహణ తీరుపై అవగాహన కల్పించడంతో పాటు రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, బాధ్యతాయుత పౌరసత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

విద్యార్థులకు గైడ్ టీచర్‌గా వ్యవహరించిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సానే రవీంద్రరెడ్డి మాట్లాడుతూ..... విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంచడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆసక్తిని కలిగించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి అమరావతి మాక్ అసెంబ్లీకి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి మేరీ వరకుమారితో పాటు ఉపాధ్యాయులు లలితేష్, చైతన్య ప్రసాద్‌లను అభినందించారు.

భక్తికి అన్నదానం.... మానవత్వానికి చేయూత

- మాలధార భక్తులకు రెండో రోజు నిత్య అన్నవితరణ.. డోలా దంపతుల సేవా సంకల్పం

- దీక్షా భక్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రెండో రోజు అన్నదాన కార్యక్రమం

- డోలా రాజారెడ్డి, డోలా ఓబులమ్మ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమం





శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,

నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:

భక్తి మార్గంలో కొనసాగుతున్న మాలధార భక్తులకు అండగా నిలుస్తూ 35వ వార్డు కౌన్సిలర్ డోలా రాజారెడ్డి, ఆయన సతీమణి డోలా ఓబులమ్మ ఆధ్వర్యంలో రెండో రోజు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సమీపంలో ఉన్న శిరిడి సాయిబాబా దేవాలయంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందించి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. మాలధారణ చేపట్టి దీక్షలో ఉన్న భక్తులు ప్రతిరోజూ ఆలయానికి తరలివస్తున్న నేపథ్యంలో వారికి భోజన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో భక్తులకు ఆప్యాయంగా అన్నప్రసాదాన్ని అందిస్తూ వారి ఆకలి తీర్చడం ద్వారా డోలా దంపతులు సేవా భావాన్ని చాటుకుంటున్నారు. అన్నదానం కేవలం ఆహారం అందించడం మాత్రమే కాదని, అవసరమైన సమయంలో తోటి మనిషికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఈ కార్యక్రమం ద్వారా చాటుతున్నారని పలువురు భక్తులు పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉంటూ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, తన వంతుగా భక్తులకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. మాలధార భక్తుల పట్ల ఆప్యాయతతో నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం మరికొంతకాలం కొనసాగించాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు మరింత మంది దాతలు ముందుకు రావాలని భక్తులు ఆకాంక్షించారు. సేవకు హోదా కాదు.. మంచి మనసే ప్రధానమనే సందేశాన్ని డోలా దంపతుల అన్నదాన కార్యక్రమం చాటుతోంది.

గాండ్లపెంట ఎంపీపీగా అంజనమ్మ..

- ఎన్నికైన వారిచే ప్రమాణం చేయించిన ఎన్నికల అధికారి..

గాండ్లపెంట, నవంబర్,19, అనంత జనశక్తి న్యూస్,

మండల పరిషత్ అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులను తెలుగుదేశం పార్టీ ఎట్టకేలకు కైవసం చేసుకుంది. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్ రామ్ నిర్వహించిన ఈ ఎన్నికలో మొదట ఎన్నికైన ఏడు మంది సభ్యుల చేత సంతకాలు తీసుకున్నారు. మండలంలోని ఏడు ఎంపీటీసీ స్థానాల్లో నాలుగు స్థానాల్లో తెదేపా మూడు స్థానాల్లో వైకాపా సభ్యులు గెలుపొందారు.గెలుపొందిన అభ్యర్థులు గురువారం నిర్వహించిన ఎంపీపీ ఎన్నిక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో తెదేపా, వైసిపి అభ్యర్థులు విడివిడిగా కూర్చున్నారు. మొదట ఎన్నికల అధికారి ఎన్నికైన సభ్యుల చేత ప్రమాణం చేయించారు. అనంతరం మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నిక కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా మలమీద పల్లి ఎంపీటీసీ సభ్యుడు హరిప్రసాద్ మండల అధ్యక్షురాలిగా ఆంజనేయ పేరును ప్రతిపాదించాడు. అనంతరం సోమయాజులపల్లి ఎంపిటిసి సభ్యురాలు మోతాది కాంతమ్మ అంజనమ్మ పేరును బలపరిచింది. దీంతో మండల పరిషత్ అధ్యక్షురాలుగా కటారు పల్లి ఎంపీటీసీ స్థానం నుంచి నుంచి ఎన్నికైన బి. అంజనమ్మ ను ఎన్నికల అధికారి ఏకగ్రీవంగా మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా చామలగొంది ఎంపిటిసి సభ్యులైన ఈశ్వరమ్మను సోమాజులపల్లి ఎంపీటీసీ సభ్యురాలు కాంతమ్మ ప్రతిపాదించగా, మల్ల మీద పల్లి ఎంపీటీసీ సభ్యుడు హరిప్రసాద్ ఈమెను బలపరిచారు. దీంతో అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు ఎన్నిక ముగిసింది. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యాయులను, ఇతర ఎంపీటీసీ సభ్యులను ఎంపీడీవో రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది దుశ్శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సోమశేఖర్ రెడ్డి వెంకటరమణారెడ్డి సొసైటీ అధ్యక్షుడు రామంజులు రెడ్డి,మోహన్ దొన్నికొండ ఆనంద్, దాసి రెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు



ఎస్కేయు మహిళ క్రీడా పోటీలలో సత్తాచాటిన కే.హెచ్ విద్యార్థులు



శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:

ఎస్కేయూనివర్సిటీ పరిధి లోని అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు నవంబర్ నెల 17, 18వ తేదీలలో యస్. యస్. జి. యస్ కళాశాలలో జరిగిన మహిళా క్రీడపోటీలలో 16సంవత్సరాల తర్వాత ధర్మవరంలోని కే.హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా బాల్ బాడ్మింటన్ జట్టు విజయం సాధించింది,క్రీడలో మొదట గవర్నమెంట్ డిగ్రీ కళాశాల అనంతపురం ను ఓడించి సెమీఫైనల్స్ లో యస్.యల్.యన్.డిగ్రీ కళాశాల జట్టుతో తలపడి 20 ఓడించి ఫైనల్ లో కే ఎస్ ఎన్ మహిళా కళాశాలతో జరిగిన హోరహోరీ మ్యాచ్ లో ఓటమితో ద్వితీయ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టు సభ్యులను కెప్టెన్ పి. పుష్పాంజలి , పి. గాయత్రి, యం.రక్షిత, ఎస్. జాయిస్ విక్టోరియా,కే.వసంత, ఎం నందిని,సి.రమ్య,టీ. రిబ్కా,కే.సాయి శ్రీ, డి.దివ్య రాణి ద్వితీయ స్థానంలో నంలో నిలిపారు వీరిని కళాశాల ప్రిన్సిపల్ డా . కే. సుందరేశ్వరరావు వైస్ ప్రిన్సిపల్ ఏ ఆదినారాయణ ఫిజికల్ డైరెక్టర్ బి. ఆనంద్ , ఎస్ పావని, డాక్టర్ హెచ్ శివ శంకర్ ఏ. సౌజన్య లక్ష్మి, ఎస్ ఒబులపతి, జి ధనుంజయ్,బి. జోత్స్న, తాహిర్ అలీ,తదితర ఆద్యాపక ఆద్యాపకేతర సిబ్బంది జట్టును అభినందించారు.

రాప్తాడు మండల పరిషత్ అధ్యక్షుడిగా దగ్గుపాటి శ్రీనివాసులు

- ఉపాధ్యక్షుడిగా తలారి శివయ్య ఎన్నిక.. నూతన పాలకవర్గం కొలువుదీరింది

రాప్తాడు, నవంబర్ 19: అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు మండల పరిషత్‌కు నూతన పాలకవర్గం కొలువుదీరింది. మండల పరిషత్ అధ్యక్షుడిగా దగ్గుపాటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా తలారి శివయ్య ఎన్నికయ్యారు.బుధవారం రాప్తాడు మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దగ్గుపాటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా తలారి శివయ్య ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షులతో ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో రాప్తాడు మండల పరిషత్‌లో నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



డిసెంబర్ 18 నుంచి 21 వరకు రోజ్ అండ్ అగ్రి హార్టికల్చర్ షో

- ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ నవంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

పూల పెంపకం, ఉద్యానవనాల అభివృద్ధి, పచ్చదనం విస్తరణతో పాటు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన, ఆసక్తి పెంపొందించేందుకు రోజ్ అండ్ అగ్రి హార్టికల్చర్ షో ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న 9వ రోజ్ అండ్ అగ్రి హార్టికల్చర్ షో పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. నగర ప్రజలు, ప్రకృతి ప్రేమికులు, పూల పెంపకంపై ఆసక్తి ఉన్నవారు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. విజయవాడలోని లలితా జ్యువెల్లరీ సమీపంలో ఉన్న సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రదర్శనలో వివిధ రకాల గులాబీ పూలు, ఉద్యానవన మొక్కలు, వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు నర్సరీ మేళా, సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాల్లో మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ ఉత్పత్తుల వినియోగం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శన మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రోజ్ సొసైటీ అధ్యక్షురాలు కె. లక్ష్మీ తులసి, కార్యదర్శి కె. విశాల, సభ్యులు సీతా మహాలక్ష్మి, జి.ఎస్. ఆర్. మోహన్ రావు, జి.లక్ష్మి, సుమ బిందు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేక్ డివైడర్లు

-పరిటాల శ్రీరామ్ ఆదేశాలతో సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన 45వ వార్డు కౌన్సిలర్ జింకా లావణ్య, పురుషోత్తం

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి , నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణంలోని 45వ వార్డులో వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను నివారించేందుకు వార్డు కౌన్సిలర్ జింకా లావణ్య, ఆమె భర్త జింకా పురుషోత్తం ముందడుగు వేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు తమ సొంత ఖర్చులతో వార్డులో అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేక్ డివైడర్లను ఏర్పాటు చేయించారు.వార్డులో వాహనాల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో వేగంగా ప్రయాణించే వాహనాల కారణంగా ప్రమాదాల అవకాశాలు ఉండటంతో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. ముఖ్యంగా పాదచారులు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు రహదారులు దాటే సమయంలో ఇబ్బందులు లేకుండా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేక్ డివైడర్లు ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారి భద్రతకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కౌన్సిలర్ జింకా లావణ్య తెలిపారు. వార్డులో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రజా అవసరాల కోసం సొంతంగా ముందుకొచ్చి పనులు చేపట్టడం పట్ల స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ కౌన్సిలర్ శీలా మూర్తి, జింకల రాజన్న, రాఘవ నాయుడు, బాబా, రాము తదితరులు పాల్గొన్నారు.



విజయానికి వ్యక్తిత్వమే పునాది

- జ్ఞానం, నైపుణ్యంతో పాటు నైతిక విలువలు అవసరం: ఎస్కేయూ వీసీ ఆచార్య జ్యోతి కుమార్

అనంతపురం, నవంబర్ 19: అనంత జనశక్తి న్యూస్

విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కేవలం విద్యార్హతలు ఉంటే సరిపోదని, జ్ఞానం, నైపుణ్యం, సానుకూల వైఖరితో పాటు ఉత్తమ వ్యక్తిత్వం, నైతిక విలువలు ఎంతో అవసరమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ అన్నారు.గురువారం విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ విభాగం, ఎస్కేయూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా ప్రమాణాలు, వృత్తిపరమైన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై పలు సూచనలు చేశారు.మేనేజ్‌మెంట్ విద్యార్థులతో మాట్లాడుతూ జ్ఞానం, నైపుణ్యం, వైఖరి (KSA)తో పాటు మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వినూత్నంగా ఆలోచించడం, సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవడం, ఎలాంటి సవాళ్లు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రామోజీ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026లో ప్రస్తావించబడిన గుజరాత్‌లోని భావ్‌నగర్‌కు చెందిన డాక్టర్ గణేష్ బరయ్యా జీవితాన్ని విద్యార్థులకు ఉదాహరణగా వివరించారు. ఎన్నో ప్రతికూల పరిస్థితులు, న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి వైద్య విద్యను పూర్తి చేసి వైద్యుడిగా సేవలందిస్తున్న ఆయన విజయగాథ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించవచ్చని, లక్ష్యసాధనలో వెనుకడుగు వేయకూడదని విద్యార్థులకు సూచించారు.విద్యార్హతలు, హోదాల కంటే వ్యక్తిత్వానికే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వీసీ పేర్కొన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సానుభూతి, బాధ్యతాయుత ప్రవర్తన వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఎస్కేయూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులతో మాట్లాడుతూ మంచి ఉపాధ్యాయుడికి ఉండాల్సిన లక్షణాలపై వారిని ప్రశ్నించారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకుని, ఉపాధ్యాయుడు ప్రేమ, ఓర్పు, కరుణ, అంకితభావంతో బోధన సాగించాలని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంతో పాటు సమాజ భవిష్యత్తును నిర్మించే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు.బి.ఎడ్. విద్యార్థులు విద్యార్థులే కేంద్రంగా బోధన సాగిస్తూ, నిబద్ధత, సామాజిక బాధ్యత కలిగిన ఆదర్శ ఉపాధ్యాయులుగా ఎదగాలని, తద్వారా దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఆచార్య జ్యోతి కుమార్ పిలుపునిచ్చారు.



సమన్వయంతో పనిచేస్తూ మండలాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

- మంత్రి కందుల దుర్గేష్

- పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల నూతన ఎంపీటీసీల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రివర్యులు కందుల దుర్గేష్

- నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ హాజరు..ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ధృవీకరణ పత్రాలు అందజేసి అభినందనలు తెలిపిన మంత్రి దుర్గేష్

- 'అమరజీవి జలధార' పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఇంటింటికీ గోదావరి జలాలు అందించాలని దిశానిర్దేశం

- పదవులు అలంకారం కాదు.. ప్రజాసేవకు బాధ్యత: మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు నవంబర్ 19,అనంత జనశక్తి న్యూస్

పదవులు అలంకారం కాదు.. ప్రజాసేవకు బాధ్యత అని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు..గురువారం నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాలకు స్వయంగా హాజరైన మంత్రి దుర్గేష్ ప్రజామోదంతో ఎన్నికైన ప్రతి సభ్యుడిని ఆప్యాయంగా పలకరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పెరవలి మండల నూతన ఎంపీపీగా ఎన్నికైన దాసం నరసవేణి, వైస్ ఎంపీపీ అక్కిన నాగమణికి, ఉండ్రాజవరం ఎంపీపీ చిట్టూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కాపకాయల కుమారికి, నిడదవోలు మండల ఎంపీపీ చదలవాడ నతానియేలు రాజు, వైస్ ఎంపీపీ కొప్పిరెడ్డి గాయత్రీ దేవిలకు ఎన్నికల ధృవీకరణ పత్రాలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కీలక సూచనలు చేశారు..రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, ఆ తర్వాత పార్టీలకు అతీతంగా ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేయాలని సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కట్టబెట్టిన ఈ పదవులను బాధ్యతగా స్వీకరించి, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేరువ చేయాలి

గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా స్థానిక నాయకులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు.గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ ఆదర్శ గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ప్రత్యేకించి గ్రామాల్లో, మండలాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారుల వంటి కనీస మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు..గెలిచిన తర్వాత నాయకులు ప్రజలకు దూరంగా ఉండకూడదని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నప్పుడే నిజమైన ప్రజాప్రతినిధులుగా గుర్తింపు లభిస్తుందని హితవు పలికారు.

అమరజీవి జలధార పనుల వేగవంతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పెరవలి మండలంలో శంకుస్థాపన చేసిన 'అమరజీవి జలధార' కార్యక్రమ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి దుర్గేష్ తెలిపారు. తద్వారా ప్రజలందరికీ ఇంటింటికీ శుద్ధి చేసిన సురక్షిత గోదావరి మంచినీటిని అందించేలా యుద్ధ ప్రాతిపదికన కృషి చేయాలన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రజాప్రతినిధులుగా అత్యధిక అవకాశాలు కల్పించి మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందని, ఇందుకు నిదర్శనంగా పెరవలి మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవుల రెండింటిలోనూ మహిళలే ఎన్నిక కావడం గమనార్హమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా మూడు మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా జరగడానికి సహకరించిన ఎన్నికల అధికారులకు, పోలీసు యంత్రాంగానికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అంతకుముందు కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్‌కు కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం చివరలో నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులతో మంత్రి దుర్గేష్ గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంపీడీవోలు,ఇతర ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సృజనాత్మకత, సాంస్కృతిక విలువలు పెంపొందించడమే యువజనోత్సవాల లక్ష్యం

- దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకం

- డా. కె. కల్యాణి రాధ

జేఎన్టీయూ నవంబర్ 19 (అనంత జనశక్తి)

విద్యార్థుల్లో కళలు, సాహిత్యం, సంస్కృతి పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా యువజన సేవల శాఖ ఎస్.ఆర్. ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాల్‌లో యువజనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల, అనంతపురం, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. కె. కల్యాణి రాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. కె. కల్యాణి రాధ మాట్లాడుతూ, విద్య అనేది కేవలం పుస్తక పరిజ్ఞానానికి, పరీక్షల్లో సాధించే మార్కులకు మాత్రమే పరిమితం కాకూడదని, విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మక అభిరుచి, సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు మరియు నైతిక విలువలను పెంపొందించడం కూడా విద్యలో అంతర్భాగమని పేర్కొన్నారు.

విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి కళలు, సాహిత్యం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వివరించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి, సమాజంలోని సమస్యలపై అవగాహన పెంచుకోవడానికి మరియు ప్రతిభను ప్రదర్శించడానికి గొప్ప వేదికలుగా నిలుస్తాయని అన్నారు.దేశాభివృద్ధిలో యువత పాత్రను వివరిస్తూ, నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు, నాయకులు, పరిపాలకులు, ఆవిష్కర్తలు మరియు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పౌరులని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సృజనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి విలువలను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే విధంగా యువత ముందుకు సాగాలని సూచించారు.



శెట్టూరు ఎంపీపీగా రామలక్ష్మి ఏకగ్రీవ ఎన్నిక.. ఘనంగా ప్రమాణ స్వీకారం

శెట్టూరు, నవంబర్ 19: అనంత జనశక్తి న్యూస్:

శెట్టూరు మండల పరిషత్ అధ్యక్షురాలిగా ములకలేడు ఎంపీటీసీ సభ్యురాలు రామలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులందరి ఏకాభిప్రాయంతో ఆమెను ఎంపీపీగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన ఎంపీపీ రామలక్ష్మి ఘనంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు కూడా అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.నూతన ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన రామలక్ష్మికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణుల కోలాహలం మధ్య ప్రమాణ స్వీకార కార్యక్రమం సందడిగా సాగింది.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి హాకీ పోటీలకు సనప లక్ష్మి ఎంపిక

- రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ.. ఆంధ్రప్రదేశ్ జట్టులో చోటు

ఆత్మకూరు, నవంబర్ 19: అనంత జనశక్తి న్యూస్

గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని హాకీ క్రీడలో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికైంది. పులివెందులలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్19 హాకీ టోర్నమెంట్‌లో సనప లక్ష్మి అద్భుత ప్రతిభ కనబరిచి, తన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోటీల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా జనవరిలో పంజాబ్‌లోని లుధియానాలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) జాతీయస్థాయి అండర్19 హాకీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఎంపికైంది. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలతో పాటు గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. లక్ష్మి సాధించిన విజయంపై గ్రామ పెద్దలు, వ్యాయామ ఉపాధ్యాయుడు (పీడీ) గట్టు నాగరాజు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.జాతీయస్థాయి పోటీల్లోనూ సనప లక్ష్మి తన ప్రతిభను చాటుకుని ఆంధ్రప్రదేశ్‌కు పతకం సాధించి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.



డ్రగ్స్ నివారణ పై అవగాహన సదస్సు.

- ఎక్సైజ్ సీఐ చంద్రమణి

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్ :



మారక ద్రవ్యాల నివారణ చర్యలో భాగంగా ధర్మవరం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇన్స్పెక్టర్ చంద్ర మణి , ధర్మవరం పద్మావతి డిగ్రీ మహిళ కళాశాల యందు విద్యార్థులకు డ్రగ్స్ నివారణ పై అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం వారు సూచనలు తెలుపుతూ... డ్రగ్స్ ఉపయోగిస్తే విద్యార్థుల యొక్క బంగారు భవిష్యత్ అంధకారం అవుతుంది అని, ఉద్యోగ అవకాశాలు కోల్పోతారు అని తెలిపారు. అదే విధంగా పై చదువుల కోసం విదేశాల వెళ్లే వారు పాస్ పోర్ట్ ను రద్దు చేస్తారు అని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులపై ఒక్కసారి ఇలాంటి మారక ద్రవ్యాల విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు అయితే మీ యొక్క భవిష్యత్తును మీరే సర్వ నాశనం చేసుకున్న వారు అవుతారు అని తెలిపారు. కావున విద్యార్థులు ఎటువంటి చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండాలి అని, మీ చుట్టూ పరిసరాల ప్రాంతంలో ఎవరైనా డ్రగ్స్ వ్యవహారాలు నిర్వహిస్తే ఉన్నట్లు మీరు చూసినచో టోల్ ఫ్రీ నెంబర్ 14405 కు డైల్ చేయండి అని తెలిపారు. ఈ ప్రోగ్రాం లో కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున ధర్మవరం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినులకు మందుల సురక్షిత వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు.



- డిప్యూటీ డి ఎం ఎన్ హెచ్ ఓ.. డాక్టర్ భాగ్యలక్ష్మి.

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్ :

జిల్లా కలెక్టర్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గారి ఆదేశాల మేరకు, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్. భాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలోని వాసవి గర్ల్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ఆఫీసర్ ఎస్. విజయ్ కుమార్ విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... అపసరం లేని నొప్పి నివారణ మందులు యాంటీబయాటిక్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, సొంత వైద్యం చేసుకోవడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, అర్హత లేని వైద్యుల వద్ద చికిత్స పొందడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించామని తెలిపారు.
అలాగే, ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా అర్హత కలిగిన వైద్యులను మాత్రమే సంప్రదించి, వారి సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. ముఖ్యంగా యాంటీబయాటిక్స్‌ను వైద్యుల సలహా లేకుండా వాడకూడదని తెలిపారు. విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాల పరిశుభ్రత, శుభ్రమైన ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్ల ప్రాముఖ్యతను వివరించామన్నరూ. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేదాంభిక , కమ్యూనిటీ ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ, జ్యోతి, వెంకటేష్, ఏఎన్ఎం రమణమ్మ, ఉమా ఆశా కార్యకర్తలు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామనేపల్లి వద్ద బోల్తాపడ్డ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు!



- బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం.. 30 నుంచి 40 మంది ప్రయాణికులకు గాయాలు

- ఘటనా స్థలంలోనే పలువురికి ప్రథమ చికిత్స.. ఆసుపత్రికి తరలింపు

రాప్తాడు నవంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

జిల్లా రాప్తాడు మండలం రామనేపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎఫ్ఆర్‌కే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30 నుంచి 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ప్రయాణికులందరికీ గాయాలైనట్లు తెలుస్తోంది. అయితే ఎవరికీ ప్రాణాపాయం లేదని ప్రాథమిక సమాచారం. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా బస్సు అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ ఘటనా స్థలం నుంచి పరారైనట్లు సమాచారం

క్షతగాత్రులకు ఘటనాస్థలంలోనే ప్రథమ చికిత్స

ప్రమాద సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్వల్ప గాయాలైన కొంతమంది ప్రయాణికులకు అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించారు. 108 అంబులెన్స్ ఈఎంటీ రామాంజనేయులు, పైలట్ రాము క్షతగాత్రులకు వైద్య సేవలు అందించారు. అనంతరం గాయపడిన వారిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స పొందిన కొంతమంది ప్రయాణికులు ఇతర వాహనాల్లో తమ గమ్యస్థానాలకు వెళ్లినట్లు 108 సిబ్బంది తెలిపారు.

సనప గ్రామంలో
ఫైలేరియా వ్యాధి నివారణకు ప్రత్యేక సర్వే



- ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాల సేకరణ..

వ్యాధిపై ప్రజలకు అవగాహన

ఆత్మకూరు, నవంబర్ 19: అనంత జనశక్తి న్యూస్

ఫైలేరియా వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపే లక్ష్యంగా ఆత్మకూరు మండలంలోని సనప గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోజ్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ సబిహా సుల్తానా, మలేరియా సబ్‌యూనిట్ అధికారి మద్దయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు.సూపర్‌వైజర్లు నూర్ బాషా, శ్రీధర్ మూర్తి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఫైలేరియా వ్యాధి నిర్ధారణ కోసం రక్త నమూనాలు సేకరించారు. అనంతరం గ్రామస్తులకు ఫైలేరియా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఫైలేరియా వ్యాధి సోకిన వారిలో కాళ్ల పరిమాణం క్రమంగా పెరగడం, జ్వరం, చలి, శోషరస గ్రంథుల వద్ద నొప్పి, వాపు వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉందని వైద్య సిబ్బంది వివరించారు. వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి తొట్టెలు, డ్రమ్ములకు మూతలు పెట్టాలని, దోమల ఆవాస ప్రాంతాలను నిర్మూలించాలని, దోమల బారిన పడకుండా దోమతెరలు వినియోగించాలని ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ షమీమ్ తారా, పీహెచ్ఎన్ సూర్యకళ, సూపర్‌వైజర్లు వెంకటరత్నమ్మ, మధుబాబు, పురుష ఆరోగ్య కార్యకర్తలు మురళి, ముకుంద, రమేష్, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల వేళ
తలుపుల లో పోలీసుల పహారా



- ఎంపీడీవో కార్యాలయం వద్ద భారీ బందోబస్తు.

- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసుల ముందస్తు చర్యలు

తలుపుల నవంబర్19 (అనంత జనశక్తి న్యూస్

మండల ప్రజా పరిషత్‌లో ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్దా పోలీసుల పహారాలోకి వెళ్లింది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.ఎంపీడీవో కార్యాలయం పరిసరాల్లో స్పెషల్ పార్టీ పోలీసులు, పోలీసు సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడం, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించబడటం లక్ష్యంగా పోలీసులు పహారా కాస్తున్నారు. రాజకీయ పోటీలు ఎలా ఉన్నా, శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదనే సంకేతాలను పోలీసుల భారీ బందోబస్తు స్పష్టం చేస్తోంది.

లేపాక్షిలో పదవి బాధ్యతలు
స్వీకరించిన ఎంపిటిసిలు



లేపాక్షి, నవంబర్ 19, అనంత జనశక్తిన్యూస్:

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం ఆర్ ఓ పెంచలయ్య , ఏ ఆర్ ఓ వాసుదేవరెడ్డి, ఎంపీటీసీల చే ప్రమాణ స్వీకారం చేయించారు. మండల పరిషత్ అధ్యక్షుడిగా ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గా శరివరం సోలేహ ప్రమాణ స్వీకారం చేశారు. వీరికి పలువు నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ పిఏలు సురేంద్ర ,బాలాజీ టిడిపి కన్వీనర్ అభిలాష్, టిడిపి పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ కుమార్, టూరిజం డైరెక్టర్ జయప్ప, తాసిల్దార్ సౌజన్య లక్ష్మి తదితర నాయకులు ఎంపిటిసిలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

డీఎస్సీకి బీసీ అభ్యర్థులకు
ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

- నవంబర్ 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

- బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.జగ్గయ్య

విజయవాడ నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

డీఎస్సీ-2026 నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్‌టీఆర్ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, విజయవాడ సంచాలకులు ఇ.జగ్గయ్య తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్ పోస్టుల నియామక పరీక్షలకు సంబంధించి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు టెట్‌లో ఉత్తీర్ణులైన బీసీ అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో కలిపి నవంబర్ 25, 2026వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్, విజయవాడ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, టి.టి.సి. లేదా బి.ఎడ్., టెట్ మార్కుల జాబితాలు, కుల ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,00,000 లోపు ఉన్నట్లు తెలిపే ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను జతపరచాలి. దరఖాస్తులు సమర్పించాల్సిన చిరునామా: బీసీ స్టడీ సర్కిల్, డోర్ నెం. 7421/5, అశోక్ నగర్, పందిరిపురం, రోడ్డు నెం. 8, విజయవాడ-520007. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 8688855255, 9966849937, 9505094349. డీఎస్సీ-2026 నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన బీసీ అభ్యర్థులు ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.జగ్గయ్య కోరారు.

మైనర్ బాలికపై అత్యాచారయత్నం.. నిందితుడికి ఐదేళ్ల జైలు

- రూ.6 వేల జరిమానా..

బాధితురాలికి రూ.75 వేల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం

అనంతపురం, నవంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడి, ఈ విషయం బయటకు చెబితే చంపుతానంటూ బెదిరించిన నిందితుడికి అనంతపురం పోక్సో ప్రత్యేక న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అంతేకాకుండా రూ.6 వేల జరిమానా చెల్లించాలని, బాధిత బాలికకు రూ.75 వేల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన నగిరి రమేష్ (39) ఈ కేసులో నిందితుడు.కేసు వివరాలు..2021 సెప్టెంబర్ 10వ తేదీ ఉదయం 6.30 గంటల సమయంలో రాయలచెరువు గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక బహిర్భూమికి వెళ్తుండగా నిందితుడు ఆమె నోరు మూసి సమీపంలోని కంప చెట్లలోకి లాక్కెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించడంతో పాటు, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.అనంతరం బాలిక జరిగిన విషయాన్ని తన అక్కకు తెలియజేయడంతో ఇద్దరూ యాడికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ రాంభూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం నిందితుడిపై పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు.

10 మంది సాక్షులతో నేరం రుజువు

యాడికి పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 312/2021 కింద ఐపీసీ 506, 376 రెడ్‌విత్ 511, పోక్సో చట్టం లోని సెక్షన్ 7 రెడ్‌విత్ 8 ప్రకారం కేసు నమోదైంది. అనంతపురం పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో జరిగిన విచారణలో ప్రాసిక్యూషన్ తరపున 10 మంది సాక్షులను విచారించారు.
సాక్ష్యాధారాల ఆధారంగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి చిన్నబాబు గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడు నగిరి రమేష్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.75 వేల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.మురళీకృష్ణ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు.

పోలీసుల కృషితో శిక్ష

జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు డీసీఆర్‌బీ/కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ ఎస్.మురళీకృష్ణ, యాడికి సీఐ ఆర్.శ్రీనివాసులు, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ మారన్న కేసు
విచారణను పర్యవేక్షించారు. సీఎంఎస్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసులు, కోర్టు పీసీ బి.రామమోహన్ సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు.

రీపోలింగ్‌కు ఏమాత్రం తావులేకుండా పంచాయతీ ఎన్నికలను
ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

- ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

- బ్యాలెట్ పేపర్ల నిర్వహణ, టెండర్ ఓట్లు, ఛాలెంజ్ ఓట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ.

విజయవాడ: నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

సాధారణ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లకు, రీపోలింగ్‌కు తావులేకుండా అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ స్పష్టం చేశారు విజయవాడలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళా వేదికలో గురువారం సాధారణ పంచాయతీ ఎన్నికల మొదటి విడత ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికల విధులపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపు ఒకే రోజు నిర్వహించనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఒత్తిడి, పోటాపోటీ వాతావరణం ఉండే అవకాశం ఉందని, అధికారులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత చిత్తంతో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, ప్రామాణిక కార్యాచరణ విధానాలనన తూచా తప్పకుండా పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, ఎన్నికల నిర్వహణలో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారుల కరదీపికను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి దశలో అనుసరించాల్సిన విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.ఏవైనా సందేహాలు తలెత్తితే సొంత నిర్ణయాలు తీసుకోకుండా సంబంధిత ఉన్నతాధికారుల సూచనలు తీసుకోవాలని తెలిపారు. గత ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లను సక్రమంగా మడతపెట్టకపోవడం, వేలిముద్ర సిరా అంటుకోవడం వంటి కారణాలతో కొన్ని ఓట్లు చెల్లకుండా పోయాయని గుర్తుచేశారు. ఈసారి అటువంటి పొరపాట్లు జరగకుండా ఓటర్లకు బ్యాలెట్ పేపర్ మడతపెట్టే విధానంపై ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ సమయంలో ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పుడు ప్రిసైడింగ్ అధికారులు నిబంధనల ప్రకారం ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సును ప్రిసైడింగ్ అధికారి నిరంతరం తన పర్యవేక్షణలో ఉంచుకోవాలని, ఓటర్లు బ్యాలెట్ పేపర్లను బయటకు తీసుకెళ్లకుండా, ఇతర కాగితాలను బ్యాలెట్ బాక్సులో వేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ వెనుక ముద్ర వేసే సమయంలో అధికంగా ఇంకు పడకుండా, పేపర్ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే సంబంధిత కేంద్రాలకు చేరుకుని అక్కడి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. స్థానిక పోలీసు, రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. మొదటి విడత ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించి, తదుపరి విడతల ఎన్నికలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.సీతామహాలక్ష్మి, ఆర్డీఓ వెన్నెల శ్రీను, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి నాంచారారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.ప్రభాకరరావు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, విజయవాడ, నందిగామ డివిజనల్ పంచాయతీ అధికారులు రాఘవన్, లక్ష్మీ కుమారి, ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ విజేతలను అధికారికంగా ప్రకటించిన ఎంపీడీవో

- 13 గ్రామపంచాయతీల్లో ఆరు స్థానాలతో వైఎస్ఆర్సీపీ ఆధిక్యం.

- టీడీపీకి ఐదు, జనసేన, బీజేపీకి చెరో స్థానం

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి,

నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్ :

మండల పరిషత్ ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీపీ, ఉపాధ్యక్షుల వివరాలను ఎంపీడీవో వెంకటేశు గురువారం అధికారికంగా ప్రకటించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడిగా గొట్లూరు ఎంపీటీసీ సభ్యుడు టి. శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా పోతుకుంట ఎంపీటీసీ సభ్యుడు అంగజాల రాజశేఖర్ ఎన్నికైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, ఉపాధ్యక్షులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పరిధిలోని 13 గ్రామపంచాయతీల్లో ఎంపీపీ విజేతలుగా చిగిచెర్ల నుంచి పి. రత్నమ్మ, దర్శనమల నుంచి కే. బొజ్జప్ప, ధర్మపురి నుంచి వి. చంద్రశేఖర్, ఏలుకుంట్ల నుంచి వి. గనే నాయక్, గొట్లూరు నుంచి టి. శ్రీనివాసులు, కునుతూరు నుంచి టి. లక్ష్మీదేవి, మల్కాపురం నుంచి కే. కాటమయ్య, మల్లాకాలువ నుంచి పి. భార్గవి, పోతుకుంట నుంచి అంగజాల రాజశేఖర్, పోతుల నాగేపల్లి నుంచి ఈశ్వరమ్మ, రావులచెరువు నుంచి జి. ప్రవంతి, రేగాటిపల్లి నుంచి ఎం. రమణమ్మ, తుమ్మల నుంచి జి. దివాకర్‌రెడ్డి విజయం సాధించినట్లు ఎంపీడీవో వెల్లడించారు.
పార్టీల వారీగా పరిశీలిస్తే మొత్తం 13 స్థానాల్లో వైఎస్ఆర్సీపీకి చెందిన ఆరుగురు, టీడీపీకి చెందిన ఐదుగురు, జనసేనకు చెందిన ఒకరు, బీజేపీకి చెందిన ఒకరు విజయం సాధించారు. దీంతో మండల పరిషత్ పరిధిలో వైఎస్ఆర్సీపీ ఆరు స్థానాలతో ముందంజలో ఉండగా, టీడీపీ ఐదు స్థానాలతో తర్వాతి స్థానంలో నిలిచింది. జనసేన, బీజేపీ చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి.
ఎంపీపీగా టి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా అంగజాల రాజశేఖర్ ఎన్నిక కావడంతో మండల పరిషత్ పాలనలో కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై నూతన పాలకవర్గం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.



12వ వార్డులో బాబులు ప్రచార హోరు..
వెల్లువెత్తుతున్న ప్రజామద్దతు

- బీఫామ్ అందుకున్న మరుక్షణం నుంచే ప్రజాక్షేత్రంలోకి బాబులు..

ప్రజల మనిషిగా పేరొందిన బాబులు

- రాజమహేంద్రవరం 12వ వార్డులో ఊపందుకున్న కూటమి ప్రచారం..

- ప్రజలతో మమేకమవుతున్న 12వ వార్డు కూటమి అభ్యర్థి చిక్కాల వీర వెంకటరమణ (బాబులు)

- ఇంటింటికీ వెళ్తూ అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తున్న జనసేన అభ్యర్థి బాబులు

- 12వ వార్డు అభివృద్ధికి చిరునామా చిక్కాల వీర వెంకటరమణ.. ఆయన గెలుపు ఖాయం అంటున్న 12వ వార్డు ప్రజలు

రాజమహేంద్రవరం

నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా కూటమి బలపరిచిన 12వ వార్డు జనసేన అభ్యర్థి చిక్కాల వీర వెంకటరమణ(బాబులు) తనదైన శైలిలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.. ప్రజల వద్దకు వెళ్లి తాను గెలిస్తే చేసే ప్రగతి ఏంటో స్పష్టంగా వివరిస్తున్నారు... తన గెలుపు 12వ వార్డుకు ఎంత ముఖ్యమో ప్రజలకు తెలుపుతున్నారు.. బీఫామ్ అందుకున్న మరుక్షణం నుండి ప్రజల్లోనే ఉంటూ ప్రజల కోసం పనిచేస్తూ ప్రజల్లోనే తిరుగుతున్నారు.. వీధి వీధి లో ఉన్న ఇంటింటికి వెళ్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ తనదైన శైలిలో ప్రచారం చేస్తూ దూసుకెళ్తున్నారు.. ఈ సందర్భంగా 12వ వార్డులోని షెట్టన్ హోటల్ సమీపంలోని రైతు నగర్ లో పర్యటిస్తున్న బాబులును ప్రజలు ఘనంగా స్వాగతించి పూలమాలలతో సత్కరించారు.. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలకడం విశేషం..బాబులు ప్రజల మనిషని కీర్తిస్తున్నా



నల్లచెరువు ఎంపీపీగా బసిరెడ్డి అనిత

నల్లచెరువు నవంబర్ 19 అనంత జన శక్తి న్యూస్

మండల కేంద్రమైన నల్లచెరువు మండల పరిషత్ అధ్యక్షురాలిగా బసిరెడ్డి అనిత ను ఉపాధ్యక్షులుగా తలమర్లవాండ్లపల్లి పంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థి అయిన ఆంజనేయులు ఉపాధ్యక్షులుగా ఎంపిటిసి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు నల్లచెరువు మండల పరిధిలో 9 ఎంపీటీసీలు ఉండగా 9 ఎంపీటీసీలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడంతో ఎంపీటీసీ అభ్యర్థుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎంపీపీని మరియు వైస్ ఎంపీపీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఎంపీపీ బసి రెడ్డి అనిత మాట్లాడుతూ కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు ఆయన ఆశీర్వాదంతో మొదట ఎంపీటీసీ అభ్యర్థిని అయ్యి ఈరోజు ఎంపీపీ పదవి రావడంతో చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు అలాగే నన్ను గెలిపించిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు ఈరోజు నుండి ప్రజా సమస్యల కొరకు ప్రతిక్షణం పనిచేస్తానని ఎవరికి ఏ ఇబ్బంది కలిగిన పార్టీ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం చేయడానికి ముందుంటానని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో బసిరెడ్డి అనితకు ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది మరియు అభిమానులు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికి ఎంపీపీ స్థానంలో కూర్చోబెట్టారు.ఈ కార్యక్రమంలో బసిరెడ్డి అనిత భర్త విశ్వనాథ్ రెడ్డి మరియు మాజీ ఎంపీపీ రమణారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలోకి 15 కుటుంబాలు చేరిక

- మంత్రి సవిత సమక్షంలో టీడీపీ కండువా కప్పుకుని

పార్టీలో చేరిన వైసీపీ శ్రేణులు

పెనుకొండ నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం బీచిగానిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాలాజీ ఆధ్వర్యంలో సుమారు 15 కుటుంబాలు బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితమ్మ సమక్షంలో టీడీపీలో చేరాయి.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- జిల్లా పరిషత్ పీఠంపై పరిటాల శ్రీరామ్ విజయకేతనం.....
- నల్లచెరువు నుంచి జిల్లా రాజకీయాల శిఖరాగ్రానికి ప్రస్థానం.....
- శ్రీ సత్యసాయి జిల్లా తొలి జెడ్పీ చైర్మన్‌గా చరిత్రలో ప్రత్యేక స్థానం..
- రాజకీయ వారసత్వానికి నాయకత్వ బాధ్యతలు తోడవడంతో తెలుగుదేశం శ్రేణుల్లో నూతనోత్సాహం!

ఆ గయా షేర్ కా బేటా.. జెడ్పీ పీఠంపై పరిటాల శ్రీరామ్ పంజా!







ధర్మవరం నవంబర్ 19 (అనంత జనశక్తి న్యూస్):

శ్రీ సత్యసాయి జిల్లా రాజకీయ యవనికపై మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఎన్నో రాజకీయ పరిణామాలు, వ్యూహాత్మక సమీకరణాలు, నాయకుల మధ్య చర్చలు, పార్టీ శ్రేణుల కృషి, ప్రజాప్రతినిధుల మద్దతు వంటి అనేక అంశాల మధ్య జిల్లా రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని పరిటాల శ్రీరామ్ అధిరోహించడం రాజకీయ వర్గాల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది. నల్లచెరువు జెడ్పీటీసీగా ప్రజాప్రతినిధి ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, ఇప్పుడు శ్రీ సత్యసాయి జిల్లా తొలి జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టే స్థాయికి చేరుకోవడం సాధారణ రాజకీయ పరిణామం కాదు. ఒక ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రారంభమైన ప్రయాణం, జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు దిశానిర్దేశం చేసే స్థాయికి చేరడం ఆయన రాజకీయ జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. రాజకీయంగా బలమైన నేపథ్యం కలిగిన పరిటాల కుటుంబం నుంచి వచ్చిన శ్రీరామ్‌కు ఈ విజయం కుటుంబ వారసత్వానికి మరో గుర్తింపును తీసుకురావడమే కాకుండా, తనకంటూ ప్రత్యేక రాజకీయ ప్రస్థానాన్ని నిర్మించుకునేందుకు ఒక కీలక అవకాశాన్ని కల్పించింది. రాజకీయాల్లో వారసత్వం ఒక ప్రారంభ పరిచయాన్ని అందించవచ్చేమో కానీ, ఆ గుర్తింపును నిలబెట్టుకోవడానికి నాయకత్వ సామర్థ్యం, ప్రజలతో అనుబంధం, పార్టీ శ్రేణులతో సమన్వయం, ప్రజా సమస్యలపై స్పందించే బాధ్యతాయుతమైన వైఖరి అవసరం. ఈ నేపథ్యంలో జెడ్పీ చైర్మన్ పీఠం పరిటాల శ్రీరామ్‌కు గౌరవప్రదమైన గుర్తింపుతో పాటు అంతకుమించిన ప్రజా బాధ్యతలను కూడా తీసుకొచ్చింది. నల్లచెరువు నుంచి జిల్లా రాజకీయాల కేంద్రబిందువు వరకు సాగిన ఈ ప్రయాణం రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు వేదిక కానుందన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

నల్లచెరువు నుంచి జిల్లా రాజకీయాల శిఖరాగ్రానికి.. ఇదీ శ్రీరామ్ ప్రస్థానం!

ఒక మండలానికి ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం, జిల్లా వ్యాప్తంగా ఉన్న స్థానిక సంస్థల కార్యకలాపాలకు నాయకత్వం వహించే స్థాయికి చేరుకోవడం రాజకీయంగా ప్రత్యేకమైన పరిణామం. నల్లచెరువు జెడ్పీటీసీగా ఎన్నికైన పరిటాల శ్రీరామ్‌కు జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలు దక్కడం ఈ ప్రస్థానంలో అత్యంత కీలకమైన మలుపుగా నిలిచింది. నల్లచెరువు ప్రాంత ప్రజల తరపున జిల్లా పరిషత్‌లో అడుగుపెట్టిన ఆయనకు ఇప్పుడు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామీణ ప్రాంతాలు, స్థానిక సంస్థల అభివృద్ధి అంశాలపై విస్తృతమైన బాధ్యతలు నిర్వర్తించే అవకాశం లభించింది. ఒక ప్రాంతానికి సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యత కల్పించే అభివృద్ధి ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లడం వరకు ఆయన పాత్ర విస్తరించనుంది. ఈ క్రమంలో నల్లచెరువు ప్రజాప్రతినిధిగా పొందిన అనుభవం, స్థానిక నాయకులతో ఏర్పడిన సంబంధాలు, పార్టీ శ్రేణులతో ఉన్న అనుబంధం ఆయనకు ఉపయోగపడే అవకాశముంది. అయితే జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన దృష్టి ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా జిల్లా మొత్తంపై ఉండాల్సిన అవసరం ఉంది. ఏ మండలంలో ఏ సమస్య ఉంది? ఏ గ్రామానికి తాగునీటి సదుపాయం అవసరం? ఎక్కడ రహదారులు అభివృద్ధి చెందాలి? ఏ పాఠశాలకు అదనపు వసతులు కల్పించాలి? ఏ ప్రాంతంలో వైద్య సదుపాయాలు మెరుగుపడాలి? అనే అంశాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఆయన ముందున్న ప్రధాన బాధ్యత. నల్లచెరువు నుంచి ప్రారంభమైన ఈ రాజకీయ ప్రస్థానం ఇప్పుడు జిల్లా స్థాయిలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా సాగాల్సిన కీలక దశకు చేరుకుంది.

రాజకీయ సమీకరణాలకు తెర.. వ్యూహాలకు ఫలితం.. టీడీపీ శ్రేణుల్లో జోష్!

జిల్లా పరిషత్ చైర్మన్ పదవి సాధించడం అనేది కేవలం ఒక ఎన్నికల ప్రక్రియతో ముగిసిపోయే అంశం కాదు. దాని వెనుక రాజకీయ బలాబలాలు, ప్రజాప్రతినిధుల మద్దతు, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలు, స్థానిక స్థాయి సమన్వయం, వ్యూహాత్మక చర్చలు వంటి అనేక అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. శ్రీ సత్యసాయి జిల్లా రాజకీయాల్లో కూడా జెడ్పీ చైర్మన్ పీఠం చుట్టూ ఆసక్తికరమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకోవడం, చివరకు పరిటాల శ్రీరామ్‌కు ఆ బాధ్యత దక్కడం తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. జిల్లా స్థాయిలో కీలకమైన పదవి పార్టీకి దక్కడం ద్వారా స్థానిక సంస్థల్లో పార్టీ ప్రాతినిధ్యానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఎన్నికల సమయంలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు సాధించిన రాజకీయ ఫలితానికి ఈ పరిణామం మరో గుర్తింపుగా భావిస్తున్నారు. అయితే రాజకీయ విజయాన్ని కేవలం పదవుల సాధనతోనే కొలవలేము. పదవి చేపట్టిన తరువాత పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని కొనసాగించడం, ప్రజాప్రతినిధుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వడం, అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయించడం ద్వారా మాత్రమే ఆ విజయానికి పూర్తి అర్థం చేకూరుతుంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమష్టి అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత చైర్మన్‌పై ఉంటుంది. పార్టీ శ్రేణుల్లో కనిపిస్తున్న ఉత్సాహాన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలుగా మలచగలిగితే ఈ రాజకీయ విజయం మరింత సార్థకమవుతుంది. అందుకే పరిటాల శ్రీరామ్‌కు లభించిన జెడ్పీ పీఠం తెలుగుదేశం పార్టీకి ఒక రాజకీయ విజయమే కాకుండా, జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసుకునే కీలక అవకాశంగా కూడా మారనుంది.

తొలి చైర్మన్‌గా చరిత్రలో నిలిచే అవకాశం.. భవిష్యత్తుకు బలమైన పునాదులు!

కొత్తగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లాకు తొలి జిల్లా పరిషత్ చైర్మన్‌గా గుర్తింపు పొందడం పరిటాల శ్రీరామ్ రాజకీయ జీవితంలో ప్రత్యేకమైన ఘట్టం. ఒక జిల్లాకు తొలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాయకుడికి చరిత్రలో ప్రత్యేక స్థానం లభించడంతో పాటు, ఆ వ్యవస్థకు భవిష్యత్తులో అనుసరించాల్సిన దిశను నిర్దేశించే అవకాశం కూడా ఉంటుంది. జిల్లా ఏర్పడిన తరువాత పరిపాలనా అవసరాలు, స్థానిక సంస్థల సమన్వయం, గ్రామీణాభివృద్ధి ప్రాధాన్యతలు మరింత విస్తరించాయి.

ఈ పరిస్థితుల్లో జిల్లా పరిషత్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామీణ ప్రాంతాల అవసరాలను గుర్తించడం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం అత్యంత కీలకం. తొలి చైర్మన్‌గా ఆయన తీసుకునే నిర్ణయాలు, రూపొందించే కార్యాచరణ, అధికార యంత్రాంగంతో ఏర్పరచుకునే సమన్వయం భవిష్యత్తులో జిల్లా పరిషత్ పనితీరుకు ఒక దిశానిర్దేశంగా నిలిచే అవకాశం ఉంది. జిల్లా పరిషత్ సమావేశాలను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వడం, నిధుల వినియోగంపై పర్యవేక్షణ, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. అంతేకాకుండా జిల్లాలోని ప్రతి ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను తెలియజేసే అవకాశం కల్పించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగితే తొలి చైర్మన్‌గా ఆయన చేపట్టే కార్యక్రమాలు చిరస్మరణీయంగా నిలిచే అవకాశం ఉంది. చరిత్రలో తొలి వ్యక్తిగా పేరు నమోదు చేసుకోవడం ఒక గుర్తింపు అయితే, ఆ పదవిలో ఉండగా ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి వారి హృదయాల్లో స్థానం సంపాదించుకోవడం మరింత గొప్ప గుర్తింపు. ఈ రెండింటినీ సాధించే దిశగా పరిటాల శ్రీరామ్‌కు ఇప్పుడు ఒక అరుదైన అవకాశం లభించింది.

యువ నాయకత్వానికి కీలక అవకాశం.. జిల్లా రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం!

మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో యువ నాయకత్వానికి ప్రాధాన్యత పెరుగుతోంది. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, మారుతున్న అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిపాలనలో వినియోగించడం, యువతను ప్రజా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వంటి అంశాలు నేటి నాయకత్వానికి ముఖ్యమైన సవాళ్లుగా మారాయి. ఈ నేపథ్యంలో పరిటాల శ్రీరామ్ జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలు చేపట్టడం యువ నాయకత్వానికి ఒక ముఖ్యమైన అవకాశంగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. జిల్లా స్థాయిలో విస్తృతమైన ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయడం, వివిధ ప్రాంతాల సమస్యలను తెలుసుకోవడం, అభివృద్ధి కార్యక్రమాల అమలును పర్యవేక్షించడం ద్వారా ఆయనకు పరిపాలనా అనుభవం మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా యువత ఎదుర్కొంటున్న ఉపాధి సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా అవకాశాల విస్తరణ, క్రీడా సదుపాయాల కల్పన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తే యువతతో మరింత అనుబంధం ఏర్పడుతుంది. అదే సమయంలో మహిళలు, రైతులు, గ్రామీణ పేదలు, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను మరింత సమర్థంగా నిర్వర్తించే అవకాశం ఉంటుంది. రాజకీయాల్లో యువ నాయకుడిగా ఎదగడం ఒక దశ అయితే, ప్రజల అవసరాలకు అనుగుణంగా బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకుంటూ నాయకత్వాన్ని నిరూపించుకోవడం మరో దశ. ఇప్పుడు పరిటాల శ్రీరామ్ ఈ రెండో దశలో అడుగుపెడుతున్నారు. ఆయన తీసుకునే నిర్ణయాలు, ప్రజలతో ఏర్పరచుకునే అనుబంధం, అభివృద్ధి కార్యక్రమాలపై చూపే చొరవే భవిష్యత్తులో ఆయన రాజకీయ ప్రస్థానానికి మరింత బలాన్ని చేకూర్చనున్నాయి.



పరిటాల కుటుంబానికి రాజకీయ చరిత్ర.. శ్రీరామ్‌కు నాయకత్వ బాధ్యతల కొత్త అధ్యాయం!

ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయ చరిత్రలో పరిటాల కుటుంబం పేరు ప్రత్యేకంగా వినిపిస్తుంది. దశాబ్దాలుగా జిల్లా రాజకీయాలపై ప్రభావం చూపిన ఈ కుటుంబానికి ప్రజాజీవితంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. రాజకీయ పోరాటాలు, పార్టీ నిర్మాణం, కార్యకర్తలతో అనుబంధం, ప్రజా సమస్యలపై స్పందన వంటి అంశాలతో పరిటాల కుటుంబం తనదైన ముద్ర వేసుకుంది. ముఖ్యంగా పరిటాల రవీంద్ర పేరు జిల్లా రాజకీయాల్లో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోగా, ఆయన రాజకీయ వారసత్వాన్ని కొనసాగించే బాధ్యత తరువాతి తరంపై పడింది. ఆ నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన పరిటాల శ్రీరామ్ ఇప్పుడు జిల్లా స్థాయిలో అత్యంత కీలకమైన బాధ్యతను చేపట్టడం కుటుంబ రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యమైన పరిణామంగా భావిస్తున్నారు. అయితే తండ్రి సంపాదించిన గుర్తింపును కొనసాగించడం ఒక అంశమైతే, మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో తనదైన నాయకత్వ లక్షణాలతో ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం మరో అంశం. ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటిస్తూ ముందుకు సాగాల్సిన బాధ్యత ఇప్పుడు శ్రీరామ్‌పై ఉంది. రాజకీయ వారసత్వం ఆయనకు ఒక బలమైన నేపథ్యాన్ని అందించినప్పటికీ, జెడ్పీ చైర్మన్‌గా ఆయన తీసుకునే నిర్ణయాలు, ప్రజాప్రతినిధులతో వ్యవహరించే తీరు, అధికార యంత్రాంగంతో సమన్వయం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై చూపే చొరవే ఆయన నాయకత్వానికి అసలైన కొలమానంగా నిలవనున్నాయి. పరిటాల కుటుంబానికి ఉన్న రాజకీయ గుర్తింపును మరింత విస్తరించడంతో పాటు, జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేసే అవకాశం ఇప్పుడు శ్రీరామ్ ముందుకు వచ్చింది. అందుకే ఈ జెడ్పీ పీఠం ఆయనకు కేవలం రాజకీయ పదవి మాత్రమే కాదు.. కుటుంబ రాజకీయ వారసత్వాన్ని ప్రజాసేవ రూపంలో ముందుకు తీసుకెళ్లాల్సిన కీలక బాధ్యత కూడా!

అగళి ఎంపీపీగా గంగమ్మ.....వైస్ ఎంపిపిగా హళ్ళికేర రాజన్న

అగళి, నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్,

అగళి మండలంలోని స్థానిక ఎంపిడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ, వైస్ ఎంపిపి పదవులకు ఎంపిక జరిగింది. ఈ ఎంపికలో మధూడి గ్రామానికి చెందినా మెజారిటీతో గెలుపొందిన గంగమ్మను అగళి ఎంపీపీగా గంగమ్మ ఎన్నుకున్నారు. అలాగే వైస్ ఎంపిపిగా హళ్ళికేర రాజన్నను ఎన్నుకున్నారు. మండల పరిషత్ అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులను తెలుగుదేశం పార్టీ ఎట్టకేలకు కైవసం చేసుకుంది. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల
రిటర్నింగ్ అధికారి మోహన్ రావు ఎంపిటిసి సభ్యులు చేత సంతకాలు తీసుకున్నారు. మండలంలోని పది ఎంపీటీసీ స్థానాల్లో తొమ్మిది స్థానాల్లో తెదేపా ఒక స్థానాల్లో వైకాపా సభ్యులు గెలుపొందారు. అనంతరం రిటర్నింగ్ అధికారి మోహన్ రావు ఎంపీపీగా గంగమ్మ, వైస్ ఎంపిపిగా హళ్ళికేర రాజన్నను అలాగే ఎంపిటిసి సభ్యుల చేత ప్రమాణం చేయించారు. అగళి ఎంపీపీ గంగమ్మ మాట్లాడుతూ నన్ను ఎంపిపిగా నియమించినందుకు పార్టీ అధిష్టానానికి మరియు శాసనసభ్యులు ఎం.ఎస్.రాజు,



మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నలకు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మండల తెదేపా నాయకులు జడ్పీటీసీ ప్రమీల నరసింహమూర్తి, మాజీ జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ మధుడి
తిప్పేస్వామి, సింగల్ విండో అధ్యక్షులు కుమార స్వామి, జిల్లా ఆర్గనైసింగ్ సెక్రటరీ శ్రీనివాస్ మూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, మడకశిర వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్లు కేంచుయాదవ్, ఎం.ఆర్. శివరాములు, కోడిపల్లి రమేష్, గాయత్రి కాలనీ రాజన్న, సింగల్ విండో డైరెక్టర్ శివప్ప, యువనాయకులు ఎస్.బి.ఐ. మంజునాథ్, మండల ప్రధాన కార్యదర్శి డి.విశ్వనాథ్, హనుమనపల్లి రఘు, హనుమనహళ్లి భుతరాజు,
కమ్మరి శివన్న, రామనపల్లి కృష్ణప్ప, ఇరిగేపల్లి మంజుచరణ్, ఇరిగేపల్లి గొల్లహట్టి రెడ్డి, హుల్లెకేర భుతరాజు, గురుమూర్తి, నరసంబూది జయప్ప, ఎంపిటిసిలు అగలి కరియన్న, ఇరిగేపల్లి లక్ష్మమ్మ నింగన్న, ఆర్.జి.పల్లి రేణుక, నరసంబూది వరలక్ష్మి, మధూడి గంగమ్మ రమేష్, ఇనగలూరు మంజుల చంద్రశేఖర్, హల్లికేర కనకలక్ష్మి రాజన్న, రావుడి రమ్య నరసింహప్ప, కోడిపల్లి మల్లికార్జున, మాజీ ఎంపిపి బసవరాజు, మాజీ ఎంపిపి నరసింహప్ప, సునీల్ రంగారెడ్డి, ఇరిగేపల్లి మల్లేష్, తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు వారికి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

త్వరలో జర్నలిస్టుల హౌసింగ్ అంశాన్ని పరిష్కరిస్తాం



- ముఖ్యమంత్రి చంద్రబాబు
- తాజా పరిణామాలతో సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల్లో చిగురించిన ఆశలు.

అమరావతి, నవంబర్ 19:అనంత జనశక్తి న్యూస్

అమరావతిలో జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్టు ఏర్పాటుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని త్వరలోనే పూర్తి చేద్దామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు గురువారం సాయంత్రం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబు నాయుడును కలిసి జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్టుపై చర్చించారు. అమరావతిలో జర్నలిస్టుల కోసం ప్రతిపాదించిన గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, ప్రాజెక్టు అవశ్యకతను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జర్నలిస్టుల హౌసింగ్ అంశాన్ని త్వరలోనే పూర్తి చేద్దామని పేర్కొన్నారు.అనంతరం ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు.జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్టుపై ప్రభుత్వం త్వరలోనే సమావేశం నిర్వహించి తదుపరి చర్యలు చేపడుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు ఇతర ఉన్నతాధికారులను కూడా కలిసి జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను వివరించారు. తాజా పరిణామాలతో అమరావతిలో సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని ఎదురుచూస్తున్న జర్నలిస్టుల్లో ఆశలు చిగురించాయి.

ఛలో....ఢిల్లీనీ ముట్టడిద్దాం...!



- డిసెంబర్ 1,2,3 తేదీల్లో లక్షలాదిమంది కార్మికులు ఢిల్లీ ఆక్రమణ

అగళి నవంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

అగళి మండలంలోని గురువారం బస్టాండ్ నందు ఛలో....ఢిల్లీనీ ముట్టడిద్దాం...! కార్యక్రమములో భాగంగా సిఐటియు కార్యాలయంలో ప్రజా సంఘాలతో సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా లేబర్ కోడ్స్ రద్దు,కనీస వేతనం,కనీస ఆదాయం, సామాజిక భద్రత,కార్మికులుగా గుర్తింపు, ఉద్యోగాల పర్మినెంట్ కోసం, డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో లక్షలాదిమంది కార్మికుల ప్రజా సంఘాలతో సదస్సు నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి ,కార్మికులకు కనీస వేతనం 42 వేల రూపాయలు చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో సిఐటియు తలపెట్టిన ఢిల్లీ ఆక్రమణకు కార్మికులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చి, కనీస వేతనాన్ని మరింతగా దిగజార్చిందని, ఎనిమిది గంటల పని విధానానికి మంగళం పాడిందని, ఉద్యోగ భద్రతను కాలరాసింది, సమ్మె చేయకుండా ఆటంకాలు విధించింది, కోట్లాదిమంది కార్మికులను కార్మిక చట్టాల వెలుపలికి నెట్టింది, రాష్ట్ర కూటమి ప్రభుత్వం మోడీ ప్రభుత్వానికి తోకగా మారిందని, ముందు తలకాయ సంగతి తేల్చుకుంటే తోక ఊపడం అపుతుందని, అందుకే ఢిల్లీని ఆక్రమిద్దాం, లేబర్ కోడ్ల రద్దును, పని హక్కును కాలరాస్తూ రద్దు చేసిన మహాత్మా గాంధీ ఉపాధి పథకం పునరుద్ధరణను కోరుదామన్నారు, భూమి, నీరు, అడవులపై ప్రజల హక్కులు పరిరక్షించాలని, నీటిని కార్పొరేట్లకు కట్టబెట్టరాదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పై డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ, కార్మికులందరూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఆర్ రాము ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి సౌభాగ్య అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి కె.వి.పి.యస్. జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు శ్రీరామ్ రెడ్డి, ఆశ కార్యకర్తల జిల్లా కమిటి సభ్యులు మహాలక్ష్మి, అంగన్ వాడి మండల కన్వినర్ గీతమ్మ, అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మీ, పుష్ప, అంగన్వాడీ నరసమ్మ, టీచర్ సావిత్రమ్మ, రంగమ్మ, గీత, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతిని ఎప్పటికీ తక్కువ చేయను

నటి రాధికా ఆప్టే వ్యాఖ్యలపై నెలకొన్న వివాదానికి హీరోయిన్ కీర్తి సురేశ్ తాజాగా వివరణ ఇచ్చారు. రాధికా ఆప్టే మాట్లాడిన సమయంలో ఆమె ఉద్దేశం తనకు పూర్తిగా అర్థం కాలేదని అన్నారు. ప్రస్తుతం తన కొత్త సినిమా 'సత్యవాన్ సావిత్రి' ప్రమోషన్లలో బిజీగా ఉన్న కీర్తి.. ఓ ఇంటర్వ్యూలో రాధికా ఆప్టే వ్యాఖ్యల వివాదంపై స్పందించారు. గతంలో ఓ తెలుగు సినిమాలో తనకంటే ఎక్కువ వయసున్న హీరోతో రొమాన్స్ చేయాల్సి వచ్చిందని, కథలో భాగంగా తన మేనమామను పెళ్లి చేసుకునే పాత్రలో నటించానని రాధికా ఆప్టే ఇటీవల వ్యాఖ్యానించారు. అవి సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆ సమయంలో రాధికా ఆప్టే పక్కనే ఉన్న కీర్తి సురేశ్ నవ్వుతూ కన్పించడం కూడా విమర్శలకు కారణమైంది. ఈ క్రమంలోనే తాజాగా దీనిపై స్పందించిన కీర్తి.. "సినిమాలో మేనమామతో పెళ్లి గురించి రాధికా ఆప్టే ఏ ఉద్దేశంతో మాట్లాడారో మొదట నాకు అర్థం కాలేదు. ఆ తర్వాత ఆమె మన దక్షిణాది సంప్రదాయం గురించి మాట్లాడుతున్నారని తెలిసింది. మన సంస్కృతిని నేను ఎప్పటికీ తక్కువ చేసి మాట్లాడను. ఉత్తరాది వారికి మన సంప్రదాయాల గురించి తెలియకపోవచ్చు" అని స్పష్టం చేశారు.



సమంతకు జరిగిన వేడుక ఇదే

నటి సమంత జీవితంలో మరో మధురమైన వేడుక చోటుచేసుకుంది. ఆమెకు సంప్రదాయబద్ధంగా 'మాతృ శిశు మంగళ ఆశీర్వాదం' నిర్వహించారు. ఈ వేడుకకు సంబంధించిన విశేషాలను రాజ్ సోదరి శీతల్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. కుటుంబ సభ్యులు, పెద్దమ్మలు, పిన్నమ్మలు కలిసి సమంతను, పుట్టబోయే బిడ్డను ఆశీర్వదించినట్లు ఆమె తెలిపారు. తమ కుటుంబంలో పూజలు, భజనలు నిత్యజీవితంలో భాగమని రాజ్ సోదరి పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి బంధువులమంతా ఒక చోట చేరి పూజలు, వేడుకలు చేసుకుంటామని గుర్తుచేసుకున్నారు. తమ పెద్దమ్మలు, పిన్నమ్మలు ఎంతో దూరం ప్రయాణించి తమ కోసం వచ్చేవారన్నారు. ఇప్పుడు వారి ఆప్యాయత, అనురాగాలు సమంతకు, ఆమెకు పుట్టబోయే బిడ్డకు కూడా దక్కాయన్నారు. ఈ వేడక చాలా ఘనంగా జరిగిందని చెప్పిన ఆమె.. శ్రీ సూక్తం, గాయత్రీ దేవి హోమం నిర్వహించడంతో పాటు 21 సార్లు గాయత్రీ మంత్రాన్ని జపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శోభా రాజు.. సమంత కోసం ప్రత్యేకంగా ఓ పాటను రూపొందించారని తెలిపారు. 'బుజ్జాయి.. నువ్వు ఈ లోకంలోకి రాకముందే ఎంత ప్రేమను తీసుకొచ్చావో చూడు' అంటూ పుట్టబోయే బిడ్డను ఉద్దేశించి శీతల్ భావోద్వేగంగా రాసుకొచ్చారు. సమంతకు సుఖ ప్రసవం జరగాలని, తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు.



టబు @టన్నెల్‌మెన్?

దృశ్యం: ది కన్‌క్లూజన్' చిత్రంతో ఈ మధ్యే ఓ హిట్‌ని ఖాతాలో వేసుకున్నారు అగ్ర కథానాయిక టబు. ఇప్పుడామె తెలుగులో 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్', 'కింగ్ 100' సినిమాలలో నటిస్తూ సెట్స్‌పై తీరిక లేకుండా గడుపుతున్నారు. తాజాగా టబు ఖాతాలో ఒక ఓటీటీ ప్రాజెక్ట్ చేరినట్టు తెలిసింది. ప్రముఖ హిందీ చిత్ర నిర్మాణసంస్థ వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ రూపొందిస్తున్న ఓ సిరీస్‌లో ఆమె భాగమైనట్టు బాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. 'ది రైల్వే మెన్' ఫేమ్ దర్శకుడు శివ్‌రావెల్ ఈ సిరీస్‌కి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారట. 'టన్నెల్ మెన్' టైటిల్‌తో రూపొందుతున్న ఈ సిరీస్‌ని 2023లో జరిగిన ఉత్తరాఖండ్ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ స్ఫూర్తితో కల్పిత డ్రామాగా తీర్చిదిద్దుతున్నట్టు సమాచారం.



ప్రతినాయకుడి పాత్ర... అవాస్తవం!

ప్రముఖ కథానాయకుడు గోపీచంద్ ఓ తమిళ తార సినిమాలో ప్రతినాయకుడిగా నటిస్తున్నారని కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రచారం సాగుతోంది. అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని గోపీచంద్ బృందం బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. గోపీచంద్ సినిమాలకు సంబంధించిన ఏ సమాచారమైనా ఆయన అధికారికంగా ప్రకటిస్తారని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ఎవ్వరూ వ్యాప్తి చేయొద్దని అందులో పేర్కొంది. గోపీచంద్ కెరియర్ ఆరంభంలో ప్రతినాయక పాత్రలతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత కథానాయకుడిగా విజయాల్ని అందుకున్నారు.



వివాదంలో మాగ్నస్ కార్‌ల్‌సన్

నార్వే చెస్ సూపర్ స్టార్ మాగ్నస్ కార్‌ల్‌సన్‌కు వివాదాలేమీ కొత్త కాదు. తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నాడు. అయితే, ఈసారి అతడి ర్యాంకింగ్‌కు సంబంధించిన విషయం కావడం గమనార్హం. టోటల్ చెస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ టూర్ పైలట్ టోర్నీలో కజకిస్థాన్ క్రీడాకారిణి బిబిసారా అసౌబాయేవాతో పోటీల నుంచి వైదొలిగాడు. అదీనూ ప్రత్యర్థి బిబిసారాకు చెప్పకుండానే అక్కడ్నుంచి వెళ్లిపోయాడు. మరోవైపు బిబిసారా మాత్రం కాసేపు కార్‌ల్‌సన్ కోసం వేచి చూస్తూ ఉండిపోయారు. తాను వెళ్తున్నట్లు ఆర్బిటర్‌తో కార్‌ల్‌సన్ చెప్పినా.. ఆ విషయం బిబిసారాకు తెలియజేయకపోవడంతో వివాదం తలెత్తింది.

ర్యాంక్‌పై ప్రభావం చూపించలేదు..

టోటల్ చెస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో అర్ధంతరంగా నిష్క్రమించడంతోపాటు.. గ్రూప్ స్టేజ్‌లో కార్‌ల్‌సన్ గత వారం ఒక్క విజయం కూడా సాధించలేదు. ఈ దశలో మొత్తం 10 గేముల్లో తొమ్మిది డ్రా కాగా.. మరొక దాంట్లో ఓడిపోయాడు. దీంతో ఐదో స్థానంతో ముగించాడు. ఈ క్రమంలో 21.8 రేటింగ్ పాయింట్లను కోల్పోయాడు. దీంతో తొలిసారి 15 ఏళ్ల తర్వాత నంబర్ వన్ ర్యాంక్ మిస్ అవుతుందేమోనని అతడి అభిమానులు ఆందోళన చెందారు. కానీ, ఫిడే ఇప్పుడీ పైలట్ టోర్నీ పాయింట్లను పరిగణనలోకి తీసుకోకపోవడంతో కార్‌ల్‌సన్ ర్యాంక్‌పై ప్రభావం చూపించలేదు. దీంతో టోర్నీ నిర్వాహకులతోపాటు కార్‌ల్‌సన్ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. 'రేటింగ్ కంటే ముందు ఔచిత్యం, మర్యాద పతనమయ్యాయి' అని భారత ఒలింపియాడ్ చెస్ కెప్టెన్ శ్రీనాథ్ నారాయణన్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.



తుది జట్టును ఎంపిక చేయం కదా

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు మొదటి రోజు ఫస్ట్ సెషన్‌లో టీమ్‌ఇండియా పేసర్లు అదరగొట్టారు. నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిలో వణుకు పుట్టించారు. కానీ, ఆ తర్వాత కేవలం ఒక్క వికెట్ తీసి భారీగానే పరుగులు సమర్పించారు. జస్‌ప్రీత్ బుమ్రా (3/52) ఒత్తిడి తీసుకొచ్చినప్పటికీ.. అన్ష్ ల్ కాంబోజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ నుంచి రెండో సెషన్‌లో పెద్దగా సహకారం లేదు. అయితే, మహ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్‌లో ఒకరికి కూడా ఈ మ్యాచ్ తుది జట్టులో అవకాశం ఇవ్వకపోవడంతో మేనేజ్‌మెంట్‌పై విమర్శలు వచ్చాయి. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తొలి రోజు ఆట ముగిసిన తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ దీనిపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "సిరాజ్ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఎలాంటి పొరపాటు చేయలేదు. కివీస్‌తో తొలి టెస్టు కోసం ఎంపిక చేసిన జట్టు అత్యుత్తమమైనదే. సిరాజ్‌ను పక్కన పెట్టడం తప్పుడు నిర్ణయమేమీ కాదు. ఆటలో తొలి రోజు మాత్రమే ముగిసింది. జట్టు ఎంపిక అనేది కేవలం డే1 కోసమే చేయం కదా..! మిగిలిన రోజులూ ఉన్నాయి. తుది జట్టులో వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడానికీ ఓ కారణం ఉంది. ప్రత్యర్థి టీమ్‌లో నలుగురు ఎడమచేతివాటం బ్యాటర్లు ఉన్నారు. అందుకే, అతడికి చోటిచ్చాం. ఇది కచ్చితంగా బెస్ట్ ప్లేయింగ్ XI అని ఇప్పటికీ భావిస్తున్నా" అని సితాన్షు స్పష్టం చేశారు.



మావాళ్లు బాటిల్ మూతలను వాడేవారు

శాండ్‌పేపర్ గేట్ మళ్లీ రాజుకోవడంతో ఆస్ట్రేలియా జట్టు వార్తల్లో నిలిచింది. ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథలో బాల్ టాంపరింగ్ అంశంపై కీలక వ్యాఖ్యలు చేయడంతో ఆ టీమ్‌లో అభిప్రాయభేదాలు మొదలయ్యాయి. శాండ్‌పేపర్ వినియోగించడం గురించి నాడు జట్టులోని అందరికీ తెలుసనని.. ఆనాటి బాధితులు డేవిడ్ వార్నర్, బాన్‌క్రాఫ్ట్ చెబుతూ క్రికెట్ ఆస్ట్రేలియా విచారణను తప్పుబట్టారు. ఈ క్రమంలో పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. తాము శాండ్‌పేపర్‌ను కాకుండా.. బాటిల్ మూతలను బాల్ టాంపరింగ్ కోసం వినియోగించినట్లు చెప్పాడు."ఇకనైనా ఉస్మాన్ ఖవాజా వ్యాఖ్యలపై రాద్ధాంతం చేయడం ఆపేయండి. ఇలా చేస్తూ పోతే కచ్చితంగా క్రికెట్‌కు నష్టమే. మేం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు శాండ్‌పేపర్‌ను కాకుండా.. బాటిల్ మూతలను వినియోగించి బంతి ఆకారం మార్చేందుకు ప్రయత్నించేవాళ్లం. దక్షిణాఫ్రికా - ఆస్ట్రేలియా మధ్య ఎనిమిదేళ్ల కిందట చోటుచేసుకున్న ఘటనపై వాస్తవాలను ఖవాజా బయటపెట్టాలనుకున్నాడు. కానీ, ఇప్పుడు అది పెద్ద వివాదం అయిపోయింది. దీన్ని ఇక వదిలేయండి. నా పాత సహచర ఆటగాళ్లు చేసిన తప్పుల గురించి చెప్పడానికి చాలా విషయాలు ఉన్నాయి.



సోనాల్‌బెన్‌కు కాంస్యం

పటాయా: ఐటీటీఫ్ ప్రపంచ పారా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి సోనాల్‌బెన్ పటేల్ కాంస్యంతో చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీలో పతకం గెలిచిన భారత తొలి ప్లేయర్‌గా ఘనత సాధించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్లాస్-3 సెమీఫైనల్లో ఆమె 9-11, 11-6, 7-11, 5-11తో కార్లోటా రగాజిని (ఇటలీ) చేతిలో ఓడి, కాంస్యంతో సరిపెట్టుకుంది. 2020 పారాలింపిక్స్ పతక విజేత భావినా దేవి క్వార్టర్‌ఫైనల్లోనే నిష్క్రమించింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314